ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుల గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 284 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | శనివారం 10 జనవరి 2026 | పేజీలు : 12 | వెల : 3

Circulated by: Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar

### నెలాఖరులో పబ్లిక్ ఇష్యూకు యాక్సియమ్ గ్యాస్ ఇంజనీరింగ్

**హైదరాబాద్ :** ప్రైమ్ ఫ్యూల్ బ్రాండ్‌తో ఆటో ఎల్‌పీజీ గ్యాస్‌ను విక్రయించే యాక్సియమ్ గ్యాస్ ఇంజనీరింగ్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు రానున్నట్టు తెలిపింది. జనవరి చివరి వారంలో ఇష్యూకు వచ్చే అవకాశం ఉందని ఆ సంస్థ ప్రమోటర్ ఎంఎస్ బనాని వెల్లడించా రు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బనాని మాట్లాడుతూ..

### భారత్ కోకింగ్ కోల్ ఐపీఓ. నిమిషాల్లోనే సబ్‌స్క్రిప్షన్ పూర్తి!

**దిల్లీ:** ప్రభుత్వరంగ దిగ్గజం కోల్ ఇండియా అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు అనూహ్య స్పందన లభించింది. శుక్రవారం సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైన కొన్ని నిమిషాల్లోనే పూర్తి సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం.. మధ్యాహ్నం 11.15 గంటల సమయానికి 34,69,46,500 (34 కోట్ల) షేర్లకు గానూ 84,15,46,800 (84 కోట్ల) షేర్లకు

# వివాదాలు వద్దు

## పరస్పర సహకారం అవసరం



- తెలంగాణ రాష్ట్రానికి పంచాయితీ కావాలా?, నీళ్లు కావాలా? అని అడిగితే తాను నీళ్లే కావాలని కోరుకుంటా
- నీళ్ల వివాదం ముసుగులో రాజకీయ లబ్ధి పొందాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి లేదు
- రాజకీయాలకు అతీతంగా సమస్యల పరిష్కారం కోసం అందరూ సహకరించాలి
- మన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుందామని పిలుపు
- ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు పెట్టవద్దు
- అడ్డంకుల వల్ల కేంద్ర ప్రభుత్వ నిధులు రావడం లేదు
- రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని ఆవేదన
- కృష్ణా నది జల వివాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్

కృష్ణా నది జల వివాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల ఈ-సిటీలో సుజెన్ మెడికేర్ ప్రైవేట్ లిమిటెడ్ ఫార్మా యూనిట్ ప్రారంభోత్సవంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రానికి పంచాయితీ కావాలా?, నీళ్లు కావాలా? అని అడిగితే తాను నీళ్లే కావాలని కోరుకుంటానని స్పష్టం చేశారు. వివాదం కావాలా?, పరిష్కారం కావాలా? అని అడిగితే పరిష్కారమే కావాలని కోరుకుంటానని ఆయన అన్నారు. నీళ్ల వివాదం ముసుగులో రాజకీయ లబ్ధి పొందాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి లేదని, రాజకీయాలకు అతీతంగా సమస్యల పరిష్కారం కోసం అందరూ సహకరించాలని పార్టీలను విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. మన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుందామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి విజ్ఞప్తి చేస్తూ.. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు పెట్టవద్దని కోరారు. అడ్డంకుల వల్ల కేంద్ర ప్రభుత్వ నిధులు రావడం లేదని, రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని ఆవేదన - మిగతా3లో



### భారత విదేశాంగ విధానం ఊగిసలాడుతోంది

- ట్రంప్ వ్యాఖ్యలపై మోదీ మౌనం సరికాదు!
- చైనా కంపెనీలకు ప్రభుత్వ కాంట్రాక్టుల యోచనపై ఖర్గే ఫైర్
- గల్వాన్‌లో అమరులైన సైనికులను మోదీ అవమానించారు
- చైనాకు భారత ప్రధాని క్లీన్‌చిట్ ఇచ్చారు
- ఇప్పుడు చైనా కంపెనీలకూ రెడ్ కార్పెట్ పరుస్తున్నారు
- ధ్వజమెత్తిన కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే

# 4 వారాల్లో పూర్తిస్థాయి డీజీపీ నియామక ప్రక్రియ పూర్తి చేయండి



- డీజీపీగా శివధర్ రెడ్డి నియామకాన్ని సవాల్ చేస్తూ సామాజిక కార్యకర్త ధన్ గోపాల్ ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు
- నియామక ప్రక్రియపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను వచ్చే నెల 5వ తేదీకి వాయిదా
- నిబంధనల ప్రకారం డీజీపీ పదవీ విరమణ పొందే సమయానికి మూడు నెలల ముందే యూపీఎస్సీకి ప్యానెల్ పంపాలి


హైదరాబాద్

తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. ఆయన నియామకాన్ని రద్దు చేయాలంటూ దాఖలైన మధ్యంతర పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. రెగ్యులర్ డీజీపీ నియామకానికి సంబంధించిన ప్రక్రియను నాలుగు వారాల్లో ముగించాలని యూపీఎస్సీ, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. నియామక ప్రక్రియపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను వచ్చే నెల 5వ తేదీకి వాయిదా వేసింది. డీజీపీగా శివధర్ రెడ్డి నియామకాన్ని సవాల్ చేస్తూ సామాజిక కార్యకర్త ధన్ గోపాల్ ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం - మిగతా3లో



### గాజాలో పాక్ సైన్యం వద్దు... నమ్మకం లేని దేశాలతో పనిచేయలేం

- గాజాలో శాంతి పరిరక్షణ దళంలో పాకిస్థాన్ పాత్రను తిరస్కరించిన ఇజ్రాయెల్
- నమ్మకం, దౌత్య సంబంధాలు లేని దేశాలతో కలిసి పనిచేయలేమని స్పష్టీకరణ
- హమాస్‌కు పాక్ ఉగ్రసంస్థలతో సంబంధాలున్నాయని ఇజ్రాయెల్ ఆరోపణ
- ముందు హమాస్‌ను పూర్తిగా నిర్మూలించాకే పునర్నిర్మాణం అంటున్న ఇజ్రాయెల్



### దేశంలో ఆందోళనలు... ట్రంప్‌పై ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ తీవ్ర ఆగ్రహం

- ఇతర దేశాలకు చెప్పే ముందు సొంత దేశంపై దృష్టి సారించాలని ట్రంప్‌కు సూచన
- విదేశీ శక్తుల చేతుల్లో కిరాయి సైనికుల్లా వ్యవహరించే వారిని సహించేది లేదని హెచ్చరిక
- ఇతర దేశాధ్యక్షుడిని సంతోష పెట్టేందుకు సొంత వీధులను నాశనం చేస్తున్నారని ఆగ్రహం

### ‘బీజేపీ అంటే భ్రష్ట జనతా పార్టీ‘

- డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలపై రాహుల్ ఫైర్
- పేదలు, కార్మికులు, మధ్యతరగతి ప్రజల అభివృద్ధిలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపణ
- బీజేపీలో పై నుంచి కింది స్థాయి వరకు అవినీతి, అధికార దుర్వినియోగం వ్యాప్తి చెందింది



# ఢిల్లీ దాకా వచ్చి మనూ విద్యార్థులతో కలిసి పోరాడుతాం



- ఓఆర్ఆర్ కోసం మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ గతంలో 32 ఎకరాలు ఇచ్చింది
- యూనివర్సిటీ భూములపై రేవంత్ సర్కార్ విరుచుకుపడుతుంది
- రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని రాహుల్ గాంధీ చేస్తున్నది ఇదేనా
- మైనార్టీలపై ప్రేమ అంటే ఇదేనా ?
- చేతగాని సన్యాసి రాహుల్ గాంధీ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్

యూనివర్సిటీ భూములపై కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహారాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో కేటీఆర్‌తో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మనూ) విద్యార్థులు సమావేశమయ్యారు. యూనివర్సిటీకి చెందిన 50 ఎకరాల భూమిపై కాంగ్రెస్ ప్రభుత్వం - మిగతా3లో

# ఘోర ప్రమాదం.. బస్సు లోయలో పడి ఏడుగురు మృతి



### మోదీ ఫోన్ చేయలేదన్న అమెరికా వ్యాఖ్యలపై స్పందించిన భారత్

- మోదీ, ట్రంప్ ఎనిమిదిసార్లు ఫోన్‌లో సంభాషించుకున్నారన్న భారత్
- పరస్పర ప్రయోజనం చేకూర్చే వాణిజ్య ఒప్పందం కోసం ఇరుపక్షాలు సంప్రదింపులుజరిపాయని వెల్లడి
- పలుమార్లు ఒప్పందానికి దగ్గరగా వచ్చామన్న భారత్

# రాష్ట్రంలో బకాయిల పంచాయితీలు

- పాత గాయాలను మాన్పుతాయా
- కొత్త వివాదాలను తీసుకొస్తాయా
- ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోవడంతో గాడి తప్పిన గ్రామ పాలన
- పంచాయతీ ట్రాక్టర్‌లో డీజిల్ కూడా పోయలేని దుస్థితి
- సిబ్బందికి జీతాలు ఇవ్వలేక చేతులెత్తేసిన కార్యదర్శులు
- కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కానుండటంతో పాత సర్పంచుల్లో ఆశలు




హైదరాబాద్

గ్రామపంచాయతీల్లో రెండేళ్లుగా పాలకవర్గాలు లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోవడం, నిధుల మంజూరులో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం ప్రదర్శించటం తదితర కారణాలతో గ్రామ పాలన గాడితప్పింది. కొన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తమైంది. పంచాయతీ ట్రాక్టర్‌లో డీజిల్ కూడా పోయలేని దుస్థితి దాపురించింది. సిబ్బందికి జీతాలు ఇవ్వలేక కార్యదర్శులు చేతులెత్తేశారు. అనేక చోట్ల గత పాలకవర్గాలతో పాటు, ప్రత్యేకాధికారుల పాలనలో కార్యదర్శులు సొంత డబ్బులతో చేపట్టిన పనులకు ఇప్పటికీ పైసా విడుదల కాలేదు. ఇటీవల పంచాయతీ ఎన్నికలు ముగిసి నూతన పాలకవర్గాలు - మిగతా3లో

ధర్మఘంట

## సంపాదకీయం

# ప్రభుత్వ విద్యా వ్యవస్థ వెలుగు తగ్గుతున్న అక్షర దీపం

అక్కడ భవనాలున్నాయి. తరగతి గదులు ఉన్నాయి. వసతులూ ఉన్నాయి. బోధించడానికి ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. లేనిదల్లా ఒక్క విద్యార్థులు మాత్రమే. అవి ప్రభుత్వ పాఠశాలలు. అలాంటివి ఈ దేశంలో ఎనిమిది వేలకు పైగా ఉన్నట్లు స్వయంగా కేంద్ర మానవ వనరుల శాఖ ప్రకటించింది. ఒకనాడు చదువంటే ప్రభుత్వ విద్య. పాఠశాల అంటే సర్కారు బడి. అతికొద్ది మిషనరీ స్కూళ్లు మాత్రమే సేవా భావంతో పేద ప్రజలకు విద్యను అందించేవి. నాడు చదువుకునే వారికి ప్రభుత్వ బడులు మాత్రమే తెలుసు. మరి, నేడు ఎందుకు ఈ దుస్థితి దాపురించింది? దేశంలో 10.13 లక్షల పాఠశాలలు ప్రభుత్వ రంగంలో నడుస్తున్నాయి. గతంలో అవి ఇంకా ఎక్కువగా ఉండేవి. ఇప్పుడవి క్రమంగా తగ్గుతూ నేడు ఈ సంఖ్యకు, ఈ స్థితికి చేరుకున్నాయి. దేశంలో కోటి మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. కానీ, విద్యా ప్రమాణాల గురించి ఎంత తక్కువ మాట్లాడు కుంటే అంత మంచిది. దేశవ్యాప్తంగా నేడు ఎనిమిది వేల బడుల్లో ఒక్క విద్యార్థి కూడా విద్యను అభ్యసించడం లేదు. అంటే జీరో ఎన్రోల్మెంట్. కానీ ఇలాంటి బడులలో 20187 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నట్లు యుడైస్ నివేదిక స్పష్టం చేస్తున్నది.ఇది ఎలా సాధ్యం? టీచర్లు లేని బడులు ఊహించుకోగలం. కానీ, విద్యార్థులు లేని పాఠశాలలు, వాటిలో ఇన్ని వేల మంది ఉపాధ్యాయులు పనిచేయడం అంతు పట్టని విషయం. ఒకప్పుడు బడులు నెలకొల్పినా వాటిలో టీచర్లు ఉండేవారు కాదు. కానీ నేడు టీచర్లు ఉన్నారు. చదువుకునే విద్యార్థులే కరువయ్యారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో 3812 ప్రభుత్వ బడుల్లో జీరో ఎన్రోల్మెంట్ నమోదు కాగా వాటిలో 17965 మంది ఉపాధ్యాయులు పనిచేయడం హాస్యాస్పదం. దురదృష్టవశాత్తు తెలంగాణ రాష్ట్రం రెండవ స్థానాన్ని ఆక్రమించింది. ముఖ్యంగా నల్లగొండ జిల్లాలో 315 ప్రభుత్వ పాఠశాలలో ఒక్క విద్యార్థి కూడా చేరకపోవడం దేన్ని సూచిస్తుంది? అధికారుల అలసత్వమా, ఉపాధ్యాయుల అనాసక్తతా, తల్లిదండ్రుల ఆలోచనలో మార్పా అనేది వెంటనే విద్యాశాఖ సమీక్షించాల్సిన విషయమిది. ప్రభుత్వ బడుల సంఖ్య క్రమంగా తగ్గుతుండగా ప్రయివేటు పాఠశాలల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తున్నది. ప్రభుత్వ విద్య ప్రమాదంలో పడిందనేది నిర్వివాదాంశం.దేశంలో 25 కోట్ల మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో చదువుకుంటున్నారు. డ్రాపౌట్ల సంఖ్య అత్యధికంగా మణిపూర్ రాష్ట్రంలో ఉండగా, కేరళలో అత్యల్పంగా ఉండడం గమనార్హం. లక్ష ఏకోపాధ్యాయపాఠశాలలు నడుస్తుండగా వాటిలో 33 లక్షల మంది పిల్లలు విద్యాభ్యాసం చేస్తున్నారు. రానురానూ నమోదు తక్కువ కావడం బాధాకరం. డ్రాపౌట్ల సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. కోటి మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నా ప్రమాణాలు మాత్రం పెరగకపోవడం శోచనీయం. బడ్జెట్ కేటాయింపులలోనూ ప్రభుత్వాలు పిసినారితనమే ప్రదర్శిస్తున్నాయి. జీడీపీలో కనీసం మూడు శాతం నిధులు కూడా కేటాయించలేకపోతున్నాయి. ఫలితంగా పథకాలు, 'ప్రాధమ్యాలు' కాగితంపై ఘనంగా కనబడుతున్నా చివరికి చేరుకుంటున్న లక్ష్యలు అట్టడుగున దర్శనమిస్తున్నాయి. ఆలోచనలకు, అమలుకు, ఆకాశానికి అధ: పాతాళానికి ఉన్న తేడా కనిపిస్తోంది. అంటే కేవలం చిత్తశుద్ధి లేకపోవడం అనేది సుస్పష్టం.ఒకపక్క కేంద్ర ప్రభుత్వం వికసిత భారత్ శిక్ష అధిష్టాన్ పేరుతో కొత్త చట్టాన్ని తీసుకురాబోతున్నది. దాని పర్యవసానంగా దేశంలోని వైద్య న్యాయ విద్య మినహా మిగిలిన ఉన్నత విద్యా సంస్థలన్నీ ఆ చట్టం పరిధిలో పనిచేస్తాయి. ఇప్పటికే చరిత్రను వక్రీకరిస్తూ రకరకాల చారిత్రక అంశాలను మార్చుతూ విద్యను కాషాయీకరించే ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నది కేంద్రం. దీంతో దశాబ్దాల క్రితం ఏర్పడిన రాజ్యాంగ సంస్థలు యూజీసీ, ఏఐసిటిఈ, ఎన్సీటిఈ లాంటి సంస్థలు రద్దవుతాయి. విద్య ప్రయివేటీకరణకు మార్గం సుగమమవుతుంది. విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తికి ఈ బిల్లు అడ్డుపడుతుంది. ఇదంతా చూస్తే విద్యపై ఒక పథకం ప్రకారం జరుగుతున్న కుట్రగా కనిపిస్తున్నది! ఇక తెలంగాణ రాష్ట్రంలోనూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు నానాటికి తీసికట్టుగా సాగుతున్నది 2024- 25 సంవత్సరంలో 2245 బడులలో ఒక్క విద్యార్థి కూడా చేరలేదు విద్యాశాఖ వారు చెప్పే కుంటిసాకులు ఆశ్చర్యం కలిగిస్తాయి విద్యార్థులు క్రమంగా గురుకులాల్లోనూ ప్రయివేటు పాఠశాలలకు ఆకర్షితులవుతున్నారనేది వారి వాదన. ప్రయివేటు రంగంలోని పాఠశాలల్లో ప్రతి సంవత్సరము విద్యార్థుల నమోదు పెరుగుతూ ఉన్నది. నిజమే గురుకులాల్లో గత రెండేళ్లుగా అడ్మిషన్లు తగ్గుముఖం పట్టాయి.ఒక దశాబ్ద కాలం వైభవంగా నడిచిన గురుకులాలు నేడు కునారిల్లుతున్నాయి. ఆరువందల గురుకులాలకు సొంతభవనాలు లేవు అద్దె భవనాలకు చెల్లించవలసిన బకాయిలు పేరుకుపోయి యజమానులు వాటికి తాళాలు వేసుకుంటున్న పరిస్థితినెలకొంది. రకరకాల కారణాలతో వందకు పైగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. కలుషిత ఆహారం, పాముకాట్లు, ఎలుకల కాట్లు ఇవన్నీ గురుకుల వ్యవస్థను అప్రతిష్టపాలు చేశాయి. ఇది కూడా కావాలనే జరుగుతున్న పరిణామాలుగా కనిపిస్తున్నాయి. ఎందుకంటే ప్రస్తుత ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ గురుకులాలను నిర్మిస్తున్నది. ఒక్కొక్క క్యాంపస్ నందు నాలుగు లేదా ఐదు గురుకులాలు వివిధ యాజమాన్యాల కింద నడుస్తాయి. ఒక్కొక్క కాంప్లెక్స్‌లో 2500 మంది విద్యార్థులు చదువు నేర్చుకుంటారు. ప్రతి క్యాంపస్ కొరకు రూ.200 కోట్లతో భవనాలు నిర్మిస్తున్నారు. ఈ విధంగా ప్రతి నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ గురుకుల కాంప్లెక్స్ నిర్మిస్తారు. అంటే 117 నియోజకవర్గాలకు రూ.200 కోట్ల చొప్పున బడ్జెట్ కేటాయిస్తారు.ఇంత కాలంగా సొంత భవనాల్లో నడుస్తున్న 400 పైగా గురుకుల భవనాలు క్వార్టర్స్ ఏమవుతాయి? ఆరువందల గురుకులాలకు సొంత భవనాలు సమకూర్చితే సరిపోయేదానికి వేల కోట్ల రూపాయల ఖర్చు సబబేనా? దిగజారుతున్న ఆర్థిక స్థితిలో ఇది సాధ్యమేనా అన్నది విద్యాభిమానుల ప్రశ్న. ఈ బడ్జెట్లో పదోవంతు ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించినా వాటికి పునరుజ్జీవం కలిగించ వచ్చు. మరోపక్క దేశంలోనే మూతబడుతున్న పాఠశాలల సంఖ్యలో తెలంగాణ రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉంది. విద్యార్థులు టీచర్లు లేని పాఠశాలలు 1441 ఉన్నాయి. 2024-25 విద్యా సంవత్సరంలో 2245 జీరో ఎన్రోల్మెంట్ బడులు ఉన్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే ఆరువందల బడులల్లో టీచర్ల పోస్టులు ఉన్నాయి, పిల్లలే లేరు. మూడు వేలకు పైగా ప్రాథమికోన్నత పాఠశాలలు కూడా మూత పడడానికి సిద్ధంగాఉన్నాయి. మొత్తంగా ఐదు వేల పాఠశాలలు కనుమరుగు కాబోతున్నాయి. ప్రతియేటా లక్షకు పైగా విద్యార్థుల సంఖ్య ప్రభుత్వ పాఠశాలలో తగ్గిపోతుండడం గమనార్హం. అన్ని రకాల శిక్షణ, విద్యార్హతలు ఉన్న ఉపాధ్యాయులు పనిచేసే ప్రభుత్వ బడులు క్రమంగా నిర్వీర్యమై విద్యార్థులకు దూరమవుతున్నాయి.విద్యాహక్కు చట్టం నిస్సహాయం కాబోతున్నది. 6 నుంచి 14 సంవత్సరాల మధ్య పిల్లలకు నిర్బంధంగా అందించాల్సిన ఉచిత విద్య ఇక కాగితాలకే పరిమితం కాబోతున్నది. ఏనాడైనా పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలే వరంగా నడుస్తూ వచ్చాయి. కానీ అవే నేడు వారికి దూరం అవుతున్న నేపథ్యంలో వారికి ప్రయివేటు బడులే తప్ప గత్యంతరం లేదు. ప్రభుత్వ రంగంలోని బడులలో నాణ్యత, మౌలిక వసతులు, భవనాలు, టాయిలెట్స్, మంచినీటి సౌకర్యం, నేటి తరానికి అవసరమైన కంప్యూటర్ సౌకర్యాలు లోపించడంతో తల్లిదండ్రులు, వారి పిల్లలు ప్రయివేటుకే మొగ్గు చూపుతున్నారు. ఇంకా 20 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పర్యవేక్షణ అధికారులు లేరు. పదోన్నతులు లేక అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎంతసేపు 'పెద్దపెద్ద కంపెనీలతో ఎంవోయూలు కుదుర్చుకున్నాం, ఇక అద్భుతాలే' అన్న ప్రకటనలే కానీ క్షేత్రస్థాయిలో అంతా శూన్యం.పాఠాలు చెప్పవలసిన ఉపాధ్యాయులు ఫారాలు నింపడానికి, శిక్షణకు తమ శక్తులు ధారపోస్తున్నారు. ఇవి చాలనట్లు వేలాదిమందిని ఇతర పాఠశాలల్లో బోధన పరీక్షంచి పరిశీలించి సలహాలకు సూచనలకు వినియోగించుకుంటున్నారు. అయినా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యత పెరగాలని అడ్మిషన్లు పెరగాలని కోరుకోవడం అత్యాశ కాదా? ఐదవ తరగతి విద్యార్థి రెండో తరగతి స్థాయిలో నైపుణ్యాలు సంపాదించడం బాధాకరం. ప్రభుత్వ విద్య నిర్వీర్యమవుతున్నది. ప్రభుత్వమే పరోక్షంగా ప్రయివేటు విద్యకు పట్టం కడుతున్నది.

# జాతి సమగ్రతకు వారధి.. విశ్వవ్యాప్త హిందీ సారధి!

ప్రపంచ వ్యాప్తంగా హిందీ భాష ప్రాముఖ్యతను చాటి చెప్పే ఉద్దేశంతో ప్రతి ఏటా జనవరి 10న ప్రపంచ హిందీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ దినోత్సవానికి ప్రేరణగా నిలిచింది 1975 జనవరి 10న మహారాష్ట్రలోని నాగపూర్‌లో నిర్వహించిన తొలి ప్రపంచ హిందీ సదస్సు. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ఆధ్వర్యంలో జరిగిన ఆ సదస్సు, హిందీ భాషకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చే దిశగా కీలకమైన మైలురాయిగా నిలిచింది. దాని స్మారకార్థంగా 2006లో అప్పటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ జనవరి 10ను 'ప్రపంచ హిందీ దినోత్సవం'గా అధికారికంగా ప్రకటించారు.భారత జాతీయోద్యమ కాలంలో దేశవ్యాప్తంగా ప్రజలను ఏకతాటిపై నడిపించడంలో హిందీ భాష కీలక పాత్ర పోషించింది. మహాత్మా గాంధీ హిందీని "ఐక్యత భాష"గా అభివర్ణిస్తూ, దేశమంతటా సంభాషణకు, ఆలోచనల మార్పిడికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని నమ్మారు. ఆ స్ఫూర్తితోనే భారత రాజ్యాంగ నిర్మాతలు హిందీకి అధికార భాషా హోదా కల్పించారు. 1949 సెప్టెంబరు 14న రాజ్యాంగ సభలో జరిగిన చర్చల అనంతరం, దేవనాగరి లిపిలో వ్రాయబడే హిందీని కేంద్ర ప్రభుత్వ అధికార భాషగా స్వీకరించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం 1950 జనవరి 26న అమల్లోకి వచ్చిన భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 343 ద్వారా ధృవీకరించబడింది.హిందీకి అధికార భాషా హోదా సాధించడంలో రాజ్యాంగ సభలో కీలకంగా కృషి చేసినవారిలో రాజేంద్ర ప్రసాద్, బాబూ రాజేంద్ర ప్రసాద్ (బిహార్‌కు చెందిన ప్రముఖ నేత), హజారీ ప్రసాద్ ద్వివేది, కాకా కలేల్కర్, మైథిలీ శరణ్ గుప్త్, సేఠ్ గోవింద్ దాస్ వంటి మహానుభావులు ఉన్నారు. వారి దీర్ఘకాల ప్రయత్నాల ఫలితంగా హిందీ, ఇంగ్లీష్‌తో పాటు భారత యూనియన్ స్థాయిలో అధికార భాషగా స్థిరపడింది. ప్రస్తుతం భారతదేశంలో 22 షెడ్యూల్డ్ భాషలు ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వ పరిపాలనలో ప్రధానంగా ఉపయోగించబడుతున్నవి హిందీ, ఇంగ్లీష్ మాత్రమే.భాషా చరిత్రను పరిశీలిస్తే, హిందీ ఇండో-యూరోపియన్ భాషా కుటుంబానికి చెందిన ఇండో-ఆర్యన్ శాఖలోని భాష. "హిందీ" అనే పదం పర్షియన్ మూలాలనుంచి వచ్చింది. పాత పర్షియన్‌లోని "హింద్" అనే పదం సంస్కృతంలోని "సింధు" నదిని సూచించేదిగా భావిస్తారు. కాలక్రమంలో ఇది భారతదేశాన్ని సూచించే పదంగా మారింది. హిందీ భాషకు సంస్కృతం ప్రధాన ఆధారంగా ఉన్నప్పటికీ, ఉత్తర భారతదేశంలో ఇస్లామిక్ పాలన కాలంలో పర్షియన్, అరబిక్, టర్కిష్ భాషల ప్రభావంతో అనేక రుణపదాలు ఇందులో చేరాయి. ఆ ప్రభావాల సమ్మేళనంతో హిందూస్థానీ రూపుదిద్దుకుంది; దానిలోనుంచే ఆధునిక హిందీ, ఉర్దూ భాషలు ప్రత్యేకంగా అభివృద్ధి చెందాయి. అవధి, బ్రజ్ వంటి మాండలికాలు హిందీ సాహిత్య సంప్రదాయానికి పునాదులు వేశాయి. మొఘల్ కాలం చివరి దశలో హిందీకి భాషా ప్రతిష్ట మరింత పెరిగింది. 18వ శతాబ్దం చివరి నాటికి ఆధునిక హిందీ సాహిత్య సంప్రదాయం స్పష్టమైన రూపాన్ని




సంతరించుకుంది. బ్రిటిష్ పాలన కాలంలో హిందీని ఉత్తర భారతదేశం అంతటా సాధారణ సంభాషణ భాషగా ప్రోత్సహించడం జరిగింది. 19వ శతాబ్దం చివర్లో ఉర్దూ నుంచి వేరుగా హిందీని ప్రామాణిక రూపంలో అభివృద్ధి చేయాలనే ఉద్యమం బలపడింది. నేడు హిందీ 9 రాష్ట్రాల్లో మరియు 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో అధికార భాషగా, మరికొన్ని రాష్ట్రాల్లో అదనపు అధికార భాషగా వినియోగంలో ఉంది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, బీహార్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలతో పాటు ఢిల్లీ, అండమాన్?నికోబార్ దీవులు వంటి కేంద్రపాలిత ప్రాంతాల్లో హిందీ విస్తృతంగా ఉపయోగించబడుతోంది. 1954లో కేంద్ర ప్రభుత్వం హిందీ వ్యాకరణాన్ని ప్రామాణీకరించేందుకు కమిటీని నియమించగా, దాని నివేదిక 1958లో "ఎ బేసిక్ గ్రామర్ ఆఫ్ మోడరన్ హిందీ"గా విడుదలైంది. దీని ద్వారా లిపి, ఉచ్చారణ, వ్యాకరణంలో ఏకరీతిని తీసుకువచ్చే ప్రయత్నం జరిగింది.

ప్రపంచవ్యాప్తంగా హిందీ మాట్లాడేవారి సంఖ్య కోట్లలో ఉంది. భారతదేశం వెలుపల నేపాల్‌లో సుమారు 20 లక్షల మందికి పైగా, అమెరికాలో ఎనిమిది లక్షలకు పైగా, మారిషస్, ఫిజీ, దక్షిణాఫ్రికా, సురినామ్, యునైటెడ్ కింగ్‌డమ్, న్యూజిలాండ్, జర్మనీ వంటి దేశాల్లో లక్షల సంఖ్యలో హిందీ మాట్లాడేవారు ఉన్నారు. ఫిజీలో "ఫిజీ హిందీ"గా పిలవబడే రూపం రాజ్యాంగ పరిరక్షణ పొందింది. నేపాల్ జనగణనల ప్రకారం అక్కడ హిందీ మొదటి లేదా రెండవ భాషగా విస్తృతంగా వినియోగంలో ఉంది. దక్షిణాఫ్రికాలో కూడా హిందీ రక్షిత భాషగా గుర్తింపు పొందింది.అంతర్జాతీయ అంచనాల ప్రకారం హిందీ నేడు ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషలలో ఒకటి. సుమారు 25 కోట్ల మంది హిందీని మాతృభాషగా, దాదాపు 150?180 కోట్ల మంది రెండవ లేదా మూడవ భాషగా ఉపయోగిస్తున్నారని భావిస్తున్నారు. ఈ సంఖ్యలు హిందీకి ఉన్న విస్తృతి, ప్రభావాన్ని స్పష్టంగా తెలియజేస్తాయి.అయితే, భారతదేశం వంటి బహుభాషా సమాజంలో మాతృభాషల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 351 ప్రకారం రాష్ట్రాలకు తమకు నచ్చిన భాషలో పరిపాలన నిర్వహించే స్వేచ్ఛ ఉంది. హిందీని బలవంతంగా రుద్దడంపై గతంలో, ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో, తీవ్ర ప్రతిఘటన వ్యక్తమైంది. దానికి పరిష్కారంగా 1963 అధికార భాషల చట్టం తీసుకువచ్చారు. నేటి విద్యావేత్తల అభిప్రాయం ప్రకారం ప్రాథమిక విద్య మాతృభాషలోనే అందాలి. అంతర్జాతీయ స్థాయిలో సంభాషణ కోసం ఇంగ్లీష్‌కు ఉన్న ప్రాముఖ్యతను కూడా విస్మరించలేం. అందుకే మాతృభాష, హిందీ, ఇంగ్లీష్‌ల మధ్య సమతుల్యత సాధించాల్సిన అవసరం ఉంది.నరేంద్ర మోడీ ప్రభుత్వం కూడా ఇదే దిశగా, ప్రాథమిక దశలో మాతృభాషలో విద్యను ప్రోత్సహించడంపై దృష్టి సారించింది. భిన్న భాషలు, సంస్కృతులు కలిగిన భారతదేశంలో పరస్పర అవగాహనకు ఒక ఉమ్మడి భాష అవసరం అనేది వాస్తవం. అదే సమయంలో ప్రతి భాషకూ సమాన గౌరవం, సమాన అవకాశాలు కల్పించడమే నిజమైన జాతీయ ఐక్యతకు పునాది. ఈ నేపథ్యంలో హిందీ భాష జాతి ఐక్యతకు దోహదకారి అయినప్పటికీ, మాతృభాషల పరిరక్షణతో పాటు సమన్వయ దృక్పథం అవసరమనే సందేశాన్ని ప్రపంచ హిందీ దినోత్సవం మనకు గుర్తు చేస్తుంది.

# నవ్వు దైవ దత్త దివ్యౌషధం

నవరసాల సారమే జీవనం. అందులో ఏ రసం పాలు తక్కువైనా సమస్య లేదు కానీ, హాస్యరసం పాలు మాత్రం అసలు తక్కువ కాకూడదు. అది లోపిస్తే జీవితమంతా వేదనే మిగులుతుంది. అయితే, నేటి యాంత్రిక జీవనంలో, పోటీ ప్రపంచంలో మన జీవితాల్లో హాస్యరస పాలు క్రమంగా తగ్గిపోతోంది. ఆవేశం, ఆగ్రహం, అసంతృప్తి, అహం, మానసిక ఒత్తిడి వంటివి నవ్వును, నవ్వే గుణాన్ని మింగేస్తున్నాయి.ప్రపంచ నవ్వుల దినోత్సవం మొదటి సారిగా 1998, జనవరి 10న భారత దేశంలోని ముంబైలో జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా నవ్వు యోగా ఉద్యమాన్ని ప్రారంభించిన డాక్టర్ మదన్ కటారియా ఈ దినోత్సవాన్ని ఏర్పాటు చేశాడు. మొదట జనవరి రెండవ ఆదివారం జరుపుకునే వారు. జనవరిలో చలి ఎక్కువగా ఉంటుందన్న హాస్య ప్రియులు కోరిక మేరకు లాఫ్టర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ దీన్ని మే మొదటి ఆదివారం జరుపుతూ వచ్చింది. అయితే భారత దేశంలో జనవరి 10న మొదటి సారి ఈ దినోత్సవాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది భారత దేశమే, భారతీయుడే కావడం విశేషం. ముంబైకి చెందిన ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ మదన్ కటారియా ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని సృష్టించారు. 'నవ్వు ఒక యోగం' అనే కాన్సెప్ట్ను ప్రపంచానికి చాటిన అయన భారతీయుడే కావడం విశేషం. వ్యక్తులు తమను తాము మార్చుకోవటానికీ, ప్రపంచాన్ని శాంతియుతంగా, సానుకూలంగా మార్చడానికి అవసరమైన శక్తివంతమైన భావోద్వేగం నవ్వు ఒక్కటే. నవ్వు అనేది ఒక వ్యక్తి ముఖ కవళికలపై, భావోద్వేగాలపై ప్రభావం చూపుతుందన్న ఉద్దేశ్యంతో మదన్ కటారియా నవ్వు యోగా ఉద్యమాన్ని ప్రారంభించాడు. మొదట్లో నవ్వుల క్లబ్ (లాఫర్ క్లబ్)గా ప్రారంభమైన ఈ వేడుక తరువాత కాలంలో 65 దేశాలలో ఆరు వేల క్లబ్బుల వరకు విస్తరించింది. నవ్వడం వలన శరీరంలో ఉన్న రోగాలన్నీ మటుమాయమై పోతాయని ఆరోగ్య నిపుణులు చెపుతున్నారు. నవ్వడం మూలాన జీవితంలోని ఎన్నో రకాల ఆరోగ్య సమస్యల నుంచి దూరంగా ఉండొచ్చని వారంటున్నారు. రోజులో కనీసం నాలుగైదు సార్లయినా మనసారా నవ్వడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుంది. ఒక మనిషి సంతోషంగా ఉంటే అతని కుటుంబం సంతోషంగా ఉంటుంది. అలా కుటుంబాలన్నీ సంతోషంగా ఉంటే సమాజమంతా సంతోషంగా ఉంటుంది.. అప్పుడు ప్రపంచమంతా సంతోషంగా ఉంటుందనేది ఈ నవ్వుల దినోత్సవ నిర్వహణ వెనుక ఉన్న భావన.

హాస్యానికి పుట్టినిల్లు భారత్‌భారతదేశంలో హాస్యానిది తొలి నుంచీ పెద్దపీటే. రాజుల ఆస్థానాలలో విదూషకులు కేవలం మహారాజులను నవ్వించడానికే ఉండేవారు. తెనాలి రామకృష్ణుడు, బీర్బల్ పండించిన హాస్యం అజరామరం. ఈ రెండు తరహాలు కథలు నవ్వుతో పాటు ఆలోచననూ కలిగిస్తాయి. నిజానికి నవ్వుతో లేదా జోక్‌తో ఆలోచనను రేకెత్తించే హాస్యమే మరుపు రాకుండా మిగిలి పోతుంది. అక్బర్ - బీర్బల్ కథలు ఎన్నో ఆలో చనలను రేకెత్తిస్తాయి. తెనాలి రామకృష్ణుడి కథలు తెలివిని పెంచుతాయి. పరమానందయ్య శిష్యుల కథలు కూడా మంచి హాస్యాన్ని పుట్టిస్తాయి. మన జానపద గీతాల్లోనూ హాస్యరసం పొంగి పొర్లుతుంది. ఇంకా పల్లెసుద్దుల్లో, పల్లెల్లో పనిపాటు చేసుకుంటూ పాడుకునే పాటల్లో ఎంతో సునిశిత హాస్యం దొర్లుతుంది.పువ్వులు, పక్షులు, జంతువులు.. తమ తమ స్వభావాలతో తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని, పరిసరాలను ఆనందమయంగా చేసుకుంటాయి. వాటితో పోలిస్తే విచక్షణ, వివేకం కలిగిన మానవులం ఈ జీవితాన్ని, ఎందుకు సంతోషకరం చేసుకోలేం. ఈ సృష్టిలో పైసా ఖర్చు లేనిది చిరునవ్వు మాత్రమే. కానీ, దాన్ని 'కొనితెచ్చు' కోవాల్సినంత దుస్థితిలో మానవ జీవితాలు ఉన్నాయి. రోజుల్లో వస్తున్న సగం జబ్బులకు ఒత్తిడే కారణం. 70 శాతం రోగాలు ఒత్తిడితోనే కలుగుతున్నాయనేది వైద్య అధ్యయనాల సారాంశం. అధిక రక్తపోటు, గుండె జబ్బులు, డిప్రెషన్ (కుంగుబాటు), అలర్జీ, ఇన్సోమియా, మైగ్రేయిన్, ఆతృత, పెప్టిక్ అల్సర్.. ఇవన్నీ ఒత్తిడి వల్ల వచ్చేవే. నవ్వుల టానిక్ మాత్రమే వీటికి ఔషధం. ఉదయం లేస్తూనే ఒక చిరునవ్వును ముఖంపైకి తెచ్చుకుంటే ఇవన్నీ మటుమాయమైనట్టే. నవ్వుతో రోగనిరోధక వ్యవస్థకు అవసరమైన లింపొజైట్స్ ఉత్పత్తి పెరుగుతుంది. ముక్కు, శ్వాసకోశాల్లోని పొరల్లో మెరుగుదల ఉంటుంది. శరీరంలో సహజరోగ నిరోధక హార్మోన్ల ఉత్పత్తి పెరిగి ఆర్థరైటిస్, స్పాండలైటిస్, మైగ్రేన్ లాంటి వ్యాధులకు ఉపశమనం లభిస్తుంది. ఊపిరి తిత్తుల సామర్థ్యం, రక్తంలో ఆక్సిజన్ పరిమాణం పెరుగుతాయి. దీని వల్ల ఆస్తమా రోగులకూ మేలు జరుగుతుంది.మనుషులు వేర్వేరు భాషలు, దేశాలకు చెందిన వారైనా అందరికీ అర్థమయ్యే, అందరికీ వచ్చే యూనివర్షల్ లాంగ్వేజ్ మాత్రం నవ్వే. ఇది ఎవరూ నేర్చుకొనే అవసరం లేని భాష. అందరిలోనూ సహజ, స్వభావ సిద్ధంగా ఉంటుంది. అయితే, ప్రతి మనిషీ తనలో సహజంగా ఉండే నవ్వును నవ్వడం లేదా దానిని ఉపయోగించడం నానాటికీ మరిచి పోతున్నాడు. పుట్టుకతోనే అబ్బే విద్య నవ్వు మాత్రమే. సకల జీవరాశిలో మనిషికి మాత్రమే నవ్వుకునే, నవ్వే గుణమూ, లక్షణమూ ఉన్నాయను కోవడం అజ్ఞానం. చాలా గుణాలలాగే నవ్వు కూడా మన చుట్టూ ఉన్న జీవరాశి అంతటిలో ఉన్నాయి. పువ్వులు వికసించడమే హాసం. పక్షుల కిలకిలరావాలే కిలకిలల నవ్వులు. జంతువులు చేసే కొన్ని శబ్దాలు నవ్వులకు సంకేతాలే. నవ్వు అనేది మనిషి అభ్యాసంతో నేర్చుకునే విద్య కాదు. జన్మతః లభించిన లక్షణం.సెల్ ఫోన్లు మానవ జీవితంపై ఎంతో ప్రభావం చూపుతున్నాయి.సెల్‌ఫోన్లు వచ్చాక మనుషుల మధ్య మాటలే కరువయ్యాయి. ఇద్దరు మనసు విప్పి మాట్లాడు కుంటేనే కదా.. ఆ సంభాషణలో నుంచి హాస్యం పుట్టేది. ఇప్పుడు ఎవరికి వారు సెల్‌ఫోన్ల తోనే మాట్లాడు తున్నారు. అరచేతిలోని సెల్ ఫోన్ మనసుకు నవ్వును తాకనివ్వడం లేదని ఎవరూ గుర్తించడం లేదు. వాట్సాప్‌లో పోస్టుల జోకులకే నవ్వు తున్నాం. స్వతహాగా నవ్వడం ఏనాడో మరిచి పోయాం. చింతలు, చికాకులు, అర్థం లేని లక్ష్యాల వైపు పరుగులతో మనిషిలో హాస్య ప్రియత్వ సహజ లక్షణం తగ్గిపో తున్నది. నవ్వు ఇలా మహా భాగ్యమై పోయినందుకే లాఫింగ్ క్లబ్బులు వచ్చాయి. మనిషి కొత్తగా నవ్వడం నేర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.నవ్వు యోగమే కాదు.. నవ్వు వ్యాయామం కూడా. ముఖంలో నవ్వు కనబడాలి అంటే ముఖం లోని ముప్పై రెండు కండరాలు కదలాలట. నవ్వడం కూడా ఒక వ్యాయామం. ఒక్క నవ్వుతో 32 కండరాలను కదిలించడం అంటే అది ఎంత గొప్ప వ్యాయామం కాక మరేమిటి. చక్కని నవ్వు వల్ల ముఖ కవళికలు మెరుగవుతాయి. ముఖ కండరాల్లో రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. వృద్ధాప్య ఛాయలు, ముడతలను దరి చేరనివ్వదు. మనసు స్వచ్ఛంగా ఉన్న వాళ్లకే స్వచ్ఛమైన నవ్వు వస్తుంది. యోగాతో పోలిస్తే నవ్వడం చాలా సులువు. యోగా అంటే కొన్ని భంగిమలు ప్రదర్శించాలి. దీనికి అవేమీ అవసరం లేదు. పెదాలను కాస్త కదిలిస్తే చాలు.. మానసిక ఒత్తిడిని నవ్వు తగ్గిస్తుంది. హాయిగా నవ్వడం వల్ల ఒత్తిడి దిగిపోయి రిలాక్స్ కలుగుతుంది. కుంగుబాటు (డిప్రెషన్) నుంచి నవ్వు బయట పడవేస్తుంది. ఉద్విగ్నత, భావోద్వేగాలను నవ్వు సమస్థితిలో ఉంచుతుంది. ఇవి అదుపులో ఉంటేనే ఇతరులతో సంబంధ బాంధవ్యాలు సవ్యంగా గలుగుతారు. అంటే మనసులో ఎటువంటి కల్మషం లేని వారు మనసారా స్వచ్ఛంగా నవ్వగలరు.

## ఐప్యాక్ దాడులకు నిరసనగా మమత భారీ ప్రదర్శన...

# సీజేఐను ఆశ్రయించిన ఈడీ

**కోల్‌కతా:** ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ దాని సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ జైన్‌పై ఈడీ దాడుల వ్యవహారం రచ్చకెక్కింది. దీనిపై శుక్రవారం నాడు కేంద్రం, పశ్చిమబెంగాల్ ప్రభుత్వం మధ్య ఘర్షణ మరింత తీవ్రమైంది. అవినీతిలో కూరుకుపోయారంటూ తనపై బీజేపీ చేస్తున్న ఆరోపణలు, ఈడీ చర్యలపై ముఖ్యమంత్రి మమతాబెనర్జీ.. కోల్‌కతా రోడ్లపైకి వచ్చి భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. మరోవైపు ఈడీ సైతం కోల్‌కతా హైకోర్టు విచారణపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఐప్యాక్‌పై ఈడీ దాడులకు సంబంధించి దాఖలైన పలు పిటిషన్లపై కోల్‌కతా హైకోర్టు జస్టిస్ సువ్ర ఘోష్ విచారణ చేపట్టినప్పటికీ భారీగా జనం హాజరుకావడంతో ఆయన కోర్టు రూమ్‌ను విడిచిపెట్టి వెళ్లిపోయారు. గత వారంరోజులుగా కోర్టుకు సెలవులు ఉండగా.. ఈ అంశంపై వచ్చే బుధవారం నాడు తిరిగి విచారణ చేపట్టనున్నారు.



**సీజేఐకి ఈడీ విజ్ఞప్తి**

కోల్‌కతా హైకోర్టులో కేసు విచారణ వాయిదా పడటంతో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్‌ను ఈడీ శుక్రవారం నాడు ఆశ్రయించింది. తక్షణ విచారణ కోసం ధర్మాసనం ఏర్పాటు చేయాలని కోరింది. కాగా, హైకోర్టులో శుక్రవారం విచారణ సందర్భంగా ఈడీ తమ వాదన వినిపిస్తూ, ఐప్యాక్ కార్యాలయం, జైన్ నివాసంలో తాము సోదాలు నిర్వహిస్తుండగా అధికారులతో అడ్డగించడం ద్వారా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించింది. దీనిపై జైన్, తృణమూల్ కాంగ్రెస్ కౌంటర్ పిటిషన్ దాఖలు చేసింది. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల వ్యూహానికి సంబంధించిన డాక్యుమెంట్లను సీజ్ చేయాలని ఈడీ ప్రయత్నించిందని ఆ పిటిషన్‌లో ఆరోపించారు. ఒకవైపు కోర్టు విచారణ జరుగుతుండగా మరోవైపు ఈడీ దాడులకు నిరసనగా ముఖ్యమంత్రి మమతాబెనర్జీ జాదవ్‌పూర్ నుంచి హజ్రా క్రాసింగ్ వరకూ 5 కిలోమీటర్ల మేరకు పాదయాత్ర నిర్వహించారు. పెద్దఎత్తున కార్యకర్తలు, పార్టీ నేతలు ఇందులో పాల్గొన్నారు.

**ఆరోపణల పర్వం**

ఏం చేసైనా సరే పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో గెలవాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని మమతా బెనర్జీ, తృణమూల్ నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అయితే ఈ ఆరోపణలను బీజేపీ తోసిపుచ్చింది. టీఎంసీ చీఫ్ అవినీతి ఊబిలో కూరుకుపోయారని, ఈడీ అధికారులను బెదిరిస్తున్నారని బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. మమతా చర్యల వెనుక అనేక అనుమానాలు ఉన్నాయని.. తనను, తమ పార్టీని చిక్కుల్లోకి నెట్టే కీలకమైన సమాచారాన్ని తొలగించేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారని రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు.

# ‘భారత విదేశాంగ విధానం ఊగిసలాడుతోంది‘

మోదీ సర్కారు విదేశాంగ విధానం ఊగిసలాడుతోందని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. విదేశాంగ విధానంలో స్థిరత్వం లేకపోవడం వల్ల దేశ ప్రజలు మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తోందని ఆయన మండిపడ్డారు. భారత ప్రభుత్వ కాంట్రాక్టుల కోసం చైనా కంపెనీలు బిడ్స్ దాఖలు చేయకుండా ఐదేళ్ల క్రితం అమల్లోకి తెచ్చిన పరిమితులను తొలగించాలనే కేంద్రం యోచనను ఖర్గే తప్పుపట్టారు. ఈ మేరకు శుక్రవారం ఎక్స్ వేదికగా ఓ ట్వీట్ చేశారు.



**మోదీ చెప్పిన దానికి భిన్నంగా పరిస్థితి**

‘దేశాన్ని తలవంచనివ్వను‘ అని ప్రధాని మోదీ చెప్పగా, ప్రస్తుత పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తోందని ఖర్గే ఫైర్ అయ్యారు. రెండు తాజా ఉదాహరణలను చూస్తే, చైనా కంపెనీలకు భారత ప్రభుత్వ కాంట్రాక్టుల కేటాయింపుపై ఐదేళ్లుగా ఉన్న బ్యాన్‌ను ఎత్తేసే యత్నం చేస్తున్నారని మండిపడ్డారు. చైనాకు క్లీన్ చిట్ ఇవ్వడం ద్వారా గల్వాన్‌లో భారత్ కోసం ప్రాణాలిచ్చిన వీర సైనికులను అవమానించేలా మోదీ వ్యవహరించారని విమర్శించారు. ఇప్పుడు చైనా కంపెనీలను భారత్‌లోకి ఆహ్వానించేందుకు మోదీ రెడ్ కార్పెట్ వేస్తున్నారన్నారు. ఈ విధమైన చర్యల ద్వారా చైనాపై తన ఆగ్రహం వట్టిదేనని ప్రధాని నిరూపించుకున్నారని ఖర్గే తెలిపారు.

**ట్రంప్ వ్యాఖ్యలపై మోదీ మౌనం సరికాదు!**

“రష్యా నుంచి భారత్ చమురును కొంటున్న అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ప్రధాని మోదీ మౌనం వహించడం సరికాదు. సరెండర్ అయ్యారు అనేందుకు అదొక సంకేతం లాంటిది. ట్రంప్ కళ్లలోకి కళ్లు పెట్టి మోదీ చూడలేకపోతున్నారు. అమెరికా అధ్యక్షుడిని ‘సర్‘ అని భారత ప్రధాని సంబోధించడం కూడా సరెండర్ కావడం లాంటిదే. మా దృష్టిలో విదేశాంగ విధానం అంటే అన్నింటి కంటే దేశ ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం. భారతదేశ అలీన విధానం, వ్యూహాత్మక స్వతంత్ర విదేశాంగ విధానాలకు నష్టాన్ని కలిగించేలా మోదీ సర్కారు వ్యవహరిస్తోంది. గడియారంలోని పెండ్యులమ్‌లా ఓసారి ఇటువైపునకు, మరోసారి అటువైపునకు భారత విదేశాంగ విధానం ఊగిసలాడుతోంది“ అని ఖర్గే పేర్కొన్నారు.

**గల్వాన్ నుంచి టియాన్‌జిన్ దాకా**

2020 జూన్ 15న గల్వాన్ లోయలో భారత్, చైనా సైనికుల మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. ఆ ఘటనలో పలువురు భారత సైనికులు అమరులయ్యారు. దీంతో భారత ప్రభుత్వ కాంట్రాక్టుల కోసం బిడ్లు దాఖలు చేయకుండా చైనా కంపెనీలపై బ్యాన్‌ను అమల్లోకి తెచ్చారు. అమెరికాలో 2025 సంవత్సరం ఆరంభంలో ట్రంప్ సర్కారు ఏర్పడింది. అది వరుసపెట్టి భారత్‌పై దిగుమతి సుంకాలను బాదింది. దీంతో అమెరికాకు భారతదేశ దిగుమతులు బాగా పడిపోయాయి. ఈ నేపథ్యంలో 2024 అక్టోబరు 23న రష్యాలోని కజన్ నగరం వేదికగా భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ భేటీ అయ్యారు. సరిహద్దు వివాదానికి తెరదించాలని, సైనిక ఉద్రిక్తతలను తగ్గించాలని ఇరువురు నిర్ణయించారు. గత సంవత్సరం(2025 ఆగస్టు 31 - సెప్టెంబరు 1) చైనాలోని టియాన్‌జిన్ వేదికగా షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) సదస్సుకు కూడా ప్రధాని మోదీ హాజరయ్యారు.

**భారత్ వైఖరిలో మార్పునకు దారితీసిన పరిణామాలు**

గత ఐదేళ్లలో ఈ విధంగా చోటుచేసుకున్న పరిణామాల ప్రభావం భారత విదేశాంగ విధానంపై పడిందని అంతర్జాతీయ వ్యవహారాల పరిశీలకులు అంటున్నారు. ఒకప్పుడు అమెరికాకు అత్యంత సన్నిహితంగా భారత్ మెలిగేది. కానీ ట్రంప్ సర్కారు వైఖరి కారణంగా సీన్ మారిపోయింది. ఆనాడు అమెరికాకు చేరువయ్యే ప్రయత్నంలో చైనా విషయంలో భారత్ కఠిన వైఖరిని తీసుకుంది. ఇప్పుడు భారత్ స్నేహానికి విలువ ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా ట్రంప్ సర్కారు వ్యవహరిస్తుండటంతో మోదీ సర్కారు సైతం తన వైఖరిని మార్చుకుంది. చైనాతో వైరం కంటే స్నేహమే ప్రయోజనకరమనే భావనకు వచ్చింది. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వ కాంట్రాక్టుల కోసం పోటీపడే అవకాశాన్ని మళ్లీ చైనా కంపెనీలకు కల్పించాలనే అంశాన్ని మోదీ సర్కారు పరిశీలిస్తోంది.

# బీజేపీ అంటే భ్రష్ట జనతా పార్టీ

బీజేపీ పాలిత ప్రభుత్వాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ. బీజేపీని భ్రష్ట జనతా పార్టీగా అభివర్ణించిన రాహుల్, అవినీతి, అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందని దుయ్యబట్టారు. పేదలు, కార్మికులు, మధ్యతరగతి ప్రజల అభివృద్ధిలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. అంకిత భండారీ హత్య కేసు లాంటి కేసుల్లో నిందితులకు రక్షణ ఎలా లభిస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.



“దేశవ్యాప్తంగా భ్రష్ట (అవినీతి) జనతా పార్టీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు ప్రజల జీవితాలను నాశనం చేస్తున్నాయి. బీజేపీలో పై నుంచి కింది స్థాయి వరకు అవినీతి, అధికార దుర్వినియోగం వ్యాప్తి చెందింది. వారి పాలనలో పేదలు, నిస్సహాయులు, కార్మికులు, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వారి దృష్టిలో వీరంతా కేవలం గణాంకాలు మాత్రమే. అభివృద్ధి పేరుతో దోపిడీ వ్యవస్థ నడుస్తోంది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఉత్తరాఖండ్ అంకితా భండారీ కేసులో ఈ రోజుకీ ఒకటే ప్రశ్న తలెత్తుతోంది. అధికారంలోనే ఏ బీజేపీ వీఐపీ నిందితులను రక్షిస్తున్నారుల అందరికీ సమన్యాయం ఎప్పుడు దక్కుతుంది అలాగే ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్ రేప్ కేసులోనూ నిందితులను రక్షిస్తున్నారు. ఇండోర్‌లో కలుషిత నీరు తాగి మరణించినా, గుజరాత్, హరియాణా, ఢిల్లీలో కలుషిత నీరు, గాలితో చనిపోయినా అందరిలోనూ ఒకటే వ్యాధుల భయం ఉంది.“

**‘బిలియనీర్ల కోసం డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని నడుపుతున్నారు‘**

ఆస్పత్రుల్లో మరణాలు సహా పాలన వైఫల్యంపైనా రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బీజేపీ అవినీతి పాలనలో ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు కూలి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వీటన్నింటికీ ప్రభుత్వం బాధ్యత వహించకుండా కేవలం పరిహారం, పబ్లిసిటీ మాత్రమే చేస్తుందని విమర్శించారు. ప్రజా భద్రతతో పాటు పర్యావరణ విధ్వంసం పైనా ఆరోపణలు చేశారు. మోదీజీ కేవలం బిలియనీర్ల కోసం డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని నడుపుతున్నారని దుయ్యబట్టారు. బిలియనీర్ల కోసం నిబంధనలను మారుస్తూ ప్రజల జీవితాలను ఫణంగా పెడుతున్నారని విమర్శించారు.

‘ప్రతిరోజు ఎవరో ఒకరి జీవితాన్ని ఇది చిదిమేస్తుంది‘

“రాజస్థాన్‌లోని ఆరావళి పర్వతాల నుంచి మిగిలిన ప్రకృతి సంపద వరకు కోటీశ్వరుల కళ్లు పడిన ప్రాంతాల్లో నిబంధనలను మారిపోయాయి. పర్వతాలను ధ్వంసం చేస్తున్నారు. అడవులను నరికేస్తున్నారు. వీటికి ప్రతిఫలంగా ప్రజలు దుమ్ము, కాలుష్యం, విపత్తులను ఎదుర్కొంటున్నారు. దగ్గు మందు తాగి చిన్నారుల మరణించారు. ఆస్పత్రుల్లో ఎలుకలు కొరికి నవజాత శిశువులు చనిపోయారు. ప్రభుత్వ పాఠశాలల్లో పైకప్పులు కూలిపోయి పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఇది బాధ్యతారాహిత్యం కాదు. అవినీతి వల్ల తలెత్తిన పర్యావసనాలు. వంతెనలు కూలాయి. రోడ్లు దెబ్బతిన్నాయి. రైలు ప్రమాదాల్లో అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఇన్ని జరిగినా బీజేపీ ప్రభుత్వం ప్రతీసారి ఒకటే చేస్తుంది. ఫొటోలకు ఫోజులు, ట్వీట్లు, ఫొటోలు, సంతాపాలు, పరిహారాలు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. మోదీజీ కేవలం బిలియనీర్ల కోసం డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. ఈ డబుల్ ఇంజిన్ అభివృద్ధిలో కాదు విధ్వంసంలో వేగంగా వెళ్తుంది. ప్రతిరోజు ఎవరో ఒకరి జీవితాన్ని ఇది చిదిమేస్తుంది.“ అని రాహుల్ గాంధీ అన్నారు.

## గాజాలో పాక్ సైన్యం వద్దు...
## నమ్మకం లేని దేశాలతో పనిచేయలేం




గాజాలో శాంతిని పర్యవేక్షించేందుకు ఉద్దేశించిన అంతర్జాతీయ బలగాల్లో పాకిస్థాన్ సైన్యాన్ని కూడా చేర్చాలన్న ప్రతిపాదనను ఇజ్రాయెల్ తీవ్రంగా వ్యతిరేకించింది. తాము విశ్వసించని, సరైన దౌత్య సంబంధాలు లేని దేశాలతో కలిసి పనిచేయలేమని స్పష్టం చేసింది. అమెరికా ప్రతిపాదించిన ఇంటర్నేషనల్ స్టెబిలైజేషన్ ఫోర్స్‌లో పాకిస్థాన్ సైన్యాన్ని కూడా భాగం చేయాలని వాషింగ్టన్ భావిస్తున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ ఈ మేరకు తన అధికారిక వైఖరిని వెల్లడించింది. భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ ఎన్డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాలను వెల్లడించారు. “మేము నమ్మకంగల దేశాలతోనే కలిసి పనిచేయగలం. పాకిస్థాన్‌తో మాకు అలాంటి సంబంధాలు లేవు“ అని ఆయన తేల్చిచెప్పారు. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే లష్కర్-ఏ-తోయిబా, జైష్-ఏ-మహమ్మద్ వంటి ఉగ్రవాద సంస్థలతో హమాస్‌కు సంబంధాలు బలపడుతున్నాయని ఇజ్రాయెల్ ఆందోళన వ్యక్తం చేసింది. గత మూడేళ్లుగా హమాస్ సీనియర్ కమాండర్ నజీ జహీర్ తరచూ పాకిస్థాన్‌లో పర్యటించి ఆయా సంస్థల ప్రతినిధులతో సమావేశమవుతున్నట్లు తమ వద్ద ఇంటెలిజెన్స్ సమాచారం ఉందని అజార్ పేర్కొన్నారు. గాజాలో ఎలాంటి రాజకీయ పరిష్కారం లేదా పునర్నిర్మాణం చేపట్టాలన్నా ముందుగా హమాస్‌ను పూర్తిగా నిర్మూలించడం తప్పనిసరి అని ఇజ్రాయెల్ గట్టిగా చెబుతోంది. హమాస్ ఉనికిలో ఉండగా శాంతి పరిరక్షణ దళాలను పంపడంలో అర్థం లేదని, హమాస్‌తో పోరాడటానికి చాలా దేశాలు సిద్ధంగా లేవని ఆయన గుర్తుచేశారు. ఈ అంశంపై ఇజ్రాయెల్ ఇంత బహిరంగంగా, అధికారికంగా స్పందించడం ఇదే మొదటిసారి.

## మోదీ ఫోన్ చేయలేదన్న అమెరికా
## వ్యాఖ్యలపై స్పందించిన భారత్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ప్రధాని మోదీ ఫోన్ చేయకపోవడం వల్లే భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదరలేదన్న అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ వ్యాఖ్యలపై భారత్ స్పందించింది. లుట్నిక్ వ్యాఖ్యలను భారత్ తప్పుబట్టింది. ఇరుదేశాలకు సంబంధించి వివిధ అంశాల్లో గత సంవత్సరం ప్రధాని మోదీ, ట్రంప్ ఎనిమిదిసార్లు ఫోన్‌లో సంభాషించుకున్నారని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై అమెరికా అదనపు ఆంక్షలు విధించే బిల్లుపై తమకు అవగాహన ఉందని, ఈ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపింది. అమెరికా వాణిజ్య శాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలను చూశామని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ అన్నారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చించేందుకు గత సంవత్సరం ఫిబ్రవరి 13 నాటికే ఇరుదేశాలు కట్టుబడి ఉన్నాయని అన్నారు. నాటి నుంచి పరస్పర ప్రయోజనం చేకూరే వాణిజ్య ఒప్పందం కోసం ఇరుపక్షాలు పలుమార్లు సంప్రదింపులు జరిపాయని తెలిపారు. వీటికి సంబంధించి అమెరికా మంత్రి వ్యాఖ్యల్లో స్పష్టత కనిపించలేదని అన్నారు. పలుమార్లు ఒప్పందానికి దగ్గరగా వచ్చామని, ఇప్పటికీ దీనిపై ముందుకు వెళ్లడానికి ఆసక్తిగా ఉన్నామని అన్నారు.

## దేశంలో ఆందోళనలు...
## ట్రంప్‌పై ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ తీవ్ర ఆగ్రహం

ఇరాన్‌లో 13వ రోజు ప్రభుత్వ వ్యతిరేక అల్లర్లు కొనసాగుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఉద్దేశించి ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇతర దేశాలకు సూచనలు చేసే ముందు సొంత దేశంపై దృష్టి సారించాలని హితవు పలికారు. దేశంలోని ఆందోళనకారులకు సైతం ఆయన హెచ్చరిక జారీ చేశారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. విదేశీ శక్తుల చేతుల్లో కీలుబొమ్మల్లా వ్యవహరించే వారిని సహించే ప్రసక్తి లేదని ఆయన స్పష్టం చేశారు. ఇతర దేశాధ్యక్షుడిని సంతోషపెట్టేందుకు సొంత వీధులను నాశనం చేసుకుంటున్నారని ఇరాన్ ఆందోళనకారులను ఉద్దేశించి అన్నారు. సొంత దేశంలో అశాంతిని రగిలించేందుకు పాశ్చాత్య శక్తులకు కొందరు వంత పాడుతున్నారని ఆయన విమర్శించారు. ప్రవాసంలో తలదాచుకున్న యువరాజు రెజా పహ్లావి ఇచ్చిన పిలుపు మేరకు ఇరాన్‌లో ఆందోళనకారులు పెద్ద ఎత్తున రోడ్ల పైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు. దేశంలో ఇంటర్నెట్, టెలిఫోన్ సేవలు నిలిపివేసినప్పటికీ ఆందోళనకారులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ స్పందించారు.



## ఘోర ప్రమాదం..
## బస్సు లోయలో పడి ఏడుగురు మృతి



హిమాచల్ ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రయాణికులతో వెళుతున్న బస్సు అదుపుతప్పి లోయలోకి పడిపోయింది ఈ ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన శుక్రవారం మధ్యాహ్నం సిర్మౌర్ జిల్లాలోని రేణుకాజీ అసెంబ్లీ నియోజకవర్గంలో చోటు చేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ ప్రైవేటు బస్సు ప్రయాణికులతో వెళ్తోంది. అయితే బస్సు హరిపుర్ధార్ మార్కెట్ సమీపంలోకి రాగానే ప్రమాదానికి గురైంది. అదుపుతప్పి 60 మీటర్ల లోతైన లోయలోకి పడిపోయింది. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్ హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఢిల్లీ దాకా వచ్చి మనూ విద్యార్థులతో కలిసి పోరాడుతాం

-మొదటిపేజీ తరువాయి

చేస్తున్న కుట్రలపై చర్చించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఉర్దూ యూనివర్సిటీని నిర్వీర్యం చేసే కుట్రలను విద్యార్థులు వివరించారని తెలిపారు. ఓఆర్ఆర్ కోసం మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ గతంలో 32 ఎకరాలు ఇచ్చిందని కేటీఆర్ తెలిపారు. ఖాజాగూడ లింక్ రోడ్డు కోసం మరో 7 ఎకరాల భూమి ఇచ్చారని పేర్కొన్నారు. ఇప్పుడు మళ్లీ 50 ఎకరాల భూమిపై రేవంత్ సర్కార్ కుట్రలు చేస్తుందని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రం రియల్ ఎస్టేట్ బ్రోకర్ చేతిలో ఉందని అన్నారు. అగ్రికల్చర్ యూనివర్సిటీ, హెచ్‌సీయూ భూములపై రేవంత్ కుట్రలు చేశారని మండిపడ్డారు. హెచ్‌సీయూలో రూ.10వేల కోట్ల కుంభకోణం జరిగితే కేంద్రం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. యూనివర్సిటీ భూములపై రేవంత్ సర్కార్ విరుచుకుపడుతుందని కేటీఆర్ విమర్శిం చారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని రాహుల్ గాంధీ చేస్తున్నది ఇదేనా అని ప్రశ్నించారు. మైనార్టీలపై ప్రేమ అంటే ఇదేనా అని నిలదీశారు. రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యా యని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రశ్నించారు. చేతగాని సన్యాసి రాహుల్ గాంధీ అని విమర్శించారు. యూనివర్సిటీల్లోని భూములంటే వినియోగంలో లేని భూములా అని మండిపడ్డారు. మనూ భూముల కోసం విద్యార్థుల పోరాటానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక మనూను మరింత అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. ఢిల్లీ వరకు వచ్చి మనూ విద్యార్థులతో కలిసి పోరాడుతామని స్పష్టం చేశారు.

**మీరు చెబుతున్న మొహబ్బత్ కీ దుకాణ్ ఇదేనా..**
**రాహుల్ గాంధీపై కేటీఆర్ ధ్వజం**

మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ( మనూ ) భూములపై రేవంత్ సర్కార్ కుట్రల నేపథ్యంలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. దేశంలో మైనార్టీల సంరక్షకుడిని అని చెప్పుకునే రాహుల్ గాంధీ.. ఉర్దూ యూనివర్సిటీ భూములను అన్యాక్రాంతం చేయడమే కాపాడటమా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో కేటీఆర్‌తో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ( మనూ ) విద్యార్థులు సమావేశమయ్యారు. యూనివర్సిటీకి చెందిన 50 ఎకరాల భూమిపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలపై చర్చించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చి చదువుకుంటున్న మైనార్టీ విద్యార్థుల యూనివర్సిటీని నిర్వీర్యం చేయడమే మీ సంరక్షణనా అని ప్రశ్నించారు. దీనిపై సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు. మీరు చెబుతున్న మొహబ్బత్ కి దుకాణం ఇదేనా అని ప్రశ్నించారు. విద్యార్థులను వారి భూములను తీసుకొని రోడ్డుమీద వేయడమేనా? అని నిలదీశారు. సెంట్రల్ యూనివర్సిటీలో ఉన్న సమస్యలపై రాహుల్ గాంధీ మాట్లాడాలి కానీ వారి భూములు గుంజుకుంటున్న తమ ప్రభుత్వంపై స్పందించకపోవడం దారుణమని కేటీఆర్ విమర్శించారు. యూనివర్సిటీలో ఉన్న భూములు ఖాళీగా ఉన్నవి కావు భవిష్యత్తు విస్తరణ కోసం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సెంట్రల్ యూనివర్సిటీ ప్రతిష్టను తగ్గించేలా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. గతంలో ఇదే యూనివర్సిటీ ప్రజా అవసరాల కోసం హైదరాబాద్ నగరం కోసం 32 ఎకరాలు ఔటర్ రింగ్ రోడ్డు కోసం ఇచ్చారని, ఖాజాగూడ నుంచి నానక్ రామ్ గూడ కు లింక్ రోడ్డు కోసం ఏడెకరాల స్థలాన్ని యునివర్సిటీ భూమి ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఏనాడు కూడా హైదరాబాద్ నగర ప్రయోజనాల కోసం ప్రజాప్రయోజనాల కోసం అవసరమైనప్పుడు భూసేకరణను ఏనాడు వ్యతిరేకించలేదని చెప్పారు. గతంలో తెలంగాణలో జరిగిన ఉద్యమం వల్లనే హైదరాబాద్‌లో సెంట్రల్ యూనివర్సిటీ, ఉర్దూ యూనివర్సిటీ ఏర్పడిందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమాలు త్యాగాల ఆధారంగా ఏర్పడిన యూనివర్సిటీని రియల్ ఎస్టేట్ కోసం వాడటం దారుణమని మండిపడ్డారు. గతంలో మేము నిజాం కాలేజీలో హాస్టల్ లేదు అంటే ప్రభుత్వ నిధులతో హాస్టల్ కట్టించామని గుర్తుచేశారు. మా ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత యూనివర్సిటీకి అండగా ఉంటామని స్పష్టం చేశారు. కావలసిన విస్తరణ సౌకర్యాలకు నిధులు కూడా కేటాయించి అండగా నిలబడతామని భరోసానిచ్చారు.

# డీలర్ దగ్గరే వాహనాల రిజిస్ట్రేషన్




**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో రవాణా శాఖలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. కొత్తగా వ్యక్తిగత వాహనాలను కొనుగోలు చేసే సామాన్యులకు ఊరటనిచ్చేలా ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ కోసం వాహనదారులు ప్రాంతీయ రవాణా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదు. వాహనం కొనుగోలు చేసిన షోరూమ్‌లోనే అంటే డీలర్ వద్దనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసేలా నూతన సంస్కరణలను అమల్లోకి తెచ్చారు. కొంతకాలంగా ఆర్టీఏ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ అంటేనే అవినీతికి నిలయమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా వ్యక్తిగత వాహనాల శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాలకు వెళ్లినప్పుడు, అక్కడ ఉండే మధ్యవర్తులు లేదా అధికారులకు ముడుపులు ఇస్తేనే పనులు జరుగుతున్నాయన్న ఫిర్యాదులు పెరిగాయి. . ఈ పరిస్థితిని గమనించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గతేడాది డిసెంబర్ 19న రవాణా శాఖాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా, డీలర్ల వద్దనే నేరుగా రిజిస్ట్రేషన్ చేసే విధానాన్ని తీసుకురావాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రవాణాశాఖ కమిషన్ ఇలంబర్తి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నూతన విధానాన్ని సంబంధించి అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను కేవలం 15 రోజుల్లోగా సిద్ధం
చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఈ సేవలను వేగవంతం చేసేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నారు. వాస్తవానికి కేంద్ర రోడ్డు రవాణా, రహదారి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో వాహన్, సారథి పోర్టల్ ద్వారా దేశంలోని పలు రాష్ట్రాల్లో ఈ విధానం ఇప్పటికే అమలవుతోంది. అయితే తెలంగాణలో ఈ పోర్టల్‌లు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడానికి మరో ఆరు నెలల సమయం పట్టే అవకాశం ఉండటంతో, ప్రజలకు తక్షణ సౌకర్యం కోసం ప్రభుత్వం ఈ తాత్కాలిక సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేస్తోంది.

ఇప్పటి వరకు ఉన్న నిబంధనల ప్రకారం, ఎవరైనా కొత్త వాహనాన్ని కొనుగోలు చేస్తే డీలర్ వద్ద కేవలం తాత్కాలిక రిజిస్ట్రేషన్ మాత్రమే జరిగేది. శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం తప్పనిసరిగా వాహనాన్ని ఆర్టీఏ కార్యాలయానికి తీసుకెళ్లాల్సి వచ్చేది. కానీ కొత్త నిబంధనల ప్రకారం, అధీకృత డీలర్ వద్దనే శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

వాహనదారులు డీలర్ వద్ద సమర్పించాల్సిన పత్రాలు
వాహన్ ఇన్వాయిస్
ఫారం-21( విక్రయ ధ్రువీకరణ పత్రం)
ఫారం-22(రోడ్డు అనుకూలత ధ్రువీకరణ)
బీమా
కొనుగోలుదారుల చిరునామా ధ్రువీకరణ పత్రం
సదరు వ్యక్తి పేరు మీద మరో వాహనం లేదని తెలిపే డిక్లరేషన్
కొనుగోలుదారుల ఫొటో, సంతకం స్కాన్ కాపీ
వాహనం ఇంజిన్, ఛాసిస్ నంబర్ల ఫొటోలు
రవాణా శాఖ నిర్దేశించే ఇతర అవసరమైన పత్రాలు

ఈ పత్రాలన్నింటినీ డీలర్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆ తర్వాత రిజిస్టరింగ్ అథారిటీ లేదా అదనపు రిజిస్టరింగ్ అథారిటీ ఆ పత్రాలను నిశితంగా పరిశీలిస్తారు. అన్ని నిబంధనల ప్రకారం ఉంటే దరఖాస్తును ఆమోదిస్తారు. లేని పక్షంలో తిరస్కరించే అధికారం ఉంటుంది. దరఖాస్తు ఆమోదం పొందిన తర్వాత, వాహనదారులకు రిజిస్ట్రేషన్ పత్రం కోసం ఎదురు చూడాల్సిన పని లేదు. నమోదు ప్రక్రియ పూర్తి అయిన తర్వాత ఆర్సీ కార్డు నేరుగా స్పీడ్ పోస్టు ద్వారా కొనుగోలుదారుల చిరునామాకు పంపిస్తారు. దీని వల్ల వాహనదారులకు సమయం ఆదా అవుతుంది. కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమ తప్పుతుంది. ఈ సడలింపుల వల్ల ఎటువంటి అక్రమాలు జరగకుండా ప్రభుత్వం కఠిన నిబంధనలను కూడా పెట్టింది. డీలర్ల వద్ద ఉన్న వాహనాల నిల్వలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను అధికారులు ఎప్పుడైనా తనిఖీ చేయవచ్చు. వెహికల్ ఇన్‌స్పెక్టర్, ఆర్టీవో, డీటీసీ, జేటీసీ, రవాణా కమిషనర్ కూడా అధీకృత డీలర్ల వద్ద తనిఖీలు చేయవచ్చు. తద్వారా నిబంధనలు ఉల్లంఘించే డీలర్లపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# మహిళల సేఫ్టీలో తెలంగాణ ఫోర్త్ ప్లేస్




**హైదరాబాద్ :** దేశంలోనే మహిళలకు బెస్ట్ సిటీగా బెంగళూరు రికార్డు సృష్టించింది. టాప్ సిటీస్ ఫర్ ఉమెన్ ఇన్ ఇండియా 2025 నివేదిక ప్రకారం.. మహిళా సాధికారత, ఉద్యోగ అవకాశాల్లో బెంగళూరు దేశంలోనే నంబర్ 1 నగరంగా నిలిచింది. భద్రతలో మొదటి స్థానంలో చెన్నై ఉండగా.. హైదరాబాద్ నాలుగో స్థానంలో నిలిచింది. మొత్తం మీద దక్షిణ, పశ్చిమ భారతదేశ నగరాలు మహిళలకు అత్యంత సురక్షితమైన, వృద్ధిని ఇచ్చే ప్రాంతాలుగా తమ ఆధిపత్యాన్ని చాటుకున్నాయి.తమిళనాడు రాజధాని చెన్నైకి చెందిన అవతార్ గ్రూప్ అనే ప్రముఖ వర్క్‌ప్లేస్ ఇంక్లూజన్ సంస్థ 2025 ఏడాదికి గానూ దేశంలోని వివిధ నగరాలపై.. పలు అంశాలపై అధ్యయనం
నిర్వహించింది. ఈ తాజా అధ్యయనంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2025లో భారతదేశంలో మహిళలు నివసించడానికి, పనిచేయడానికి అత్యంత అనుకూలమైన నగరంగా కర్ణాటక రాజధాని బెంగళూరు అగ్రస్థానంలో నిలిచింది. ఈ రిపోర్ట్‌లో మొత్తం దేశంలోని 125 నగరాలను విశ్లేషించి.. సిటీ ఇంక్లూజన్ స్కోర్ (సీఐఎస్) ఆధారంగా ఆయా నగరాలకు అవతార్ గ్రూప్ ర్యాంకులను కేటాయించారు.మొత్తం స్కోరులో 53.29 పాయింట్లతో మొదటి స్థానంలో బెంగళూరు నిలిచింది. ఆ తర్వాత 49.86 పాయింట్లతో చెన్నై రెండో స్థానంలో నిలిచింది. ఇక టాప్-5లో ఉన్న పుణె (46.27).. హైదరాబాద్ (46.04).. ముంబై (44.49) వరుసగా నిలిచాయి. ప్రధానంగా రెండు అంశాల మీద ఆధారపడి ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఒకటి సామాజిక భద్రత, జీవన ప్రమాణాలను కొలిచే సోషల్ ఇంక్లూజన్ స్కోర్.. రెండోది ఉద్యోగ అవకాశాలు, పని వాతావరణాన్ని కొలిచే ఇండస్ట్రియల్ ఇంక్లూజన్ స్కోర్.మహిళల భద్రత, ప్రభుత్వ సేవలు, విద్య, ఆరోగ్య సదుపాయాల విషయంలో చెన్నై నగరం దేశంలోనే అగ్రస్థానాన్ని దక్కించుకుంది. అయితే.. బలమైన కార్పొరేట్ వ్యవస్థ, స్టార్టప్‌లు, విస్తృతమైన ఉద్యోగ అవకాశాల కారణంగా బెంగళూరు పారిశ్రామిక విభాగంలో అగ్రస్థానంలో నిలిచి ఓవరాల్‌గా నంబర్ 1 నగరంగా మారింది. హైదరాబాద్, పుణె నగరాలు అటు సామాజిక భద్రతలోనూ.. ఇటు ఉద్యోగ అవకాశాలలోనూ సరైన సమతుల్యతను కలిగి ఉన్నాయని ఈ నివేదిక వెల్లడించింది.ఈ నివేదికలోని మరో ఆసక్తికరమైన అంశం ఏంటంటే.. టాప్ 10 నగరాల జాబితాలో దక్షిణ భారతదేశం నుంచి.. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, తిరువనంతపురం, కోయంబత్తూర్ అనే 5 నగరాలు చోటు దక్కించుకున్నాయి. ఇది దక్షిణ భారత్‌లో మహిళలకు ఉన్న సురక్షితమైన, వృద్ధిదాయకమైన వాతావరణాన్ని ప్రతిబింబిస్తోంది. ఉత్తర భారతదేశం నుంచి.. గురుగ్రామ్ ఒక్కటే 6వ స్థానంలో నిలిచి టాప్ 10 నగరాల జాబితాలో చేరింది.

## వివాదాలు వద్దు..

-మొదటిపేజీ తరువాయి

వ్యక్తం చేశారు. తాము వివాదం కోరుకోవడం లేదని.. పరిష్కారమే కోరుకుంటున్నామని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాలు కాదని.. ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసమే ఆలోచిస్తున్నామని రేవంత్ రెడ్డి స్పష్టీకరించారు.

**చర్చలు కొనసాగుతాయి..**

తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలంటే పక్క రాష్ట్రం సహకారం అవసరమన్నారు. రెండు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకోకపోతే సమస్యలు పరిష్కారం కావని చెప్పుకొచ్చారు. ఇందుకోసం పక్క రాష్ట్రంతో చర్చలు కొనసాగుతాయని తెలిపారు. ఏపీ అయినా, కర్ణాటక అయినా, తమిళనాడు అయినా, మహారాష్ట్ర అయినా.. పక్క రాష్ట్రాలతో వివాదాలు కోరుకోవడం లేదని, పరస్పర సహకారమే కోరుకుంటున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, మల్ రెడ్డి రంగారెడ్డి, కాలె యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో బకాయిల 'పంచాయితీలు'

-మొదటిపేజీ తరువాయి

కొలువుదీరాయి. కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కానుండటంతో పాత సర్పంచుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అప్పులు తెచ్చి ఊరి కోసం ఖర్చు చేశాం. ఇప్పుడు ఆ నిధులు తమకు అందుతాయా అని మాజీ సర్పంచులు ఆరా తీస్తున్నారు. అయితే పంచాయతీ అభివృద్ధి పద్దు నుంచి బకాయిలను నూతన పాలకవర్గాలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ తరుణంలో కేంద్రం నిధులు పాత గాయాలను మాన్పుతాయా కొత్త వివాదాలను తీసుకొస్తాయా అనేది ఆసక్తికరంగా మారింది.

ఇంకో వైపు ప్రత్యేకాధికారుల పాలనలో అత్యవసర పనుల కోసం సొంతంగా ధనం వెచ్చించిన కార్యదర్శులు సైతం బిల్లుల కోసం దస్త్రాలు సిద్ధం చేస్తుండటం గమనార్హం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే పంచాయతీ నిధులను ప్రాధాన్య క్రమంలో వెచ్చిస్తామని ఖమ్మం జిల్లా పంచాయతీ నిధులను ప్రాధాన్య క్రమంలో వెచ్చిస్తామని ఖమ్మం జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు తెలిపారు.

**నూతన పాలకవర్గాలకు పెనుసవాల్**

నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు బాధ్యతలు చేపట్టగానే నిధుల కొరత పెనుసవాల్‌గా మారింది. కేంద్రం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులతో కొత్త పనులు చేపడతారా? లేదా పాత బాకీలు తీర్చుతారా? అనే అంశంపై సందిగ్ధం నెలకొంది. ఉభయ జిల్లాల్లో గత సర్పంచులకు చెల్లించాల్సిన బకాయిలే సుమారు రూ.60 కోట్లు ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో ప్రత్యేకాధికారుల పాలనలో చేపట్టిన పనులకు సంబంధించి రూ. 19.31 కోట్లు చెల్లించాలి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రత్యేకాధికారుల పాలనలో చేపట్టిన పనుల లెక్కలు ఇంకా తేలలేదు. ఇవి సుమారు రూ. 10 కోట్ల వరకు ఉండొచ్చు. పాత బాకీలను తీర్చుకూనే గ్రామాల్లో పాలనను గాడిన పెట్టాల్సిన బాధ్యత కొత్త పాలక వర్గాలపై ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**గ్రామ పంచాయతీలకు ఈ విధంగా నిధులు సమకూరుతాయి :**

కేంద్ర ఆర్థిక సంఘం నిధులు : పంచాయతీల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం జనాభా ప్రాతిపాదికన నిధులు మంజూరు చేస్తోంది. నెలకు ఒక్కో వ్యక్తికి రూ. 80 నుంచి రూ. 90 చొప్పున కేటాయిస్తోంది. ఇవి ప్రతి మూడు నెలలకు ఒక్క సారి, సంవత్సరంలో నాలుగు విడతలుగా అందిస్తోంది.

రాష్ట్ర ఆర్థిక సంఘం : రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు సైతం క్రమం తప్పకుండా మంజూరు చేయాల్సి ఉంటుంది. ఇవి కూడా గ్రామపంచాయతీ జనాభా ప్రాతిపదికన ఇస్తారు. కొన్ని సంవత్సరాలుగా ఈ నిధులు విడుదల కావడం లేదు. దీనికి బదులుగా ప్రభుత్వం మల్టీ పర్పస్ వర్కర్లకు వేతనాలు, విద్యుత్తు బిల్లులు చెల్లిస్తోంది.

సాధారణ నిధులు : ఇవి గ్రామ పంచాయతీలు సొంతంగా సమకూర్చుకునే నిధులు. వీటిని పెంచుకునేందుకు పంచాయతీలు ప్రణాళికలు రచించి వాటిని అమలు చేయాల్సి ఉంటుంది.

పన్నుల వసూలు : గ్రామ పంచాయతీ పరిధిలో వివిధ రకాల పన్నులు వసూలు చేస్తారు. ఇంటి పన్ను, గృహ నిర్మాణ అనుమతుల కోసం చెల్లించే పన్ను, ఆస్తి మార్పిడి, కుళాయి పన్ను, దాతల నుంచి అందేవి దీని పరిధిలోకే వస్తాయి.

## 4 వారాల్లో పూర్తిస్థాయి డీజీపీ నియామక ప్రక్రియ పూర్తి చేయండి

-మొదటిపేజీ తరువాయి



డీజీపీ నియామక ప్రక్రియ జగలేదని.. శివధర్ రెడ్డిని నియమిస్తూ జారీ చేసిన జీఓను రద్దు చేయాలని కోరారు. నిబంధనల ప్రకారం డీజీపీ పదవీ విరమణ పొందే సమయానికి మూడు నెలల ముందే యూపీఎస్సీకి ప్యానెల్ పంపాల్సి ఉంటుందన్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఐదుగురు పేర్లతో కూడిన జాబితాను పంపిస్తూ వస్తున్నామని.. కానీ యూపీఎస్సీ క్లారిఫికేషన్ కోసం తిప్పి పంపిందని అడ్వొకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి కోర్టుకు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు డిసెంబర్ 31న కూడా మరోసారి జాబితా పంపామని.. సుప్రీంకోర్టు అనుమతి తీసుకోవాలంటూ యూపీఎస్సీ ఆ జాబితాను తిప్పి పంపిందని ఏజీ కోర్టుకు తెలిపారు. ఆ జాబితాను పరిగణనలోకి తీసుకునే విధంగా యూపీఎస్సీని ఆదేశించాలని ఏజీ కోరారు. సకాలంలో డీజీపీ ప్యానెల్ లిస్ట్ పంపకపోవడం వల్లే తిప్పి పంపామని యూపీఎస్సీ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం.. రాష్ట్ర ప్రభుత్వం పంపిన జాబితాను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని యూపీఎస్సీని ఆదేశించింది. పూర్తిస్థాయి డీజీపీ నియామకంపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తూ తదుపరి విచారణను వచ్చే నెల 5వ తేదీకి వాయిదా వేసింది.

## పురపోరుకు అంతా రెడీ

**హైదరాబాద్ :** రాష్ట్రంలోమున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. సంక్రాంతి పండుగకు మూడు రోజులు ముందుగానే ప్రకటించే అవకాశం ఉంది. నేడు రాజకీయ పార్టీలతో తెలంగాణ ఎన్నికల అధికారి భేటీ కానున్నారక. స్థానిక సంస్థల ఏర్పాట్లపై ఎస్‌ఈసీ చర్చించనుంది. రాష్ట్రంలో 117 మున్సిపాలిటీలకు ఈనెల 20లోగా నోటిఫికేషన్ వెలువడే అవకాశముందని తెలిసింది. తెలొంగాణలోని 117 మునిసిపాలిటీలు, 6 మునిసిపల్ కార్పొరేషన్లలో వార్డుల వారీగా ఓటర్ల జాబితా తయారీని షెడ్యూల్ ప్రకారం సిద్ధంచేస్తోంది. ఈనెల 12న రాష్ట్రవ్యాప్తంగా అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌ల పరిధిలో వార్డుల వారీగా తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు.మున్సిపాలిటీల్లో ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని, కార్యదర్శి మంద్ మకరంద్ అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల కమిషనర్లతో బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేయాలని కమిషనర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎప్పుడైనా మున్సిపాలిటీకి సంబంధించిన నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశముంది. ఇటీవల పంచాయతీ ఎన్నికలను మూడు దఫాలుగా సజావుగా నిర్వహించిన నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికలను కూడా మూడు దశల్లో నిర్వహించాలని నిర్ణయించారుఈనెల 12న అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో ఓటర్ల తుది జాబితాను ప్రచురించాలని, 13న పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రచురణ.. ఆ వెంటనే 'టీ-పోల్' సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారులు సూచించారు.. 16న ఫొటోలతో కూడిన ఓటర్ల తుది జాబితాను పోలింగ్ కేంద్రాల వారీగా ప్రచురించాలని మున్సిపల్ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు అందాయి. సంక్రాంతి పండగ ముగిసిన తర్వాత నోటిఫికేషన్ విడుదల చేసి ఫిబ్రవరి నెలాఖరుకు ఎన్నికలను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం భావిస్తుంది. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నేడు జరిగే ప్రజాప్రతినిధుల సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశముంది.

# జ్ఞాపకశక్తి కావాలా? కొబ్బరిని ఓ పట్టుపట్టండి



ఆరోగ్యం, బలం, జ్ఞాపకశక్తిని అందించే పదార్థాల్లో కొబ్బరి ముఖ్యమైనది. ముఖ్యంగా పచ్చి కొబ్బరి తింటే బోలెడు లాభాలున్నాయి. 100 గ్రాముల పచ్చికొబ్బరిలో 354 కెలొరీల శక్తి ఉంటుంది. పీచు, విటమిన్లు, అమైనో ఆమ్లాలు, క్యాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, మాంగనీస్, కాపర్ లాంటి ఖనిజాలు ఇందులో. కొబ్బరి బోండాం నీళ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్న సంగతి అందరికీ తెలిసిందే. అలాగే ఇందులోని కొబ్బరి కూడా ఎన్నోరకాలుగా మేలు చేస్తుంది. నిజానికి, ఆరోగ్యం, బలం, జ్ఞాపకశక్తిని అందించే పదార్థాల్లో కొబ్బరి ముఖ్యమైనది. ముఖ్యంగా పచ్చి కొబ్బరి తింటే బోలెడు లాభాలున్నాయి. 100 గ్రాముల పచ్చికొబ్బరిలో 354 కెలొరీల శక్తి ఉంటుంది. పీచు, విటమిన్లు, అమైనో ఆమ్లాలు, క్యాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, మాంగనీస్, కాపర్ లాంటి ఖనిజాలు ఇందులో దండిగా ఉంటాయి. కొబ్బరి బరువు తగ్గడానికి సహాయపడటమే కాకుండా జీర్ణక్రియను కూడా మెరుగుపరుస్తుంది. కొబ్బరి శరీరానికి శక్తిని అందించడంలో కూడా ప్రభావవంతంగా ఉంటుంది. ఈ పండు చాలా పోషకమైనది. దీనిలోని సులభంగా జీర్ణమయ్యే ఫైబర్ మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. మంచి పేగు ఆరోగ్యాన్ని కాపాడుతుంది. దీనిలోని మీడియం చైన్ ట్రైగ్లిజరైడ్స్ అనే కొవ్వు త్వరగా శక్తిని అందిస్తుంది. చాలా మంది కొబ్బరిని మధ్యాహ్నం స్నాక్‌గా కూడా తింటారు. ఇది శరీరానికి ఫైబర్ అవసరాన్ని తీరుస్తుంది. విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే కొబ్బరి గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. కొబ్బరిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు గుండెకు చాలా మంచివి. అంతేకాకుండా కొబ్బరి తినడం వల్ల కడుపు ఎక్కువసేపు నిండి ఉంటుంది. కొబ్బరిని తినడం వల్ల ఎముకలు, దంతాలు ఆరోగ్యంగా ఉంటాయి. దీనిని పిల్లలు, పెద్దలు, మహిళలు.. అందరూ తినొచ్చు. కొబ్బరిలో పిండిపదార్థం తక్కువగా, పీచు ఎక్కువగా ఉంటుంది. దాంతో రక్తంలో చక్కెరస్థాయులు నికడగా ఉంటాయి. కాబట్టి దీన్ని తింటే మధుమేహం కూడా అదుపులో ఉంటుంది. ఇది వృద్ధాప్య ఛాయలు రాకుండా అడ్డుకుంటుంది. కొబ్బరి మూత్ర సంబంధ సమస్యలను తగ్గిస్తుంది. జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేస్తుంది. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో వంటలలో కొబ్బరి లేకుండా ఏ వంట పూర్తికాదు. ఇక కొబ్బరి నుంచి తీసే నూనె శరీరానికి మేలు చేయడమే కాకుండా ఈ నూనెను పూయడం వల్ల జుట్టు, చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది.

# కడుపు క్యాన్సర్ లక్షణాలు..



చాలా మందిని వేధిస్తున్న అతి పెద్ద సమస్యల్లో క్యాన్సర్ ఒకటి. ప్రస్తుతం క్యాన్సర్ అనేది చాప కింద నీరులా వ్యాపిస్తుంది. రోజు రోజుకు క్యాన్సర్ కేసులు అనేవి విపరీతంగా పెరిగిపోతున్నాయి. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు చాలా మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. దీనికి ముఖ్యకారణం, తీసుకుంటున్న ఆహారం, జీవనశైలి. అయితే క్యాన్సర్‌లు అనేక రకాలు ఉన్నాయి. చాలా మందిని వేధిస్తున్న అతి పెద్ద సమస్యల్లో క్యాన్సర్ ఒకటి. ప్రస్తుతం క్యాన్సర్ అనేది చాప కింద నీరులా వ్యాపిస్తుంది. రోజు రోజుకు క్యాన్సర్ కేసులు అనేవి విపరీతంగా పెరిగిపోతున్నాయి. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు చాలా మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. దీనికి ముఖ్యకారణం, తీసుకుంటున్న ఆహారం, జీవనశైలి. అయితే క్యాన్సర్‌లు అనేక రకాలు ఉన్నాయి. కడుపు క్యాన్సర్, గ్యాస్ట్రిక్ క్యాన్సర్ అనేది చాలా సాధారణమైనది. దీనిని సైలెంట్ కిల్లర్ అని కూడా అంటారు. ఎందుకంటే ప్రాణం పోయే స్టేజ్ వరకు దీని లక్షణాలు అంతగా బయటపడవు. ముఖ్యంగా దీని లక్షణాలు సాధారణ కడుపు సమస్యల మాదిరిగా ఉండటం వలన చాలా మంది దీనిని విస్మరిస్తారు. ఇది చాలా ప్రమాదకరంగా మారుతుంది. అయితే ప్రస్తుతం ఈ రకమైన క్యాన్సర్ కేసులు రోజు రోజుకు విపరీతంగా పెరుగుతున్నాయంట. ఆకలి లేకపోవడం, విపరీతంగా బరువు తగ్గడం, ఎవరికైతే ఆకలి అనేది రోజు రోజుకు నశించిపోతుందో లేదా ఆకలి అనేది లేకుండా, విపరీతంగా బరువు తగ్గుతున్నారో వారు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలంట. ఎందుకంటే ఇది కడుపు క్యాన్సర్‌లో ప్రాథమిక లక్షణం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. అంతే కాకుండా కడుపు క్యాన్సర్ ఉన్నవారిలో మిగేటప్పుడు నొప్పి వంటి సమస్యలు ఎదురవుతాయంట. భోజనం చేసిన వెంటనే అజీర్ణం, గ్యాస్, గుండెల్లో మంట వంటి సమస్యలు వస్తే అస్సలే ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలంట. ఎందుకంటే చాలా మంది ఇలాంటి సమస్యలను లైట్ తీసుకుంటారు. కానీ ఇవి ఎక్కువ రోజుల పాటు ఇలానే కొనసాగితే, ఇది కడుపు క్యాన్సర్‌కు కారణం అవుతుందంట. అలాగే నిరంతరం వికారం, వాంతులు లేదా రక్తంతో కలిసిన వాంతులు కూడా కడుపు క్యాన్సర్ ప్రారంభ లక్షణాలేనంట.ఎవరికైతే పొత్తికడుపు పై భాగంలో తరచూ నొప్పి, నాభిపై నొప్పి వస్తుందో వారు కూడా జాగ్రత్త పడాలంట. ఇది కూడా కడుపు క్యాన్సర్ లక్షణమే, అలాగే రక్తహీనత, నిరంతరం అలసట, బలహీనత , కొంచెం తిన్నా కడుపు నిండిన భావన కలగడం, కడుపు ఉబ్బరం, కడుపు బరువుగా అనిపించడం ఇవన్నీ కూడా కడుపు క్యాన్సర్ లక్షణాలేనంట.

# శనగలు ఎలా తింటే లాభం!



శనగలో ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు, ఐరన్, ఫైబర్, ఫోలేట్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. మీరు శనగలను మూడు విధాలుగా తినవచ్చు. వేయించిన, ఉడికించిన లేదా మొలకెత్తిన శనగలు కూగా తింటారు చాలా మంది. ప్రతి రకానికి వేర్వేరు ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. మొలకెత్తిన, వేయించిన, లేదంటే ఉడికించి శనగలు ఎలా తింటే ఎలాంటి లాభాలు కలుగుతాయో తప్పక తెలుసుకోండి. శనగలో ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు, ఐరన్, ఫైబర్, ఫోలేట్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. మీరు శనగలను మూడు విధాలుగా తినవచ్చు. వేయించిన, ఉడికించిన లేదా మొలకెత్తిన శనగలు కూగా తింటారు చాలా మంది. ప్రతి రకానికి వేర్వేరు ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. మొలకెత్తిన శనగలను అథ్లెట్లు లేదా పొలాల్లో పనిచేసేవారు, అలాగే అధిక స్థాయిలో శారీరక శ్రమ చేసేవారు మాత్రమే తినాలని నిపుణులు సూచిస్తున్నారు. మొలకెత్తిన శనగల్లో నీటిలో కరిగే పీచు ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. దాంతో మలబద్ధకం, గ్యాస్ సమస్యలూ తగ్గుతాయి. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో కూడా ఈ ఫైబర్ పనిచేస్తుంది. ఇందులో ఉండే పొటాషియం హైబీపీ సమస్యను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఉడికించిన శనగలు ఒక ఔషధంగా పరిగణిస్తారు. రోజంతా ఆఫీసులో పనిచేసే వారికి ఉడికించిన శనగలు ఔషధం లాంటివి అంటున్నారు నిపుణులు. ఆఫీసు సమయంలో వారు ఒక్కో చిక్కుడు గింజను తింటుండవచ్చు. వీటిలో విటమిన్ బి కాంప్లెక్స్ పుష్కలంగా ఉంటుంది. ఇవి శరీరంలో ప్రోటీన్ లోపాన్నీ తగ్గిస్తాయి. కండరాలను బలోపేతం చేయడం ద్వారా జీర్ణక్రియను సులభతరం చేస్తుంది. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మంచి జ్ఞాపకశక్తిని కాపాడుకోవచ్చు. శరీరంలో సెరోటోనిన్ అనే హార్మోన్ ను పెంచడం ద్వారా మంచి మెదడు పనితీరును నిర్వహించడానికి ఇది పనిచేస్తుంది. ఇది ఒత్తిడిని తగ్గిస్తుంది.

వేయించిన శనగలు తినడం, వాటిపై కొద్దిగా నిమ్మకాయ పిండుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. డయాబెటిస్ లేదా థైరాయిడ్ వంటి వ్యాధులు ఉన్నవారు వేయించిన శెనగలను తినాలి. ఇది డయాబెటిస్‌ను అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. జలుబు, కఫంతో బాధపడేవారు వీటిని తీసుకోవడం ద్వారా సమస్య నుంచి ఉపశమనం కలుగుతుంది. వేయించిన శనగలు తినడం వల్ల మీ బరువు నియంత్రణలో ఉంటుంది. కాబట్టి అధిక బరువు ఉన్నవారు కూడా వాటిని తినవచ్చు. అలాగే, మీరు మలబద్ధకంతో బాధపడుతుంటే, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉడికించిన శనగపప్పు తినకూడదని నిపుణులు చెబుతున్నారు. ఏ రకంగా చూసినా, ఏ రూపంలో తిన్నా శనగల వల్ల ఆరోగ్యానికి మేలే జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇకపోతే, కొన్ని రకాల చర్మ సమస్యలు ఉన్నవారు శనగపప్పుకు దూరంగా ఉండాలని చెబుతున్నారు. ఆయుర్వేదం ప్రకారం, వాత స్వభావం ఉన్నవారు శనగలు తినకుండా ఉండాలి. పొడి చర్మం ఉన్నవారు కూడా శనగలు తినకుండా ఉండాలి.

# పోషకాల సిరులు సన్‌ఫ్లవర్ సీడ్స్

విత్తనాలు తినడం ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. చియా గింజలు, అవిసె గింజలు, గుమ్మడికాయ గింజలు, నల్ల బీన్ గింజలు, జనపనార గింజలు, పొద్దుతిరుగుడు విత్తనాలు వంటి అనేక రకాల విత్తనాలు ఉన్నాయి. అన్ని రకాల విత్తనాలు ఆరోగ్యకరమైన కొవ్వులతో సమృద్ధిగా ఉంటాయి. ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పొద్దుతిరుగుడు విత్తనాల గురించి చెప్పాలంటే, మనం తరచుగా వాటిని సలాడ్లు, పెరుగు, స్మూతీలు లేదా చిరుతిండిగా తీసుకుంటాము. పొద్దుతిరుగుడు విత్తనాల గురించి చెప్పాలంటే, మనం తరచుగా వాటిని సలాడ్లు, పెరుగు, స్మూతీలు లేదా చిరుతిండిగా తీసుకుంటాము. పొద్దుతిరుగుడు విత్తనాలలో ప్రోటీన్, ఫైబర్, విటమిన్ ఙు, మెగ్నీషియం, సెలీనియం, అనేక ఇతర పోషకాలు ఉంటాయి. ఇవి శరీరానికి అనేక విధాలుగా ప్రయోజనకరంగా ఉంటాయి. పొద్దుతిరుగుడు విత్తనాలను మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఈ విత్తనాలు ఎముకలు, కండరాలను బలోపేతం చేయడంలో ప్రయోజనకరమైన ప్రభావాన్ని చూపుతాయి. ఈ గింజల్లో ఉండే విటమిన్ బి6, విటమిన్ ఇ, ఐరన్, సెలీనియం జుట్టు రాలకుండా చూస్తాయి. జుట్టును బలంగా, ఒత్తుగా మారుస్తాయి. సన్‌ఫ్లవర్ సీడ్స్ తింటే ఎక్కువసేపు ఆకలి వేయదు. దీంతో బరువు అదుపులో ఉంటుంది. అందుకే బరువు తగ్గాలని చూసేవారు ఈ గింజలు తినడం మంచిది. ఈ గింజల్ని తినడం వల్ల ఎముకలు బలంగా, ఆరోగ్యంగా ఉంటాయి. వీటిలో ఉండే మెగ్నీషియం, కాపర్, కాల్షియం ఆస్టియోపొరోసిస్ వంటి సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఈ గింజల్లో ఫైబర్, ప్రోటీన్ ఎక్కువగా ఉంటాయి. వీటిని తినడం వల్ల రక్తంలో షుగర్ లెవెల్స్ అదుపులో ఉంటాయి. షుగర్ ఉన్నవారికి ఎంతో మేలు చేస్తాయి. ఇందులో ఉండే పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచుతుంది. హైబీపీ ఉన్నవారు ఈ గింజలు తింటే ఎంతో మేలు కలుగుతుంది. సన్‌ఫ్లవర్ సీడ్స్‌లో మెగ్నీషియం సమృద్ధిగా ఉంటుంది. వీటిని తినడం వల్ల మెదడు పనితీరు బాగుంటుంది. ఆందోళన, ఒత్తిడి తగ్గుతాయి. సన్‌ఫ్లవర్ సీడ్స్‌లో విటమిన్ ఇ ఉంటుంది. ఇది చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ వల్ల నష్టం కలగకుండా కాపాడుతుంది. తద్వారా చర్మం మృదువుగా,



కాంతివంతంగా మారుతుంది. సన్‌ఫ్లవర్ సీడ్స్‌లో విటమిన్ ఎ, మెగ్నీషియం ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. చెడు కొలెస్ట్రాల్‌ను కూడా తగ్గిస్తాయి. ఈ గింజల్లో విటమిన్ ఇ, జింక్, సెలీనియం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. తద్వారా జలుబు, ఫ్లూ వంటి సమస్యలు రాకుండా చూసుకోవచ్చు.

# సక్రమంగా నీరందించక, అక్రమంగా డబ్బు వసూల్

## రాష్ట్ర జలమండలిఅశోక్ రెడ్డి కి వినతి పత్రం

**హైదరాబాద్ :** భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు శుక్రవారం రోజున ఖైరతాబాద్ లో గల రాష్ట్ర జలమండలి ఐఏఎస్ అధికారీ అశోక్ రెడ్డినీ మర్యాద పూర్వకముగా కలువడం జరిగిన దరిమిలా జలమండలి డివిజన్ 18 అధికారుల వ్యవహార శైలిని, వారు ప్రజలకు నీటి బిల్లుల రూపేణా తలపెట్టిన మహా అన్యాయాన్ని పునరాలించించ వలసిన అవసరం ఎంతైనా ఉన్నదని తెలియ పరుస్తూ వినతి పత్రం సమర్పించడం జరిగినది. 2019 వరకు మణికొండ, పుప్పాలగూడ, నెక్నంపూర్ లు గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పుడు గ్రామం పేరున ఏక మొత్తముగా నీటి వినియోగ రుసుము కట్టేవారు. మున్సిపాలిటీగా పరిణితి చెందిన తత్ పర్యంతం జనాభా భారీగా పెరిగినను నీటి సరఫరా మాత్రం పెరగలేదు, పై పెచ్చు నీటి సరఫరా అయినను కాకున్నను గడచిన ఐదు సంవత్సరములుగా నీటి బిల్లు ఇవ్వకుండా, వసూలు చేయకుండా పని చేయని వారిని శిక్షించకుండా అమాయక ప్రజలను ఇబ్బంది పెడుతూ బిల్లులు కట్టమని వత్తిడి చేయడం పద్ధతి కాదని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పెనాల్టీ తీసుకొనీ అక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇచ్చినను నీటి సరఫరాకు మూడు రెట్లు పెనాలిటీ వేయడం అనాగరిక చర్యగా, చట్ట రీత్యా ఇట్టి చర్య ఎంత వరకు సబబని, కాంప్లెక్‌లను వదిలి పెట్టీ సాధారణ వినియోగదారుల వద్ద అభివృద్ధి అని, వాల్యుల పేర అధిక రుసుము వసూలు చేయడం



పరిపాటి కాగా వాటర్ మీటర్ లు చెడిపోతే అసలు పట్టించుకొనే నాధుడే కరువైనారని స్థానికులు వాపోతున్నారు. ఇకపోతే కన్స్యూమర్ అకౌంట్ నంబర్ లేదనే నేపముతో ఇబ్బడి ముబ్బడిగా రుసుమును వసూలు చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. అంతే కాకుండ చట్టంతో పనిలేకుండా కనెక్షన్ ల పేరుతో పద్ధతి లేకుండా తమ ఇష్టానుసారం పైప్ లైన్ కనెక్షన్ ఇస్తూన్న వసూలు రాజాలపై విజిలెన్స్ ఎంక్వైరీ వేయాలని బి.ఆర్.ఎస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటు బుల్డోజర్ వ్యవహార శైలితో ప్రజలపై బారం మోపుతూన్న వారిపై చర్యలు తీసుకోవాలని, అక్రమాలన్నీ సక్రమం చేయాలని కోరుతూ, లేని ఎడల ప్రజల మద్దతుతో ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కార్యక్రమం చేపట్ట గలమని జలమండలి అధికారులను హెచ్చరించడ మైనది. ఇట్టి సందర్భముగా స్థానిక బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, నవీన్ కుమార్, అందే లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, భానుచందర్, సుమనళిని, బిందు, రఫీక్, ఆశ్ఫాక్ అలీ తది తరులు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యతోపాటు క్రీడలపై దృష్టి సారించాలి

**వనపర్తి :** క్రీడలపర్తి వనపర్తికి జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావాలి. సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించిన వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి , స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి .జనవరి, 17 నుండి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న సి.యం. కప్ 2వ ఎడిషన్ క్రీడలకు సంబంధించి శుక్రవారం వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానం లో స్థానిక శాసన సభ్యులు, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ క్రీడా జ్యోతిని వెలిగించి కొత్త బస్టాండ్ మీదుగా జరిగే ర్యాలీ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం లో శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని క్రీడాకారులకు అవసరమైన అన్ని వసతులతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించే విధంగా సహకారం అందిస్తామని అన్నారు. క్రీడాకారులకు స్ఫూర్తినిచ్చేందుకు పులి, జింక గురించి వివరించారు. జింక కంటే పులి తక్కువ వేగంతో పరిగెడుతుందని కానీ జింకను ఎలాగైనా పట్టుకోవాలనే పట్టుదలతో ఉంటుందని అదే జింక ఎక్కడ నేను దొరికిపోతానో అనే భయంతో పరిగెడుతూ పులికి దొరికిపోతుందన్నారు. క్రీడాకారులు సైతం గెలవాలి అనే ఏకైక సంకల్పంతో పోటీ పడాలని ఉద్బోధించారు. విద్యార్థులు ఇతరత్రా వ్యాపకాల మీద కాకుండా చదువు, క్రీడల పై మాత్రమే దృష్టి పెట్టాలని సూచించారు. వనపర్తి జిల్లాకు క్రీడాపర్తి అని సైతం పేరుందని, వనపర్తి జిల్లా నుండి ఎంతో మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించారని గుర్తు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ప్రభుత్వ బాలుర పాఠశాలలో చదువుకొని, ఇదే మైదానంలో ఫుట్ బాల్ ఆడారని ఇదే మైదానంలో ఆడుతున్న క్రీడాకారులు స్ఫూర్తిని పొందాలని సూచించారు. వనపర్తి జిల్లాలో క్రీడల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. సర్వే నెంబర్ 55 లో 25 ఎకరాల స్థలంలో స్పోర్ట్స్ స్కూల్ కు




కేటాయించడం జరిగిందని, హాకీ గ్రీన్ టార్పెట్, స్విమ్మింగ్ పూల్, క్రికెట్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. 2032 లో భారత దేశానికి వచ్చే గోల్డ్ కప్ లలో ఒకటి వనపర్తి జిల్లా నుండి కొట్టి ఉండాలని .. వనపర్తి క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. గ్రామస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వెలికి తీసి అకాడమీలో చేర్పించి నైపుణ్య శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయిలో రాణించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో ఒక క్రీడా మైదానం ఏర్పాటు చేసి అవసరమైన క్రీడా సామాగ్రి అందుబాటులో ఉంచే విధంగా ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు క్రీడలకు రాష్ట్రంలో 840 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలోవనపర్తి మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్ కుమార్ రెడ్డి, డి.ఈ.ఓ అబ్దుల్ ఘని, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి అంజయ్య, డీఎస్పీ వెంకటేశ్వర రావు, తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఎస్.జి.ఎఫ్ సెక్రటరీ పొలమోని కుమార్, పిడి లు, పి. ఈ టి లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# పెండింగ్ జాతర పనులు సకాలంలో పూర్తి చేయాలి

**పెద్దపల్లి :** జిల్లాలో సమ్మక్క సారలమ్మ జాతర పనులు సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రామగుండం గోదావరి నది వద్ద, అంతర్గాం గోలివాడ , సుల్తానాబాద్ లోని నీరుకుల్ల వద్ద నిర్వహించే సమక్క సారలమ్మ జాతర ఏర్పాట్ల పురోగతి పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ మన జిల్లాలో గోదావరిఖని, గోలివాడ, నీరుకుల్ల ప్రాంతాలలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు 5 లక్షల పైగా భక్తులు రానున్న నేపద్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని, జాతర నిర్వహణ కు సంబంధించి జాతర కమిటీకు సంపూర్ణ సహకారం అందించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. జనవరి 28 నుంచి జనవరి 31 వరకు నిర్వహించే సమక్క సారలమ్మ జాతరలో ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా కట్టుదిట్టంగా ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని , అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకునే ఈ జాతరను విజయ వంతంగా నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సన్నద్ధం కావాలని అన్నారు. జాతర సందర్భంగా పారిశుద్యంనిర్వహణకు అధిక ప్రాధాన్యత కల్పించాలని, అవసరమైన మేర అదనపు పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. జాతర నిర్వహించు ప్రదేశంలో తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మించాలని, శుభ్ర పర్చడానికి వ్యక్తులను నియమించాలని, ప్రతి రోజు చెత్తను శుభ్రపర్చు ట, స్నానాలు ఆచరించడానికి షవర్స్, స్త్రీలు



దుస్తులు మార్చుకోవడానికి గదులు ఏర్పాటు చేయాలని, విద్యుత్ దీపాలంకరణ సాయంత్రం నుండి ఉదయం వరకు నిరంతరాయంగా సాగేటట్లుగా చూడాలని అన్నారు. విద్యుత్ అంతరాయం కల్గకుండా జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని, గోదావరి నదీ ప్రాంతంలో సేఫ్టి ఫెన్సింగ్ ఏర్పాటు పనులను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. జాతర జరుగు 4 రోజులు వైద్య సిబ్బంది, 108 వాహనం, మందులు అందుబాటులో ఉంచాలని, ఫైర్ ఇంజన్ 24 గంటల పాటు షిఫ్టు డ్యూటిలలో అందుబాటులో ఉంచాలని తెలిపారు. జాతర జరుగు ప్రాంతాలలో ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ ఇబ్బంది కల్గకుండా చూడాలని, అవసరమైన చోట సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. పుణ్య స్నానాలు చేసే ప్రాఅంతంలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ శాఖల సిబ్బందికి భోజన ఏర్పాటు, జాతర ప్రారంభానికి వి.ఐ.పి.ల ఆహ్వానం, పబ్లిక్ అడ్రెస్ సిస్టం ఏర్పాటు, నిర్వహణ వంటి పనులు నిర్వహించాలని, గోదావరిఖని ఆర్టిసి డిపో మేనేజరు జాతర జరుగు ప్రాంతాలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సులు భక్తులకు ఇబ్బందు లు ఏర్పడకుండా నడపాలని, జాతర పరిసరాల ప్రాంతాలలో ని అనుమతి లేని మద్యం దుకాణాలు మూసివేయాలని, పోలీసు భద్రత ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ తెలిపారు. జాతర నిర్వహణ అంశంలో ప్రతి ఒక్క శాఖ తమకు కేటాయించిన విధులను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారుఈ కార్యక్రమం లో రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ , కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రకాష్, కలెక్టరేట్ సి విభాగం పర్యవేక్షకులు కుమార స్వామి, జిల్లా అధికారులు, దేవాదాయ శాఖ అధికారులు, సింగరేణి, ఎన్టిపిసి అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలుగా లావణ్య

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గా సికింద్రాబాద్ జిల్లా, యూనివర్సిటీ పీజీ కాలేజీ విద్యార్థి లావణ్య ఎన్నికయ్యారు. ఈనెల 3,4,5 తేదీల లో శంషాబాద్ లో జరిగిన 44వ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర అధ్యక్షులు డా రావల కృష్ణ సార్ నూతన కార్యవ ర్గంను ప్రకటించగా సికింద్రాబాద్ నుండి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా లావణ్య,శ్రీరామ్, గౌతమ్ రెడ్డి దక్కింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యవర్గం లో అవకాశం కల్పించిన రాష్ట్ర శాఖకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో, విద్యార్థులలో జాతీయవాదం పెంచడానికి కృషి చేస్తామని తెలిపారు. నాయకులు యువజన నాయకులు పలువురు అభినందనలు తెలిపారు...

### డ్రగ్స్ కేసులో నవదీప్‌కు భారీ ఊరట

**హైదరాబాద్ :** డ్రగ్స్ కేసులో నటుడు నవదీప్‌కు పెద్ద ఊరట లభించింది. ఆయనపై నమోదైన డ్రగ్స్ కేసును తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. గుడిమల్కాపూర్‌లో నమోదైన ఈ కేసులో నవదీప్ వద్ద ఎలాంటి మత్తుపదార్థాలు దొరకలేదన్న అంశాన్ని కోర్టు స్పష్టంగా గుర్తించింది. నవదీప్ తరఫున వాదనలు వినిపించిన అడ్వొకేట్ వెంకట సిద్ధార్థ్ మాట్లాడుతూ.. ఈ కేసులో నవదీప్ పేరు కేవలం ఎఫ్ఐఆర్ లో మాత్రమే ఉందని, సంఘటన జరిగిన ప్రదేశంలో ఆయన వద్ద డ్రగ్స్ ఏవీ లభించలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. స్పాట్‌లో స్వాధీనం చేసుకున్న వస్తువుల్లో నవదీప్‌కు సంబంధించిన ఆధారాలు లేవని వివరించారు. ఈ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు.. సరైన ఆధారాలు లేకుండా కేసు కొనసాగించడం సరికాదని పేర్కొంది. నవదీప్ వద్ద డ్రగ్స్ లభించనందున, ఆయనపై నమోదైన కేసును కొట్టివేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ తీర్పుతో నవదీప్‌కు చట్టపరంగా పెద్ద ఊరట లభించినట్టయింది.

### తండ్రులను కోల్పోయిన బీటెక్ విద్యార్థులకు కేసీఆర్ ఆర్థిక భరోసా

**హైదరాబాద్ :** మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ప్రమాదవశాత్తూ తండ్రులను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఇద్దరూ ఇంజినీరింగ్ విద్యార్థులకు కాలేజ్ పూర్తి ఫీజు చెల్లించడంతో పాటు ఇతర అవసరాలకు గాను ఆర్థికసాయం అందించి భరోసా కల్పించారు. వారికి ధైర్యం చెప్పి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గంలోని కెసిఆర్ దత్తత గ్రామమైన ఎర్రవెల్లి గ్రామానికి చెందిన రైతు చిన్రాజు సత్తయ్య ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మరణించాడు. ఆయన కుమారుడు నవీన్ స్థానిక ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన మరో రైతు పెద్దోళ్ల సాయిలు ప్రమాదవశాత్తూ కొన్ని సంవత్సరాల క్రితం మరణించాడు. ఆయన కుమారుడు అజయ్ కూడా బీటెక్ చదువుతున్నాడు. అయితే తండ్రులు లేకపోవడంతో ఫీజులు చెల్లించడానికి ఇబ్బందిపడుతున్న విషయాన్ని ఆ గ్రామానికి చెందిన కొందరు పార్టీ నాయకులు కేసీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన వారిని చేరదీయడంతో పాటు వారి ఇంజనీరింగ్ చదువు పూర్తికాలపు ఫీజులకు సరిపోయే చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కష్టపడి మంచిగా చదువుకొని మంచి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కేసీఆర్ వారిని దీవించారు. ఏదైనా డబ్బుల సమస్య వస్తే తన దృష్టికి తీసుకురండి అని భరోసా ఇచ్చారు. విద్యుత్ ప్రమాదంలో మరణించిన చిన్రాజు సత్తయ్య కుటుంబానికి సంబంధిత విద్యుత్ శాఖ నుంచి చట్టపరంగా అందే ఆర్థిక తదితర సాయం గురించి పర్యవేక్షించి వారికి న్యాయం జరిగేలా చూడాలని తన వ్యక్తిగత కార్యదర్శి నాగేందర్ రెడ్డిని కేసీఆర్ ఆదేశించారు. కుటుంబ పెద్దను కోల్పోయిన తమను గుర్తించి, ఆదరించి, ఆర్థికంగా ఆదుకుని, తమ పిల్లల చదువు, భవిష్యత్తు గురించి ఆలోచన చేసిన కేసీఆర్ గారికి పిల్లల తల్లులు చేతులెత్తి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. తమ చదువుకోసం కేసీఆర్ ఆర్థిక సాయం చేయడం పట్ల విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు

### కరీంనగర్‌కు ఆయుష్ ఆస్పత్రి

**కరీంనగర్ :** కరీంనగర్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేసిన నిరంతర కృషి ఫలితంగా కరీంనగర్‌కు 50 పడకల ఆయుష్ ఆసుపత్రి మంజూరైంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తాజాగా పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఉత్తర తెలంగాణలోనే ఒక ప్రధాన వైద్య హబ్‌గా కరీంనగర్ ఎదిగేందుకు ఈ నిర్ణయం దోహదపడనుంది. ఈ ఆసుపత్రి నిర్మాణానికి మొత్తం రూ. 15 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేయగా, అందులో మొదటి విడతగా కేంద్ర ప్రభుత్వం రూ. 7.5 కోట్ల నిధులను తక్షణమే విడుదల చేసింది. అల్లోపతి మందుల వల్ల కలిగే దుష్ప్రభావాల భయంతో ఆయుర్వేదం, హోమియోపతి వైపు మొగ్గు చూపుతున్న ప్రజల ఆకాంక్షను గుర్తించిన బండి సంజయ్ , కేంద్ర ఆయుష్ మంత్రి ప్రతాప్ రావు జాదవ్ ని కలిసి ఈ ఆసుపత్రి అవశ్యకతను వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్రం, ఈ ప్రాంత అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మంజూరైన 50 పడకల ఆసుపత్రిలో వైవిధ్యభరితమైన విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. కాయచికిత్సకు 20, పంచకర్మకు 10, సర్జికల్ సేవలకు 10, అలాగే ఈఎన్టీ, ప్రసూతి, స్త్రీ ఆరోగ్య సేవలకు మరో 5 పడకలను ప్రత్యేకంగా కేటాయించారు. ఇక్కడ కేవలం చికిత్సలే కాకుండా కాయకల్ప చికిత్స, యోగా, ధ్యానం, జీవనశైలి మార్పులపై కౌన్సిలింగ్ వంటి సేవలు కూడా అందుబాటులోకి రానున్నాయి. తద్వారా దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్, ఆస్తమా, మైగ్రేన్ వంటి సమస్యలకు సహజమైన పరిష్కారాలు లభించనున్నాయి. ఆసుపత్రి ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయించడం, వైద్యులు , ఇతర సిబ్బందిని నియమించే బాధ్యతలను కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించింది. ఈ మేరకు కేంద్రం నుంచి అధికారిక లేఖ అందడంతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఇప్పటికే ఆయుష్ అధికారులతో చర్చలు ప్రారంభించారు. త్వరలోనే తగిన స్థలాన్ని ఎంపిక చేసి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే కరీంనగర్ జిల్లా ప్రజలతో పాటు చుట్టుపక్కల ఉన్న ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజలకు ఉపశమనం లభిస్తుంది. మెడికల్ సూపరింటెండెంట్ నేతృత్వంలో సుమారు 21 మంది సెక్యూరిటీ సిబ్బందితో సహా భారీ సంఖ్యలో నర్సింగ్ స్టాఫ్, ల్యాబ్ టెక్నీషియన్లు, యోగా ట్రైనర్లు ఇక్కడ సేవలందించనున్నారు. మోదీ ప్రభుత్వం భారతీయ సాంప్రదాయ వైద్యానికి ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా కరీంనగర్‌కు ఈ ప్రాజెక్టు దక్కడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది

### రాజాసాబ్' టిక్కెట్ ధరల పెంపు.. తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం

**హైదరాబాద్ :** సినిమా టిక్కెట్ ధరల పెంపుపై తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభాస్ నటించిన 'ది రాజాసాబ్' సినిమా టిక్కెట్ ధరలను పెంచుకునేందుకు అధికారులు అనుమతించడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. ధరల పెంపునకు అవకాశం కల్పిస్తూ తెలివిగా మెమోలు ఎందుకు ఇస్తున్నారని ప్రభుత్వం తరఫు న్యాయవాదిని హైకోర్టు ప్రశ్నించింది. సినిమా టిక్కెట్ ధరలను పెంచబోమని సినిమాటోగ్రఫీ మంత్రి స్వయంగా ప్రకటన చేశారని గుర్తు చేసింది. అయినప్పటికీ ధరలు పెంచుకోవచ్చని మెమోలు ఎందుకు ఇస్తున్నారని అసహనం వ్యక్తం చేసింది. ఎన్నిసార్లు చెప్పినా మీ ఆలోచన ఎందుకు మారడం లేదని హైకోర్టు నిలదీసింది. మెమో ఇచ్చే అధికారికి నిబంధనలు తెలియవా అని వ్యాఖ్యానించింది.'ది రాజాసాబ్' సినిమా టిక్కెట్ ధరలు పెంచుకునేందుకు అధికారులు గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం నుంచి ఈ నెల 11 వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.105, మల్టీప్లెక్స్‌లలో రూ.132 పెంపునకు అనుమతి ఇచ్చింది. 12 నుంచి 18వ తేదీ వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.62, మల్టీప్లెక్స్‌లలో రూ.89 పెంపునకు అనుమతి ఇచ్చింది. టిక్కెట్ ద్వారా వచ్చే లాభాల్లో 20 శాతం ఫిలిం ఫెడరేషన్‌కు ఇవ్వాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.'రాజాసాబ్' టిక్కెట్ ధరల పెంపును సవాల్ చేస్తూ హైకోర్టులో విజయ్ గోపాల్ అనే న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా టిక్కెట్ల ధరల పెంపునకు అనుమతిస్తున్నారని న్యాయవాది విజయ్ గోపాల్ పిటిషన్‌లో పేర్కొన్నారు. హోంశాఖ కార్యదర్శికి మెమో జారీ చేసే అధికారం లేదని ఆయన కోర్టుకు తెలిపారు. జిల్లాస్థాయి కలెక్టర్లు, హైదరాబాద్‌లో సీపీ మాత్రమే టిక్కెట్ల ధరల పెంపు, బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వాల్సి ఉంటుందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

ధర్మఘంట

## బిజినెస్

## నెలాఖరులో పబ్లిక్ ఇష్యూకు యాక్సియమ్ గ్యాస్ ఇంజనీరింగ్




**హైదరాబాద్ :** ప్రైమ్ ఫ్యూల్ బ్రాండ్‌తో ఆటో ఎల్‌పీజీ గ్యాస్‌ను విక్రయించే యాక్సియమ్ గ్యాస్ ఇంజనీరింగ్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు రానున్నట్టు తెలిపింది. జనవరి చివరి వారంలో ఇష్యూకు వచ్చే అవకాశం ఉందని ఆ సంస్థ ప్రమోటర్ ఎంఎస్ బనాని వెల్లడించారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బనాని మాట్లాడుతూ.. ఈ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.40-45 కోట్ల నిధులు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందుకోసం ఒక్కోటి రూ.5ముఖ విలువ కలిగిన 94,92,000 వరకు కొత్త ఈక్విటీ షేర్ల జారీ చేయనున్నామన్నారు. ప్రైమ్ ఫ్యూయల్ బ్రాండ్ కింద ప్రస్తుతం తెలంగాణలో 11, మహారాష్ట్రలో 8, కర్నాటకలో 2 చొప్పున ఆటో ఎల్‌పీజీ డిస్పెన్సింగ్ స్టేషన్లను కలిగి ఉన్నామని చెప్పారు. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న తమ సంస్థ ఐపిఒ నిధులలో రూ.27 కోట్లను మూలధన వ్యయ అవసరాలు, విస్తరణ కోసం, రూ.7 కోట్లను కంపెనీ తీసుకున్న కొన్ని బకాయి రుణాలను పాక్షకంగా ముందస్తు చెల్లింపు లేదా తిరిగి చెల్లించడం కోసం ఉపయోగించాలని భావిస్తోందన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరం 2024-25లో తమ సంస్థ రూ.89.83 కోట్ల రెవెన్యూ ఆర్జించడం ద్వారా రూ.7.74 కోట్ల లాభాలను సాధించిందన్నారు. ఇంతక్రితం ఏడాది రూ.74.53 కోట్ల రెవెన్యూ.. రూ.5.74 కోట్ల లాభాలను నమోదు చేసిందన్నారు.

## భారత్ కోకింగ్ కోల్ ఐపీఓ. నిమిషాల్లోనే సబ్‌స్క్రిప్షన్ పూర్తి!




**దిల్లీ:** ప్రభుత్వరంగ దిగ్గజం కోల్ ఇండియా అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు అనూహ్య స్పందన లభించింది. శుక్రవారం సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైన కొన్ని నిమిషాల్లోనే పూర్తి సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం.. మధ్యాహ్నం 11.15 గంటల సమయానికి 34,69,46,500 (34 కోట్ల) షేర్లకు గానూ 84,15,46,800 (84 కోట్ల) షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. అంటే 2.43 రెట్లు స్పందన లభించింది.కేటగిరీ వారీగా చూసినప్పుడు.. నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల కోటా 3.79 రెట్లు సబ్‌స్క్రిప్షన్ అయ్యింది. రిటైల్ ఇన్వెస్టర్ల పోర్షన్ 3.35 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషన్ బయ్యర్ల కోటా 1 శాతం సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.273 కోట్లు సమీకరించినట్లు భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ గురువారం వెల్లడించింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా మొత్తం రూ.1,071 కోట్లు సమీకరించనుంది. జనవరి 13న సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. ధరల శ్రేణిని రూ.21-23గా కంపెనీ నిర్ణయించింది.విమాన తయారీలోకి అదానీ గ్రూప్!1972లో భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటైంది. జారియా (ఝూర్ఖండ్), రాణిగంజ్ (పశ్చిమ బెంగాల్)లోని కోల్ మైన్స్ నుంచి కోకింగ్ కోల్‌ను సరఫరా చేస్తోంది. కోల్ ఇండియా వాల్యూ అన్‌లాక్‌లో భాగంగా అనుబంధ సంస్థలో వాటాలను ప్రభుత్వం విక్రయం చేపట్టింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా జరుగుతోంది. కోల్ ఇండియా 46.57 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయిస్తోంది. జనవరి 16న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో కంపెనీ షేర్లు లిస్ట్ కానున్నాయి.

# దలాల్ స్ట్రీట్‌కు యూఎస్ టారిఫ్‌ల దడ



**ముంబయి :** దేశీయ స్టాక్ మార్కెట్‌లు వరుసగా నాలుగో రోజూ భారీ నష్టాలను చవి చూశాయి. భారత్, చైనా వంటి దేశాలపై 500 శాతం సుంకాలు విధించేందుకు ఉద్దేశించిన బిల్లుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆమోదం తెలిపారనే రిపోర్టులు దలాల్ స్ట్రీట్‌ను దారుణంగా పడిపోయేలా చేశాయి. మరోవైపు వెనిజులాపై యూఎస్ ఉగ్రదాడి మరిన్ని భౌగోళిక ఆందోళనలకు దారి తీయొచ్చనే మదుపర్ల అంచనాలు ముంచాయి. దీనికితోడు విదేశీ మదుపర్ల అమ్మకాలు మరింత ఒత్తిడిని పెంచాయి. ఈ పరిణామాల మధ్య ఇటీవల ఎప్పుడూ లేని విధంగా గురువారం భారత మార్కెట్లు కుప్పకూలాయి. ఒక్క పూటలో మదుపర్ల సంపద రూ.8 లక్షల కోట్లు పైగా హరించుకుపోయింది. బీఎస్ఈ సెన్సెక్స్ ఉదయం 84,778 నష్టాల్లో ప్రారంభం కాగా.. ఏ దశలోనూ కోలుకోకపోగా రోజంతా అమ్మకాల ఒత్తిడిని చవి చూసింది. ఇంట్రాడేలో 84,110 కనిష్టానికి పడిపోయింది. తుదకు 780.18 పాయింట్లు లేదా 0.92 శాతం పతనమై 84,180.96కు దిగజారింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 263.9 పాయింట్లు లేదా 1.01 శాతం నష్టంతో 25,876.85కు పరిమితమయ్యింది.2025 డిసెంబర్ 8 తర్వాత మార్కెట్లు అత్యధికంగా పడిపోవడం ఇదే తొలిసారి. గడిచిన నాలుగు సెషన్లలో సెన్సెక్స్ మొత్తంగా 1600 పాయింట్లు, నిఫ్టీ 470 పాయింట్ల చొప్పున క్షీణించాయి. నిఫ్టీలో మిడ్ క్యాప్ 1.96 శాతం, స్మాల్ క్యాప్ 1.99 శాతం చొప్పున పతనమయ్యాయి. అన్ని రంగాల సూచీలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. లోహ సూచీ అత్యధికంగా 3 శాతం కోల్పోగా.. ఆయిల్ అండ్ గ్యాస్ 2.8 శాతం, పీఎస్‌యూ బ్యాంకింగ్ 2 శాతం, ఐటీ 1.9 శాతం చొప్పున కుదేలాయ్యాయి. ఒక్క సెషన్‌లోనే మదుపర్ల సంపద రూ.8.1 లక్షల కోట్లు తుడుచుకు పెట్టుకుపోవడంతో. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.480 లక్షల కోట్ల నుంచి రూ.472 లక్షల కోట్లకు పడిపోయింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటెర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, బీఈఎల్ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ నేల చూపులు చూశాయి. హిందాల్కో ఇండస్ట్రీస్ 3.78 శాతం, జియో ఫైనాన్సియల్ 3.57 శాతం, ఓఎన్‌జీసీ 3.29 శాతం చొప్పున అత్యధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. బీఎస్ఈలో 4,367 స్టాక్స్ ట్రేడింగ్ కాగా.. 1,039 సూచీలు రాణించగా.. 3,158 స్టాక్స్ పతనమయ్యాయి. మరో 170 స్టాక్స్ యథాతథంగా నమోదయ్యాయి. ప్రతికూలాంశాలు.. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలపై 500 శాతం వరకు అదనపు సుంకాలు విధించడానికి వీలుగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 'శాంక్షనింగ్ ఆఫ్ రష్యా యాక్ట్ 2025' అనే బిల్లుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇది భారత ఎగుమతిదారులు, ఇన్వెస్టర్లలో తీవ్ర ఆందోళన కలిగించింది. వెనిజులా అధ్యక్షుడు మదురోను అమెరికా దుర్మార్గంగా అరెస్ట్ చేయడం అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలను పెంచింది. ఈ వ్యవహారంపై వెనిజులాకు రష్యా, చైనా సహా పలు లాటిన్ అమెరికా దేశాలు మద్దతును ఇవ్వడంతో పరిస్థితులు మరింత తీవ్రతరం కావొచ్చనే ఆందోళనలు ఇన్వెస్టర్లలో పెరిగాయి.దేశీయంగా దిగ్గజ సూచీలు రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ షేర్లు ఈ వారంలో 4 శాతం వరకు నష్టపోయాయి. ఇండెక్స్‌లో వీటి వాటా ఎక్కువ కావడంతో, ఈ షేర్ల పతనం మొత్తం మార్కెట్‌లను ఒత్తిడికి గురి చేశాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు భారత స్టాక్ మార్కెట్ల నుండి తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. జనవరి నెలలో ఇప్పటివరకు సుమారు 694 మిలియన్ డాలర్ల విలువైన షేర్లను విక్రయించారు. భారత జిడిపి 2025-26లో 7.4 శాతం పెరగొచ్చనే అంచనాలు వేసినప్పటికీ.. ద్వితీయార్థంలో ఇది 6.9 శాతానికి పడిపోవచ్చనే రేటింగ్ ఎజెన్సీ అంచనాలు మార్కెట్లపై ప్రభావం చూపాయి. అంతర్జాతీయంగా జపాన్, చైనా, అమెరికా మార్కెట్లు బలహీనంగా ట్రేడింగ్ కావడం భారత మార్కెట్లను ఒత్తిడికి గురి చేశాయి.

## 'నెస్లే' ఉత్పత్తులు వెనక్కి

**శిశు పౌష్టికాహార ప్రోడక్ట్స్‌లో హానికర పదార్థాలు ఉండొచ్చన్న అనుమానంతోనే..**

**తన అధికారిక వెబ్‌సైట్‌లో వెల్లడించిన కంపెనీ**




జెనీవా : ప్రముఖ ఆహార-పానీయాల సంస్థ నెస్లే కీలక నిర్ణయం తీసుకుంది. తమ కంపెనీకి చెందిన కొన్ని శిశుపౌష్టికాహార ఉత్పత్తుల్లో హానికర పదార్థాలు ఉండొచ్చని గుర్తించిన నేపథ్యంలో వాటిని ప్రపంచ మార్కెట్ నుంచి వెనక్కి తీసుకుంది. మొత్తం 37 దేశాల నుంచి వీటిని వెనక్కి రప్పిస్తున్నది. అయితే ఈ జాబితాలో భారత్ పేరు లేదు. ఈ మేరకు నెస్లే ఒక ప్రకటన చేసింది. ఈ ప్రకటన ప్రకారం.. ఎస్ఎంఏ ఇన్ఫాంట్ ఫార్ములా, ఫాలో-ఆన్ ఫార్ములాలోని కొన్ని బ్యాచ్‌లు శిశువులకు సురక్షితం కావు. ఈ ఉత్పత్తుల్లో సెర్యూలైడ్ అనే హానికరమైన టాక్సిన్ ఉండే అవకాశమున్న దని గుర్తించడంతో ఈ రీకాల్‌ను ప్రారంభించామని వివరించింది. ఈ సమాచారాన్ని నెస్లే తన అధికారిక వెబ్‌సైట్‌లో వెల్లడించింది. సెర్యూలైడ్‌కు గురైతే వికారం, వాంతులు వంటి ఆరోగ్య సమస్యలు కలగవచ్చని కొన్ని నివేదికలు చెప్తున్నాయి. అయితే ఇప్పటి వరకు ఈ ఉత్పత్తులు వాడిన వినియోగదారుల్లో ఎలాంటి ప్రతికూల ప్రభావాలూ నమోదు కాలేదని నెస్లే స్పష్టం చేసింది. ఇది కేవలం ముందస్తు జాగ్రత్త చర్యగా తీసుకున్న నిర్ణయమని వివరించింది. కాగా నెస్లే తాజా రీకాల్‌తో దాదాపు 10 ఫ్యాక్టరీల్లో తయారైన 800కు పైగా ఉత్పత్తులను ప్రభావితం చేస్తోంది. యూరప్, ఆసియా, అమెరికాలలో ఉన్న 37 దేశాలలో ఈ ఉత్పత్తులను మార్కెట్ల నుంచి ఉపసంహరించా లని నెస్లే ఆదేశించింది. ఆసియాలో ప్రస్తుతం హాంకాంగ్ మాత్రమే ఈ జాబితాలో ఉన్నది. భారత్ మాత్రం ఈ జాబితాలో లేదు. అయితే దర్యాప్తు కొనసాగుతున్నదనీ, ఈ జాబితాను నవీకరిస్తామని కంపెనీ

# ప్రపంచకప్‌కు ఆఫ్ఘనిస్తాన్ జట్టు ప్రకటన

2026 అండర్-19 ప్రపంచకప్‌కు ఆఫ్ఘనిస్తాన్ జట్టును ఇవాళ (జనవరి 9) ప్రకటించారు. ఈ జట్టుకు సారథిగా మహబూబ్ ఖాన్ నియమితుడయ్యాడు. స్టార్ బ్యాటర్లు ఉజైరుల్లా నియాజై, ఖాలిద్ అహ్మద్‌జై, ఉస్మాన్ సదత్, అజీజ్ మియా ఖిల్ ఈ జట్టులో చోటు దక్కించుకున్నారు. నియాజై ఇటీవలి బంగ్లాదేశ్ పర్యటనలో, ఆసియా కప్ 2025లో సత్తా చాటాడు. బౌలింగ్ విభాగంలో నూరిస్తానీ ఓర్మాజీ (ప్రధాన పేస్ బౌలర్), స్పిన్ విభాగంలో జియాతుల్లా షాహీన్, హఫీజ్‌ఉల్లా జద్రాన్, వహీద్‌ఉల్లా జద్రాన్ తమ స్థానాలు నిలబెట్టుకున్నారు. అండర్-19 విభాగంలోనూ ఆఫ్ఘనిస్తాన్‌కు స్పిన్ బౌలింగే ప్రధాన ఆయుధం. ఈ జట్టులో ఖతీర్ స్టానిక్‌జై, అబ్దుల్ అజీజ్, సలామ్ ఖాన్, రోహుల్లా అరబ్, హఫీజ్ జద్రాన్ పరిశీలించదగ్గ ఆటగాళ్లు. రిజర్వ్ ప్లేయర్లుగా అఖిల్ ఖాన్, ఫహీమ్ ఖాసిమీ, ఇజాత్ నూర్ ఎంపికయ్యారు. ఈ మెగా టోర్నీ జింబాబ్వే, నమీబియా వేదికలుగా జనవరి 15 నుంచి ఫిబ్రవరి 6 వరకు జరుగనుంది. మొదటి మ్యాచ్‌లో ఇండియా, యూఎస్ఏ తలపడనున్నాయి. ఈ టోర్నీలో ఆస్ట్రేలియా డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనుంది. ఈ టోర్నీలో ఆఫ్ఘనిస్తాన్ ప్రయాణం జనవరి 16న సౌతాఫ్రికాతో మ్యాచ్‌తో మొదలవుతుంది. అనంతరం 18న వెస్టిండీస్‌తో, 21న టాంజానియాతో తలపడనుంది. కాగా, ఆఫ్ఘనిస్తాన్ జట్టు ఆసియా క్వాలిఫయర్‌లో నేపాల్‌పై నెట్ రన్ రేట్ ఆధారంగా ముందంజ వేసి వరల్డ్ కప్‌కు అర్హత సాధించింది.




**అండర్19 ప్రపంచకప్‌కు ఆఫ్ఘనిస్తాన్ పూర్తి జట్టు..** మహబూబ్ ఖాన్ (సి), ఖాలిద్ అహ్మద్‌జై, ఉస్మాన్ సదత్, ఫైసల్ ఖాన్, ఉజైరుల్లా నియాజై, అజీజ్ మియా ఖిల్, నజీఫ్ అమిరి, ఖతీర్ స్టానిక్‌జై, నూరిస్తానీ, అబ్దుల్ అజీజ్, సలామ్ ఖాన్, వహీద్ జద్రాన్, జియాతుల్లా షాహీన్, రోహుల్లా అరబ్, హఫీజ్ జద్రాన్

## శ్రేయాస్ అయ్యర్ మెడికల్ ఫిట్.. కివీస్‌తో వన్డే సిరీస్‌కు లైన్ క్లియర్ !



**ముంబై:** టీమిండియా బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ ఫుల్‌గా కోలుకున్నట్లు సమాచారం వచ్చేసింది. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో గాయపడ్డ అయ్యర్.. తాజాగా జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో రెండు వన్డేలు ఆడాడు. అతని ఫిట్‌నెస్ ఆధారంగా న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో ఆడేది లేనిది తేల్చాలని నిర్ణయించారు. అయితే బెంగుళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కీలకమైన అప్‌డేట్ ఇచ్చింది. శ్రేయాస్ అయ్యర్ అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడేందుకు మెడికల్‌గా ఫిట్ ఉన్నట్లు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పేర్కొన్నట్లు ఓ మీడియాలో కథనం వచ్చింది. దీంతో అతను కివీస్‌తో జరిగే వన్డే సిరీస్‌లో ఆడేందుకు లైన్ క్లియర్ అయ్యింది. ఆసీస్‌తో జరిగిన మ్యాచ్‌లో క్యాచ్ అందుకోబోయి అయ్యర్ కిందపడ్డాడు. ఆ సమయంలో అతని మోచేయి కడుపులో వత్తేసింది. దీంతో ఉదరంలోని స్ప్లీన్ దెబ్బతిని రక్తస్రావం జరిగింది. ఆస్ట్రేలియాలోనే అతనికి సర్జరీ జరిగింది. అయితే చికిత్స నుంచి కోలుకున్న అతను విజయ్ హజారే ట్రోఫీలో ఆడాడు.

## స్పోర్ట్స్

## ఫైనల్ బెర్తుకు చేరువైన ఆస్ట్రేలియా.. ఆరో ర్యాంక్‌లో టీమిండియా..!




ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ర్యాంకింగ్స్‌లో సమీకరణాలు మారుతున్నాయి. స్వదేశంలో ముగిసిన యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్‌ను 4-1తో చిత్తు చేసిన ఆస్ట్రేలియా అగ్రస్థానం నిలబెట్టుకుంది. తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన ఆసీస్ 87.50 విజయాల శాతంతో ఫైనల్ బెర్తుకు మరింత చేరువైంది. సొంతగడ్డపై దక్షిణాఫ్రికా చేతిలో వైట్‌వాష్‌కు గురైన భారత జట్టు ఆరో ర్యాంక్‌లోనే కొనసాగుతోంది. యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా జోరుతో డబ్ల్యూటీసీలో నంబర్ 1 ర్యాంక్ కాపాడుకుంది. ఇటీవల వెస్టిండీస్‌ను వైట్‌వాష్ చేసిన న్యూజిలాండ్ 77.78 విజయావకాశాలతో రెండో ర్యాంక్ కైవసం చేసుకుంది. గత సీజన్ విజేత దక్షిణాఫ్రికా మూడో స్థానంలో నిలవగా.. శ్రీలంక 66.67 శాతం విజయాలతో నాలుగో ర్యాంక్ సాధించింది. పాకిస్థాన్ ఐదో ర్యాంక్‌లో ఉండగా.. టీమిండియా ఆరో ర్యాంక్‌లోనే ఉండిపోయింది. డబ్ల్యూటీసీలో వరుసగా రెండుసార్లు ఫైనల్ ఆడిన భారత్ హ్యాట్రిక్ ఆశలు ఆవిరవుతున్నాయి. ఈసారి ఎలాగైనా టెస్టు గదను పట్టేయాలనుకున్న టీమిండియా సొంతగడ్డపై దక్షిణాఫ్రికా చేతిలో క్లీన్‌స్వీప్ గురవ్వడంతో మూడు నుంచి ఐదో స్థానంలో నిలిచింది. అయితే.. రెండో టెస్టులో శుక్రవారం వెస్టిండీస్‌ను 9 వికెట్లతో చిత్తు చేసిన న్యూజిలాండ్ మూడో ర్యాంక్‌కు ఎగబాకగా.. గిల్ సేన ర్యాంకు ఆరుకు దిగజారింది. కొత్త ఏడాదిలో టీమిండయా ఐదు టెస్టులు మాత్రమే ఆడనుంది. జూన్‌లో అఫ్గనిస్థాన్‌తో ఏకైక టెస్టు, ఆపై ఆగస్టులో శ్రీలంక పర్యటనలో రెండు, అక్టోబర్‌లో న్యూజిలాండ్ గడ్డపై రెండు మ్యాచులు ఉన్నాయంతే. ఈ ఐదు మ్యాచుల్లో గెలిచినా.. టాప్ -3లోని జట్ల ఫలితాలపై శుభ్‌మన్ గిల్ సేన ఆధారపడాల్సి ఉంటుంది.

# ఖీయాక్షన్ క్వీన్‌లా సమంత.. సరికొత్త వెర్షన్‌లా మా ఇంటి బంగారం.. టీజర్ అదిరిందిగా..

చాలా కాలం తర్వాత తిరిగి సినిమాల్లో యాక్టివ్ అయ్యింది సమంత. రెండేళ్ల తర్వాత శుభం సినిమాతో అడియన్స్ ముందుకు వచ్చింది. ఇప్పుడు మా ఇంటి బంగారం సినిమాతో మరోసారి థియేటర్లలో సందడి చేసేందుకు రెడీ అయ్యింది. నందినీ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు సమంత భర్త రాజ్ నిడిమోరు కథ అందించారు. ఈ చిత్రాన్ని సామ్ తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. ఇది ఆమె నిర్మాణ సంస్థ నుంచి వస్తున్న రెండో సినిమా కావడం విశేషం. ఇటీవల విడుదలైన పోస్టర్ ఆకట్టుకుంది. తాజాగా ఈ మూవీ టీజర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఇందులో సామ్ ఫుల్ యాక్షన్ మోడ్ లో కనిపిస్తున్నారు. చూస్తా ఉండండి.. మా ఇంటి బంగారం మీ అందరిలో కలిసిపోతుంది.. ప్రారంభమైన ఈ టీజర్ ఆసక్తికరంగా సాగింది. చాలా కాలం తర్వాత పూర్తి స్థాయి సినిమాతో అడియన్స్ ముందుకు వస్తుంది. ఇందులో సామ్ లుక్స్, యాక్టింగ్ మరోసారి ఆకట్టుకున్నాయి. మా ఇంటి బంగారం సినిమాలో సమంత యాక్షన్ సీక్వెన్సు ఉన్నాయని టీజర్ చూస్తుంటే తెలుస్తోంది. బస్సులో సామ్ ఫైట్ మాత్రం నెక్స్ లెవల్ అనిపిస్తుంది. మొత్తానికి చిన్న టీజర్ తోనే సినిమా ఎలా ఉండబోతుందో చెప్పేశారు మేకర్స్. బేబీ సినిమా తర్వాత సమంత, నందినీరెడ్డి కాంబోలో వస్తున్న రెండో సినిమా ఇది. నిజానికి వీరిద్దరు చాలా క్లోజ్ ఫ్రెండ్స్. ఇక చాలా కాలంగా సక్సెస్ కోసం వెయిట్ చేస్తున్న నందినీరెడ్డి.. ఇప్పుడు మా ఇంటి బంగారం సినిమాతో హిట్టు కొట్టడం ఖాయమని తెలుస్తోంది. మొత్తానికి సమంత కంబ్యాక్ ఒక రేంజ్ లో ఉండేలా ఉందని ఈ టీజర్ చూస్తేనే అర్థమవుతుంది.






# ఆస్కార్ రేసులో 4 భారతీయ చిత్రాలు 'కాంతార', 'తన్వి ది గ్రేట్' సహా బరిలో ఉన్న సినిమాలు ఇవే!

సినీ ఇండస్ట్రీలో ప్రతిష్టాత్మకంగా భావించే 98వ ఆస్కార్ అవార్డుల సందడి మొదలైంది. అంతర్జాతీయ వేదికపై అప్పుడే మొదలైంది. తాజాగా అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ విడుదల చేసిన 'రిమైండర్ లిస్ట్'లో భారత్ నుండి ఏకంగా నాలుగు చిత్రాలు చోటు దక్కించుకుని సంచలనం సృష్టించాయి. మొత్తం 201 చిత్రాలతో కూడిన ఈ జాబితాలో నిలిచిన సినిమాలు 'ఉత్తమ చిత్రం' కేటగిరీలో పోటీ పడేందుకు అర్హత సాధించాయి. ఇందులో రిషబ్ శెట్టి దర్శకత్వంలో వచ్చిన కన్నడ బ్లాక్ బస్టర్ 'కాంతార: ఎ లెజెండ్ చాప్టర్ 1' గ్లోబల్ స్థాయిలో తన పట్టు నిలుపుకోగా, అనుపమ్ ఖేర్ దర్శకత్వం వహించిన హిందీ చిత్రం 'తన్వి ది గ్రేట్' ఆస్కార్ రేసులో నిలిచి అందరినీ షాక్‌కి గురిచేసింది. ఇక వీటితో పాటు భారతీయ పురాణ నేపథ్యంలో వచ్చిన బహుభాషా యానిమేషన్ చిత్రం 'మహావతార్ నరసింహ', నూతన దర్శకుడు అభిషన్ జీవింత్ తెరకెక్కించిన తమిళ చిత్రం 'టూరిస్ట్ ఫ్యామిలీ' కూడా ఈ అర్హత జాబితాలో చోటు దక్కించుకున్నాయి. రాధికా ఆప్టే నటించిన 'సిస్టర్ మిడ్‌నైట్' (ఖఖ-×అఁఖు కో-ప్రొడక్షన్) సైతం ఈ పోటీలో ఉండటం విశేషం. మరోవైపు భారత్ నుంచి అధికారికంగా పంపబడిన నీరజ్ ఘైవాన్ చిత్రం 'హోమ్‌బౌండ్' ఇప్పటికే 'ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్' కేటగిరీలో టాప్-15 షార్ట్‌లిస్ట్‌లో నిలిచి భారీ ఆశలు రేకెత్తిస్తోంది. ఆస్కార్ నిబంధనల ప్రకారం.. ఈ చిత్రాలన్నీ 2025లో అమెరికాలోని ప్రధాన మెట్రోపాలిటన్ ఏరియాల్లో కనీసం ఏడు రోజులు థియేటర్లలో ప్రదర్శితమై ఉండటంతో పాటు ఆస్కార్ అకాడమీ సూచించిన 'ఇన్‌క్లూజన్ స్టాండర్డ్స్' ప్రమాణాలను విజయవంతంగా పూర్తిచేశాయి. అయితే ఈ జాబితాలో ఉన్నంత మాత్రాన నామినేషన్ దక్కినట్లు కాదని, అకాడమీ సభ్యుల రహస్య ఓటింగ్ ప్రక్రియ తర్వాతే అసలు విజేతలు ఎవరో తెలుస్తుందని గుర్తుంచుకోవాలని సినీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఈ ఉత్కంఠకు తెరదించుతూ 2026 జనవరి 22న తుది నామినేషన్ల జాబితాను అకాడమీ ప్రకటించనుంది. ఇక ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూసే 98వ ఆస్కార్ అవార్డుల ప్రధానోత్సవ వేడుక 2026 మార్చి 15న లాస్ ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్లో వైభవంగా జరగనుంది. మొత్తం 24 విభాగాల్లో ఈ అవార్డులను అందజేయనుండగా, ఉత్తమ చిత్రం కేటగిరీలో 10 సినిమాలకు, మిగిలిన విభాగాల్లో ఐదేసి సినిమాలకు నామినేషన్లు దక్కనున్నాయి.



# టాక్సిక్ సినిమాకు యశ్ రెమ్యునరేషన్ అన్ని కోట్లా.. ? అందరి కంటే ఎక్కువ ఆ హీరోయిన్‌కే..!!

కన్నడ సూపర్ స్టార్ యష్ 'కేజీఎఫ్ 2' సినిమాతో విపరీతమైన పాపులర్ అయ్యాడు. కేజీఎఫ్ 1, 2 చిత్రాలతో పాన్ ఇండియా లెవల్లో మంచి క్రేజ్ సొంతం చేసుకున్నాడు. ఇప్పుడు అతడి నుంచి రాబోయే చిత్రం 'టాక్సిక్'. కొన్నాళ్లుగా ఈ మూవీ షూటింగ్ వేగంగా జరుగుతుంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్స్ ఆకట్టుకున్నాయి. కానీ గురువారం యశ్ పుట్టిన రోజు సందర్భంగా విడుదలైన టీజర్ మాత్రం వేరేలెవల్. ఈ సినిమాలో అతని అద్భుతమైన నటన చూసి, అభిమానులు ఫిదా అయ్యారు. దీంతో ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చుద్దామా అని ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. ఈ మూవీ సినిమా 2026 లో అతిపెద్ద బ్లాక్ బస్టర్ చిత్రంగా నిలుస్తుందని చెబుతున్నారు. ఈ టీజర్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో ఈ సినిమాకు యష్ ఎంత పారితోషికం తీసుకున్నాడనే చర్చ మొదలైంది. ఈ సినిమాకు నటుడు యష్ 50 కోట్ల రూపాయల పారితోషికం తీసుకుంటున్నాడని టాక్ నడుస్తుంది. యష్ నటించిన ఈ సినిమా బడ్జెట్ దాదాపు రూ. 300 కోట్లు. కియారా అద్వానీ ఈ సినిమా కోసం రూ. 15 కోట్లు పారితోషికం తీసుకుంది. ఇది ఆమె మొదటి సినిమాల కంటే చాలా ఎక్కువ. ఈ సినిమా కోసం నయనతార 12 నుంచి 18 కోట్ల రూపాయల ఫీజు తీసుకుంది. రుక్మిణి వసంత్ మెలిస్సా 3 నుంచి 5 కోట్ల రూపాయల ఫీజు తీసుకుంది. హుమా ఖురేషి, తారా సుతారియా 2 నుంచి 3 కోట్ల రూపాయల ఫీజు తీసుకున్నారు. ఈ టీజర్ 21 గంటల్లో సరిగ్గా 47 మిలియన్ వ్యూస్ సాధించింది.

# పెళ్లయిన 4 నెలలకే ప్రెగ్నెంట్? స్పందించిన హీరోయిన్

హీరోయిన్, చిన్నారి పెళ్లికూతురు ఫేమ్ అవికా గోర్ గతేడాది పెళ్లిపీటలెక్కింది. ప్రియుడు మిలింద్ చంద్వానీని 2025 సెప్టెంబర్ 30న వివాహం చేసుకుంది. తాజాగా ఈ జంట ఓ వ్లాగ్‌లో త్వరలోనే ఒక కొత్త ప్రయాణం మొదలు కానుందని ప్రకటించింది. దీంతో అవికా ప్రెగ్నెంట్ అంటూ ప్రచారం ఊపందుకుంది. ఈ రూమర్స్‌ను తాజాగా అవికా గోర్ కట్టిపారేసింది. నేను గర్భవతిని కాదు, అలాంటి విశేషం ఏం లేదు. కాపోతే త్వరలోనే ఓ శుభవార్త చెప్తాను, అదేంటో తెలుసుకోవాలంటే కొంతకాలం ఆగాల్సిందే! అని చెప్పింది. అవికా- మిలింద్ 2020లో హైదరాబాద్‌లో తొలిసారి కలుసుకున్నారు. మ్యూచువల్ ఫ్రెండ్స్ ద్వారా వీరి మధ్య పరిచయం ఏర్పడింది. కొంతకాలానికే ఆ స్నేహం ప్రేమగా మారింది. 2025 జూన్‌లో ఈ లవ్‌బర్డ్స్ ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు. అదే ఏడాది 'పతీ పత్నీ ఔర్ పంగా' అనే రియాలిటీ షోలో పెళ్లి చేసుకున్నారు. అవికా విషయానికి వస్తే.. చిన్నారి పెళ్లికూతురు సీరియల్‌తో బాలనటిగా గుర్తింపు తెచ్చుకుంది. ఉయ్యాల జంపాల చిత్రంతో హీరోయిన్‌గా మారింది. లక్ష్మీ రావే మా ఇంటికి, సినిమా చూపిస్త మావ, ఎక్కడికి పోతావు చిన్నవాడ, 10వ క్లాస్ డైరీస్, షణ్ముఖ వంటి పలు తెలుగు సినిమాలు చేసింది.



# దర్శకుడిగా లోకేష్ కనగరాజ్ స్నేహితుడు.. ఇంట్రెస్టింగ్‌గా '29' టైటిల్ టీజర్




లోకేష్ కనగరాజ్ స్నేహితుడు, రచయితగా ఆయన చిత్రాలకు (మాస్టర్, విక్రమ్, లియో) పనిచేసిన రత్న కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం '29'. ఈ సినిమా టైటిల్ టీజర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. కోలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ సినిమాలకు రచనలో భాగస్వామిగా ఉంటూ మాస్టర్, విక్రమ్, లియో వంటి సినిమాలను తెరకెక్కించడమే కాకుండా.. 'మేయాత మాన్', 'ఆడై' వంటి విభిన్న చిత్రాలతో దర్శకుడిగా తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న రత్న కుమార్ మళ్లీ మెగా ఫోన్ పట్టారు. ఆయన దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం '29'. ఈ సినిమా టైటిల్ టీజర్‌ను తాజాగా చిత్ర యూనిట్ సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఈ సినిమా టీజర్ చూస్తుంటే.. చెన్నై నగరంలో 29 ఏండ్ల వయసున్న సత్య అనే యువకుడి చూట్టు ఈ కథ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. ఒక వ్యక్తికి 29 ఏళ్ల వయసు అంటే అది కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదు.. బాధ్యతలు, గమ్యం మరియు వ్యక్తిగత అస్తిత్వం కోసం చేసే ఒక పోరాటం అనే కోణంలో ఈ సినిమా ఉండబోతున్నట్లు టీజర్ హింట్ ఇచ్చింది. విధు ప్రీతి అస్రాని ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మాస్టర్ మహేంద్రన్, అవినాష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ మరియు కార్తీక్ సుబ్బరాజ్ సంయుక్తంగా నిర్మిస్తుండటం విశేషం. ఈ చిత్రం 2026 ఫిబ్రవరి లేదా మార్చి నెలలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

# మూసీ నది ప్రాజెక్ట్‌పై ఒక ఆలోచన




రాష్ట్ర ప్రభుత్వం మూసీ నది సుందరీకరణ పేరుతో కొనసాగిస్తున్న ప్రక్షాళన ప్రాజెక్ట్ పై ప్రభుత్వ పెద్దలు,ప్రజలు ఒక్కసారి ఆలోచించండి.మనం అంతర్గత జలమార్గాల ద్వారా మూసీ నదిని కృష్ణానదితో అనుసంధానించాలి. మనం జలమార్గ రవాణాను అభివృద్ధి చేయాలంటే దానికి యూరోపియన్ రవాణా వ్యవస్థ నమూనాను అనుసరించాలి. ఎందుకంటే అంతర్గత జలమార్గం అనేది వస్తువులు,సామగ్రి లేదా ఇతర కదిలే వస్తువులను రవాణా చేయడానికి ఉపయోగించే నౌకాయాన యోగ్యమైన మార్గం. అంతర్గత జలమార్గాలలో నదులు,సరస్సులు,కాలువలు మరియు బ్యాక్‌వాటర్లు ఉంటాయి.నదులు మరియు సరస్సులు సహజ జల మార్గాలుగా ప్రజలకు ఉపయోగపడతాయి.అయితే కాలువలు మరియు బ్యాక్‌వాటర్లు కృత్రిమమైనవి కాబట్టి,మూసీ నది ద్వారా రవాణా కోసం ఒక నౌకా రవాణా విధానాన్ని అభివృద్ధి చేస్తే దీనిని నల్లగొండ జిల్లాలోని వాడపల్లి వరకు విస్తరించవచ్చు.ఇది కేవలం రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుండి మాత్రమే ఖర్చు కాకుండా మనకు ప్రపంచ బ్యాంకు మరియు అంతర్గత జలమార్గాల అథారిటీ నుండి నిధులు లభిస్తాయి.అప్పుడే ఇది ఒక ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ అవుతుంది. ప్రజలకు రవాణా ఖర్చు చాలా తక్కువవుతుంది,కాలుష్యం కూడా తక్కువగా ఉంటుంది.



**ప్రభుదాస్.**
డీడ్ సివిల్-సొసైటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి, ప్రపంచ బ్యాంకు సివిల్ సొసైటీ పాలసీ ఫోరమ్ సభ్యుడు,వాషింగ్టన్ డి.సి, యూఎస్ఏ.
9441464767, 9390381267

మనం దీని ద్వారా పర్యాటకులను కూడా విపరీతంగా ఆకర్షించవచ్చు.తద్వారా ఆదాయ మార్గాలను సృష్టించవచ్చు.అందుకే ప్రభుత్వ పెద్దలు,రాష్ట్ర శ్రేయస్సును కోరుకునే వారు దీనిపై పరిశోధన చేయండి,ఆ తర్వాత అమలు సాధ్యాసాధ్యాలను పరిశీలించండి. చివరగా మూసీ నదిని ప్రపంచం గర్వించదగ్గ పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించండి.అప్పుడే మూసి సుందరీకరణకు అసలైన అందాలను అద్దినవారమవుతాం.

# అధైర్యపడవద్దు పోలీసు అండగా ఉంది





**నారాయణగూడెం బాధితులను పరామర్శించిన ఎస్పీ**

**పోలీస్ శాఖ అండగా ఉంటుందని బాధితులకు భరోసా**

**వేగంగా కేసు దర్యాప్తు చేసి చట్టపరంగా చేస్తాం**

**నిందితులకు త్వరగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నాం**

**ధర్మఘంట జనవరి 09 మునగాల:** సర్పంచ్ ఎన్నికల సమయంలో సూర్యాపేట జిల్లా మునగాల మండలం నారాయణగూడెం గ్రామంలో షెడ్యూల్డ్ క్యాస్ట్ వర్గంపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి జిల్లా ఎస్పీ నరసింహ శుక్రవారం బాధితుల ఇండ్లకు స్వయంగా వెళ్లి గాయపడిన వారిని పరామర్శించారు.ఈ సందర్భంగా ఎస్పీ బాధితులతో మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ,అట్రాసిటీ చట్టం ప్రకారం బలమైన కేసు నమోదు చేశామని,దీనిలో 11 మంది నిందితులను చేర్చామని,ఈ కేసును పారదర్శకంగా,వేగంగా దర్యాప్తు చేసి త్వరితగతిన వారికి చట్టపరమైన శిక్షలు అమలయ్యేలా కృషి చేస్తామని తెలిపారు.ఎస్సీ,ఎస్టీ,అట్రాసిటీ చట్టం చాలా శక్తివంతమైనదని, చట్టంపై నమ్మకం ఉంచాలని కోరారు.గ్రామంలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని, గ్రామంలో పూర్తిస్థాయి నిఘా ఉంచామని,ఎవరూ అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. చట్టంపై నమ్మకంతో ఉండాలని కోరారు.ఎదురుదాడికి పాల్పడి కేసులపాలు కావద్దని బాధితులకు సూచించారు. గ్రామంలో శాంతియుత వాతావరణం కోసం పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ధైర్యంగా రోజువారీ పనులు చేసుకోవాలన్నారు. గ్రామంలో అందుబాటులో ఉండాలని గ్రామంలో కట్టుదిట్టమైన నిఘా ఉంచాలని, నిరంతర పెట్రోలింగ్ చేయాలని స్థానిక ఎస్ఐ,సిఐలకు సూచనలు చేశారు.నిదితులను 5 లక్షల రూపాయలకు బైండోవర్ చేయడం జరుగుతుందన్నారు. షెడ్యూల్ క్యాస్ట్,షెడ్యూల్ ట్రైబల్,బబడుగు బలహీన వర్గాలు,మహిళలు,వృద్ధుల రక్షణలో పోలీసు వేగంగా స్పందిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో కోదాడ డివిజన్ డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, మునగాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణా రెడ్డి,మునగాల ఎస్ఐ ప్రవీణ్ కుమార్,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆత్మహత్యల బలవన్ లమరణాలకు సీఎం రేవంత్ రెడ్డి కారణం

**బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున ముదిరాజ్**



**ధర్మఘంట జనవరి 09 నల్లగొండ:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు దాదాపు 100కు పైగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం జరిగిందని,దీనికి ముఖ్య కారణం సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఉన్నడు కాబట్టి, బాధ్యత వహించి ఇప్పటికైనా విద్యారంగంపై దృష్టి పెట్టి విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడకుండా తగు చర్యలు తీసుకొని,అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున ముదిరాజ్ డిమాండ్ చేశారు.శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని వీటి కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మరి ముఖ్యంగా నల్లగొండ జిల్లాలోని చర్లపల్లిలో ఉన్న మహిళా డిగ్రీ సాంఘిక సంక్షేమ కళాశాలలో ఎస్సీ విద్యార్థిని బిల్డింగ్ మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని,గత మూడు రోజుల క్రితం ఎస్జీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న బీసీ వసతి గృహంలో నివసిస్తున్న హేమశ్రీ అనే విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడడం జరిగిందని,ఈ ఆత్మహత్యలు ఆపాలంటే తక్షణమే అన్ని గురుకుల వసతి గృహాలలో,ఎస్సీ,ఎస్టీ సంక్షేమ హాస్టల్లో మానసిక వైద్య నిపుణులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాని,అదేవిధంగా విద్యాశాఖ మంత్రిని నియమించాలని సూచించారు. గతంలో కేసీఆర్ ఎస్సీ,ఎస్టీ,బీసీ విద్యార్థులు ఆర్థికంగా బలోపేతం కావాలని,విద్య ప్రమాణికంగా భావించి దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో 1100 పైచిలుకు గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసి,పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించారని గుర్తు చేశారు.కానీ, ఈరోజు రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత గురుకుల పాఠశాలలను మూతపడే విధంగా కుట్ర చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి చల్లా కోటేష్ యాదవ్, ఇటికాల రాము,విన్నపరెడ్డి సైదిరెడ్డి,కుంటిగొర్ల లింగయ్య, దుబ్బాక రామకృష్ణ,రవీందర్ రెడ్డి,లింగస్వామి,శంకర్,సైదులు తదితరులు పాల్గొన్నారు.

## మర్రిగూడ హైస్కూల్లో సంక్రాతి ముగ్గుల పోటీలు

**ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేసిన విద్యార్థినులు**

**ధర్మఘంట జనవరి 09 మర్రిగూడ:**



నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శుక్రవారం ముందస్తుగా ముగ్గుల పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థినిలు ఉత్సాహంగా పాల్గొని రంగు రంగుల రంగవల్లులు తీర్చిదిద్దారు.వాటిని పరిశీలించిన ఉపాధ్యాయినులు ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులను ఎంపిక చేసి, విద్యార్థులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రూప్ సింగ్,ఉపాధ్యాయ బృందం రేణుక,హైమా,వేద,లలిత మాస బాలరాజు,కృష్ణారెడ్డి,కృష్ణయ్య, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన గానుగుబండ పంచాయతీ కార్యదర్శి

**తుంగతుర్తి:సూర్యాపేట జిల్లా**



తుంగతుర్తి మండల పరిధిలోని గానుబండ గ్రామ పంచాయతీ కార్యదర్శి బరపటి కృష్ణ శుక్రవారం ఓ వ్యక్తి నుండి రూ.6 వేలు రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వల పన్ని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ఏసీబీ డిఎస్పి జగదీష్ చంద్ర తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల నూతనంగా ఇంటి నిర్మాణం చేశాడు.ఆ ఇంటికి ఇంటి నెంబర్ కావాలని సంప్రదిస్తే రూ.6 వేలు లంచం ఇస్తేనే పని పూర్తవుతుందని చెప్పడంతో అతను ఏసీబీ అధికారులను ఆశ్రయించాడని తెలిపారు.దీంతో అతడు ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు గ్రామపంచాయతీ కార్యాలయంలో సదరు నగదు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కుక్కడం గ్రామంలో ఇంటి వద్ద ఆఫీసుల్లో సోదాలు జరుపుతున్నామని,అతడిపై అధికారి ఎంపీడీవోను పిలిచి విచారిస్తున్నామని,కృష్ణను కోర్టులో హాజరుపరుచనున్నట్లు తెలిపారు.ఎవరైనా ప్రభుత్వ అధికారి పనుల కోసం లంచం అడిగితే 1064 నెంబర్ కు ఫోన్ చేయాలని,వారి పేరు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.అదే సమయంలో ఏసీబీ తెలంగాణ ట్విట్టర్ లో కూడా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

## అర్హులకే ఇల్లు అడ్డగోలు సిఫారసులకు చెక్: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ధర్మఘంట జనవరి 09 హుజూర్ నగర్**



ఎదల సొంతింటి కలపై రాజకీయం చేసే కాలం చెల్లిపోయిందని,అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు ఇచ్చి తీరుతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణ కేంద్రంలోని రామస్వామి గుట్ట వద్ద సింగిల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో విషయమై ఆయన మాట్లాడుతూ ఇండ్ల పంపిణిలో పారదర్శకతే తన మార్కని చాటిచెబుతూ లబ్ధిదారుల ఎంపిక విషయంలో అధికారులకు మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. మధ్యవర్తులు కనిపిస్తే ఉపేక్షించవద్దని,రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గవద్దని,కేవలం నిజమైన పేదవాడికి మాత్రమే న్యాయం జరగాలని తేల్చి చెప్పారు.గతంలో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవాన్ని రంగరించి,ఇప్పుడు ప్రభుత్వం తరపున ఇండ్ల పంపిణీని ఒక యజ్ఞంలా పూర్తి చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. సిఫారసులు పట్టుకొచ్చేవారికి, దళారులకు తన నియోజకవర్గంలో తావులేదని ఉత్తమ్ హెచ్చరించారు.అర్హులు ఎవరూ భయపడాల్సిన పనిలేదని,అర్హులకు నేరుగా ఇండ్లను అందజేస్తామని భరోసా ఇచ్చారు.నిరుపేదల సొంతింటి కల నెరవేర్చే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు.

## మిర్యాలగూడలో ఘోర రోడ్డు ప్రమాదం

**డీసీఎం వ్యాన్ సిమెంట్ ట్యాంకర్‌తో ఢీకొని ముగ్గురు మృతి**

**మరో ముగ్గురికి తీవ్రగాయలు ఆసుపత్రికి తరలింపు**



**ధర్మఘంట జనవరి 09 మిర్యాలగూడ:**

నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఈదులగూడ చౌరస్తా దగ్గర గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కూలీలు మృత్యువాత పడ్డారు.వివరాల్లోకి వెళితే...హైదరాబాద్ నుంచి గుంటూరుకు టైల్స్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్ మిర్యాలగూడ మండలం ఈదులగూడ చౌరస్తా దగ్గర రాగానే వేగంగా సిమెంట్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో టైల్స్ కూలీలపై పడి ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.మరో ముగ్గురు కూలీలు తీవ్రంగా గాయపడడంతో వారిని హుటాహుటిన మిర్యాలగూడ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాద సంఘటన గురించి సమాచారం అందుకున్న మిర్యాలగూడ వన్ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని,మృతుల వివరాలు సేకరించి,డీసీఎం డ్రైవర్ వేగంగా వెళ్తూ ఈ ప్రమాదానికి కారణమయ్యాడని ప్రాథమిక అంచానాకు వచ్చి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పంచాయతీ వర్కరలకు మూడు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

**సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు**




**ధర్మఘంట జనవరి 09 సూర్యాపేట**

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో 11 గ్రామాలకు చెందిన గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ లో జిల్లా పంచాయతీ అధికారి యాదగిరికి తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నెమ్మాది మాట్లాడుతూ బ్యాంక్ టెక్నికల్ సమస్య పేరుతో మూడు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వకుండా ఉండడం కార్మికుల కుటుంబాలకు ఇబ్బందని అన్నారు.ఒక్క గరిడేపల్లి మండలం మాత్రమే కాదు జిల్లాలో చాలా గ్రామ పంచాయతీ లలో నెలల తరబడి వేతనాలు చెల్లించలేని పరిస్థితి ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటి సభ్యులు యాకుబ్,శ్రావణ్, కరుణాకర్,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## మండలానికో జూనియర్ కాలేజీ కావాలి

**మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

**ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్యకు వినతిపత్రం**



**ధర్మఘంట జనవరి 09 మునుగోడు:** తన నియోజకవర్గంలో ప్రతి మండలానికి ఒక ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలను ఏర్పాటు చేయాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు.శుక్రవారం హైదరాబాదులో ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్యని కలిసి వినతిపత్రం అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని మునుగోడు, చండూరు,మర్రిగూడెం,ఘట్టుప్పల్ మండల కేంద్రాలలో ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలు ఏర్పాటు చేయాలని,మునుగోడు నియోజకవర్గం పూర్తిగా వెనుకబడిన నియోజకవర్గమని, మండలానికి ఒక ఇంటర్ కళశాల ఉంటే పేద విద్యార్థులు ఇక్కడే చదువుకునే అవకాశం ఉంటుందని,వీలైనంత తొందరగా ఆయా మండల కేంద్రాలలో ప్రభుత్వ ఇంటర్ కళశాలలను ఏర్పాటు చేయాలని కోరారు.

## ఆర్ వివేకవాణి హై స్కూల్‌లో ఘనంగా సంక్రాంతి సంబరాలు



**ధర్మఘంట, జనవరి 09, సూర్యాపేట:** స్థానిక 60 ఫీట్ల రోడ్డు లోని జిఆర్ వివేకవాణిని హైస్కూల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు విద్యార్థిని విద్యార్థులు చక్కటి వేషాధారణతో అలరించారు. విద్యార్థులు వేసిన రంగురంగుల రంగవల్లికలు ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి సంక్రాంతి సంబరాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే పతంగులు ఎగరవేసి ఎడ్ల బండిలు కోడిపుంజుల బొమ్మలు తయారు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గుడిమల్ల సంతోష్ శర్మ మాట్లాడుతూ నూతన సంవత్సరములో మొదటిగా రంగురంగులతో ఆనందంగా ఆహ్లాదకరంగా జరుపుకునే పండుగ సంక్రాంతి పండుగని మూడు రోజులపాటు జరుపుకునే సంక్రాంతి పండుగలో మొదటిరోజు భోగి మంటలలో పాత వస్తువులను వేసి కాల్చి కొత్తదనానికి ఆహ్వానం పలుకుతూ రెండవ రోజు మకర రాశిలోకి సూర్యుడు ప్రవేశించడం మూడవరోజు రైతులు ఎడ్లు బండ్లను కడిగి మంచి అలంకరణతో తయారుచేసి ఎడ్ల బండిలో ప్రయాణం చేసి కొత్త బట్టలతో పండుగలు గొప్పగా జరుపుకుంటారని తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపల్ గుడిమల్ల స్వప్న మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు పండుగలు అత్యంత వైభవంగా జరుపుకోవాలని క్రమశిక్షణతో ప్రాణాలికతో చదివి ఆటపాటలలో మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాఠశాల అధ్యాపక బృందం తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన ఆహారాన్ని అందించి కస్టమర్ల మన్ననలు పొందాలి

**వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి**




**ధర్మఘంట, జనవరి 09, సూర్యాపేట:**

వ్యాపార పరంగా పోటీ ప్రపంచంలో ఎదురీదుతున్న ఈ తరుణంలో కస్టమర్లకు మంచి రుచి, సూచి, నాణ్యమైన ఆహారాన్ని అందించి కస్టమర్ల ఆదరాభిమానాలు పొందాలని ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా యువత స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నల్లాల బావి చౌరస్తా వద్ద మామ 90 కిచెన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ప్రైవేట్ రంగాల్లో అందివస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ, మరింత మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బైరు శైలేందర్, కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కొండపల్లి దిలీప్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ జహీర్, పందిరి మల్లేష్,బైరు వెంకన్న గౌడ్, చెంచాల నిఖిల్ నాయుడు, కొడకండ్ల ఉపేందర్ రెడ్డి, టైసన్ శ్రీను, నిర్వాహకులు ఉయ్యాల ప్రభు కుమార్, శ్రీకాంత్, ఎల్గూరి యాదగిరి, ఎల్గూరి బాలు, వెంకన్న, కిరణ్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

## వట్టిఖమ్మంపహాడ్ వద్ద ఖమ్మం హైవే పై పోలీస్ ఆంక్షలు

**చివ్వేంల ఎస్ఐ మహేష్**



**ధర్మఘంట జనవరి 09 చివ్వేంల**

సంక్రాంతి పండుగ ప్రయాణాల దృష్టి వాహనాల రద్దీని నియంత్రించడంతో పాటు,రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఖమ్మం –సూర్యాపేట జాతీయ రహదారి 365 బిబిపై హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను సూర్యాపేట జిల్లా చివ్వేంల మండల పరిధిలో వట్టిఖమ్మంపహాడ్ వద్ద వాహనాలను నియంత్రిస్తూ ఆంక్షలు అమలు చేయడం జరుగుతుందని చివ్వేంల ఎస్ఐ మహేష్ తెలిపారు. శుక్రవారం 65 వ,జాతీయ రహదారిపైకి టేకుమట్ల వైపుకు హైదరాబాద్ వెళ్లే వాహనాలను చివ్వేంల వద్ద సర్వీస్ రోడ్డు నుండి సూర్యాపేట వెళ్లే పాత హైవే మీదుగా చివ్వేంల మండల కేంద్రం మీదుగా సూర్యాపేటకు మళ్ళించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇక్కడి నుండి వెళ్లే వాహనాలు సూర్యాపేట పట్టణంలో ఖమ్మం అండర్ పాస్ నుండి వెళ్లి హైదరాబాద్ వైపు వెళ్ళవచ్చునని తెలిపారు. రాయినిగూడెం వద్ద హైదరాబాద్ వైపు యూటర్న్ మూసివేయడం వల్ల ప్రయాణికుల సౌకర్యార్థం, వాహనదారుల సౌకర్యార్థం ఈ చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

## ఆంధ్రా వెళ్లే వాహనదారులు పోలీసు సూచనలు పాటించాలి

**సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్**

**ధర్మఘంట జనవరి 09 సూర్యాపేట**




సంక్రాంతి పండుగకు ఆంధ్రాకు వెళ్లే వాహనదారులు పోలీసు సూచనలు పాటించాలని సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు. వాహనాల రద్దీ పునరుద్ధరణ, రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా శుక్రవారం సూర్యాపేట రూరల్ పరిధిలోని జాతీయ రహదారి 65 పై మళ్లింపు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. సంక్రాంతి పండుగకు ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనాలకు మార్గం చూపిస్తూ సూర్యాపేట రూరల్ పరిధి టేకుమట్ల వద్ద డైరెక్షన్ బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.వాహనదారులు గమనించి వైజాగ్,రాజమండ్రి, కాకినాడ,విజయనగరం,శ్రీకాకుళం వెళ్లే వారు ఈ మార్గాన్ని అనుసరించాలని,వాహనాల రద్దీ పునరుద్ధరణ,ప్రమాదాల నివారణలో భాగంగా చర్యలు చేపట్టడం జరిగిందని, పోలీసులకు వాహనదారులు సహకరించాలని కోరారు.

# అమాత్యుల వారు ఐఏఎస్ గారి మధ్య ఆ బంధం ఏ సంబంధం?



**గంట సోమన్న**
**సీనియర్ జర్నలిస్ట్.**

తెలంగాణ రాజకీయాల్లో ఓ సీనియర్ మంత్రిగారి వ్యవహార శైలి సంచలనంగా మారింది.ఆ సీనియర్ మంత్రికి ఐఏఎస్ అధికారిణి మధ్య కొనసాగుతున్న డైలీ ఫోన్ కాల్ బంధం బయటికి పొక్కడంతో సొంత జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ కీలక మంత్రి ప్రవర్తనపై రాష్ట్రవ్యాప్తంగా గుసగుసలు,రూమర్లు వినిపిస్తున్నాయి.అంతటితో ఆగకుండా ఆ మంత్రి ప్రభుత్వ మహిళా అధికారులు,సీనియర్ మహిళా జర్నలిస్టులు,పార్టీ మహిళా నాయకులపై వేధింపులకు పాల్పడుతున్నాడనే ఆరోపణలు కూడా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.ఈ వ్యవహారం ఇప్పుడు ప్రభుత్వ పెద్దలకు,పార్టీ హైకమాండ్‌కు తలనొప్పిగా మారింది.సదరు మంత్రి తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని,సీఎం హెచ్చరికలు కూడా పట్టించుకోవడం లేదని ప్రభుత్వ పెద్దల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

**రూమర్ల వెనుక నేపథ్యం ఏమిటి?**

రాష్ట్రంలోని ఒక ముఖ్యమైన జిల్లాకు మంత్రిగా ఉన్న ఈ సీనియర్ మంత్రి,తన ఇలాకాలో పని చేసిన ఒక ఐఏఎస్ అధికారిణితో చిగురించిన 'స్నేహ బంధం' పై రూమర్లు గత కొన్ని నెలలుగా వస్తున్నాయి.ఈ బంధం సాధారణ స్నేహమా లేక మరింత దగ్గరి సంబంధమా అనే చర్చలు రాజకీయ వర్గాల్లో,సోషల్ మీడియాలో జోరుగా సాగుతున్నాయి.కానీ,ఈ వ్యవహారం క్రమంగా వేధింపుల రూపం దాల్చినట్లు కనిపిస్తోంది. మంత్రి కీలక శాఖలు నిర్వహిస్తూ, ప్రభుత్వ మహిళా అధికారులను వదలకుండా వేధిస్తున్నాడని, పార్టీలోని మహిళా నాయకులను కూడా టార్గెట్ చేస్తున్నాడని టాక్ నడుస్తోంది.ఈ రూమర్లు మరింత తీవ్రమవుతున్న నేపథ్యంలో మంత్రి ప్రవర్తన పదవికే మచ్చ తెచ్చేలా ఉందని విమర్శలు ఊపందుకున్నాయి.పార్టీ నాయకులు సైతం ఆయన బాగోతాలు చూసి షాక్ అవుతున్నారని సమాచారం. మంత్రి ఇప్పటికే పలు వివాదాల్లో చిక్కుకుని,ప్రభుత్వ ఇమేజ్‌కు డ్యామేజ్ చేస్తున్నాడనే అభిప్రాయం బలపడుతోంది.

**ఫ్యామిలీ,ప్రభుత్వానికి తలనొప్పి**

ఈ వ్యవహారం మంత్రి ఫ్యామిలీకి కూడా తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది.రాజకీయాల్లో ఇలాంటి రూమర్లు సాధారణమే అయినా,ఇక్కడ విషయం మహిళల వేధింపులకు సంబంధించినది కావడంతో ఫ్యామిలీ సభ్యులు ఇబ్బంది పడుతున్నారని,ఒక దశలో మంత్రి ఫోన్ కూడా లాక్కున్నారని,అయినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదని, పీఏల ఫోన్ లతో సంభాషణలు సాగించారనే ఆరోపణలు ఉన్నాయి.మరోవైపు ప్రభుత్వ పెద్దలు ముఖ్యంగా సీఎం,పార్టీ ఇంఛార్జ్ ఈ మంత్రి ప్రవర్తనపై ఆందోళన చెందుతున్నారని, ఆయనను నిలువరించాలని పలు సార్లు హెచ్చరించినా మంత్రి వినడం లేదని కాంగ్రెస్ వర్గాల్లోనే చర్చ జరుగుతోంది.ఈ రూమర్లు ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే అవకాశం ఉందని,దీన్ని కట్టడి చేయాల్సిన అవసరం ఉందని రాజకీయ సైతం విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**ట్రాన్స్‌ఫర్‌తో ఊపిరి పీల్చుకున్న మంత్రి**

పరిస్థితి చెయ్యి దాటి పోయే అవకాశం ఉన్న పరిస్థితుల్లో ఇటీవల జరిగిన ఐఏఎస్ అధికారుల ట్రాన్స్‌ఫర్లలో సదరు ఐఏఎస్ అధికారిణి బదిలీ కావడంతో,ఆ అధికారిణికి మంత్రికి మధ్య ఉన్నవి మంచి సంబంధాలు లేవని,ఈ బదిలీతో కాస్త మంత్రికి ఊపిరి పీల్చుకునే అవకాశం దక్కిందని రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న టాక్.ఇదే సమయంలో ఈ బదిలీ నేపథ్యంలోనే రూమర్లు మరింత ఊపందుకున్నాయనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.డిసెంబర్ 2025లో జరిగిన ఐఏఎస్ ట్రాన్స్‌ఫర్లలో కీలక పదవుల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. అందులో ఆ మహిళా అధికారిణి బదిలీ కూడా ఉండడం గమనార్హం. రాజకీయ పరిణామాలు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే పలు వివాదాలు, అవినీతి ఆరోపణలతో సతమతమవుతోంది.మంత్రుల మధ్య ఆరోపణలు,ఐఏఎస్ అధికారుల వాలంటరీ రిటైర్‌మెంట్లు వంటివి ఇప్పటికే సంచలనం రేపాయి.ఈ కొత్త రూమర్లు ప్రభుత్వానికి మరిన్ని సవాళ్లు తెచ్చిపెట్టవచ్చు.పార్టీ హైకమాండ్ ఈ విషయంపై ఎలా స్పందిస్తుందో చూడాలి.మహిళల వేధింపులపై జీరో టాలరెన్స్ పాలసీ అనుసరిస్తామని చెప్పిన కాంగ్రెస్,ఈ ఆరోపణలపై విచారణ జరిపించాల్సిన అవసరం ఉంది.ఈ రూమర్లు కేవలం రాజకీయ కుట్రలా లేక నిజమా అనేది కాలమే నిర్ణయిస్తుంది.కానీ,ప్రస్తుతం ఇవి రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

## విద్యార్థులు క్రమశిక్షణతో పోటీపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి

**సర్పంచ్ గుంటకండ్ల రామచంద్ర రెడ్డి, వేమన్ రెడ్డి**



**ధర్మఘంట, జనవరి 09, సూర్యాపేట**

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని, పోటీ తత్వంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చు అని నాగారం సర్పంచ్ మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి తండ్రి గుంటకండ్ల రామచందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గుంటకండ్ల సావిత్రమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గతంలో డిబేట్ పీరియడ్ ఉండేదని, డిబేట్ పీరియడ్ పెడితే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల ఆకలి తీర్చేందుకు గుంటకండ్ల సావిత్రమ్మ జ్ఞాపకార్థం ఉచిత మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానోపాధ్యాయులు పెరుమాళ్ళ యాదయ్య, గుంటకండ్ల వేమన్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గోరెంట్ల నవీన్ కుమార్, అధ్యాపకులు వీడిఎస్ ప్రసాద్, వాసు,గురువయ్య,సైదులు బషీర్, ఉన్నిసా,వెంకట కృష్ణమాచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆరుగురు వైసీపీ ఎమ్మెల్యేలపై కఠిన చర్యలు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ శాసనసభలో నైతిక విలువల కమిటీ సమావేశం అయింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు సభా కార్యక్రమాలకు హాజరుకాకుండానే, అన్ని రకాల ప్రభుత్వ ప్రయోజనాలను పొందుతున్నారనే ఫిర్యాదులపై ఈ కమిటీ చర్చించింది.ఆంధ్రప్రదేశ్ శాసనసభ నిబంధనలను ధిక్కరిస్తూ, సభా కార్యక్రమాలకు గైర్హాజరవుతున్న ఆరుగురు వైసీపీ ఎమ్మెల్యేల తీరుపై ఎథిక్స్ కమిటీ సీరియస్ అయింది. శాసనసభ సమావేశాలకు రాకుండా పార్టీ నిర్ణయం పేరుతో బయటే ఉంటున్న ఈ ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ఖజానా నుండి అందే జీతాలు, టీఏ , డీఏ లను మాత్రం క్రమంతప్పకుండా తీసుకుంటున్నట్లు కమిటీ ప్రాథమికంగా గుర్తించింది. ప్రజాప్రతినిధులుగా ప్రజల గొంతుకను సభలో వినిపించాల్సిన బాధ్యతను విస్మరించి, కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసం పదవులను వాడుకోవడం నైతికంగా నేరమని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. స్పీకర్ కూడా ఈ విషయంలో అత్యంత కఠినంగా ఉండాలని భావిస్తున్నారు. సభకు రావడం అనేది ఎమ్మెల్యేల హక్కు మాత్రమే కాదు, అది వారి ప్రాథమిక బాధ్యత. ప్రజల సొమ్మును జీతాలుగా తీసుకుంటూ సభను

# నగరంలో పలు చోట్ల భారీగా గంజాయి పట్టివేత

రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏ టీమ్ మీర్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు నిర్వహించిన తనిఖీల్లో 3.35 కేజీల గంజాయి పట్టుకున్నారు. ఈ కేసులో మొగిలి రాకేష్ అన్యేవక్తిని అరెస్ చేశారు. నిందితుడిని గంజాయిని మీర్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించామని అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్ తెలిపారు.

**బాలనగర్‌లో 2.210 కేజీల గంజాయి పట్టివేత..**

సరూర్‌నగర్ డీటీఎఫ్ సీఐ సత్యనారాయణ రావు, ఎస్సై శంకర్ సిబ్బంది కలిసి నిర్వహించిన తనిఖీల్లో 2.210 కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఇల్లెల గూడ నుంచి ఆర్‌ఐసీ రోడ్డులో జిల్లెల చెరువు శివారుల్లో స్కూటి పై గంజాయి అమ్మకాలు జరుపుతుండగా పట్టుకున్నారు. నిందితుల నుంచి స్కూటీ తోపాటు అన్నాలపు సాయి కిరణ్, బక్క రాజులను అరెస్టు చేశారు. గంజాయితోపాటు నిందితులను బాలనగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.



**1.522 కేజీల గంజాయి పట్టివేత..**

అమీర్‌పేట్ బరబండ బస్‌స్టాండ్ ప్రాంతంలో గంజాయి అమ్మకాలు జరుగుతుతుండగా ఎస్టీఎఫ్ బీ టీమ్ ఎస్సై బాలరాజు సిబ్బంది కలిసి పట్టుకున్నారు. నిందితుడు అజ్మత్‌ను అరెస్టు చేశారు. ఈ కేసులో సికిందర్, అక్బర్‌పై కూడ కేసు నమోదు చేశారు. గంజాయిని నిందితుడిని అమీర్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

**నాంపల్లి లో 775 గ్రాముల గంజాయి పట్టివేత..**

నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బీహార్‌కు చెందిన సర్వ



కుమార్ అనే వ్యక్తి వద్ద 775 గ్రాముల గంజాయిని ఎస్టీఎఫ్ సీ టీమ్ సీఐ వెంకటేశ్వర్లు సిబ్బంది పట్టుకొని నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

**310 గ్రాముల గంజాయి పట్టివేత..**

మీర్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఒక పాస్టిక్ షాపు సమీనంలో గంజాయి అమ్మకాలు జరుపుతున్న శివకుమార్ ను ఎస్టీఎఫ్ డీ టీమ్ ఎస్సై బాల రాజు సిబ్బంది పట్టుకున్నారు. నిందితుడిని గంజాయిని మీర్‌పేట్ స్టేషన్‌లో అప్పగించారు.

# పారదర్శక పాలనలో ఉద్యోగుల పాత్ర కీలకం





**అభివృద్ధిలో జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

విజయవాడ

ప్రజలకు పారదర్శకమైన సేవలందించడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని.. అంకితభావంతో సేవలందిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఏపీ ఎన్‌జీజీవో ఎన్‌టీఆర్ జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌నందు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గారు వినూత్న కార్యక్రమాలను అమలుచేస్తున్నారన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047తో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకెళ్తోందని.. ఈ లక్ష్యాల సాధనలో ఉద్యోగులు కీలక భాగస్వాములు కావాలన్నారు. జీడీడీపీ, తలసరి ఆదాయంలో వృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు, పేదరిక నిర్మూలనకు అమలుచేస్తున్న కార్యక్రమాలు సత్ఫలితాలు ఇవ్వడంలోనూ ఉద్యోగుల సేవలు ప్రధాననమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీజీవో జిల్లా అధ్యక్షులు డి.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం అప్పగించిన విధులను సమర్థవంతంగా అమలుచేయడంలో ఎన్‌టీఆర్ జిల్లా ఉద్యోగులు ఎల్లప్పుడూ ముందుంటారన్నారు. నవ్య రాజధాని అమరావతికి గేట్ వే అయిన ఎన్‌టీఆర్ జిల్లాలో ఉద్యోగులు పని ఒత్తిడిని అధిగమించి అభివృద్ధి, సంక్షేమ పథకాల అమల్లో ప్రత్యేక దృష్టిపెట్టి జిల్లా సమగ్రాభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తారన్నారు. కీలకమైన ఈ జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు మిగిలిన జిల్లాలకు ఆదర్శంగా ఉండేలా ప్రజలకు సేవలందిస్తామని పేర్కొన్నారు. మెగా ఈవెంట్లను విజయవంతం చేయడంలోనూ జిల్లా కలెక్టర్ సారథ్యంలో సమష్టి కృషితో ముందడుగు వేస్తామని సత్యనారాయణరెడ్డి అన్నారు. కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీజీవో ఎన్‌టీఆర్ జిల్లా సహాధ్యక్షులు వీవీ ప్రసాద్, కార్యదర్శి పి.రమేష్, కోశాధికారి వి.సతీష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు జి.రామకృష్ణ, వి.నాగార్జున, ఎండీ జానీ పాషా, కె.శివలీల, సీహెచ్ మధుసూధనరావు, సీహెచ్ శ్రీదేవి, నగర శాఖ అధ్యక్షకార్యదర్శులు సీహెచ్ సీవీఆర్ ప్రసాద్, షేక్ నజీరుద్దీన్, కార్యవర్గ సభ్యులు రాజశేఖర్, డీఎస్ఎన్ శ్రీనివాస్, బి.విజయశ్రీ, రాంబాబు, ఎస్కే ఖాసిం సాహెబ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో కూడా చెత్త ప్రాసెసింగ్ సెంటర్లు

**చెత్త సేకరణకు కార్పొరేషన్ ద్వారా యంత్రాల కొనుగోలు**

**త్వరలో డంప్ యార్డ్ ఫ్రీ స్టేట్ గా ఏపీ**

**ఆకస్మిక తనిఖీలు చేయనున్న సీఎం**

**'స్వచ్ఛ సంక్రాంతి- స్వచ్ఛ గ్రామ పంచాయతీ' సభలో పట్టాభిరామ్**





అద్దంకి

గ్రామాల్లో కూడా ప్రాసెంగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు, ప్రాసెస్ చేసిన చెత్తను రీసైక్లింగ్ సెంటర్ల వారు కొనుగోలు చేస్తారని, ఈ విధంగా గ్రామాలకు కొంత ఆదాయం సమకూరుతుందని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ చెప్పారు. చెత్త నుంచి సంపద సృష్టించడం అనేది మనం చేసి చూపిస్తున్నామన్నారు. రావినూతల గ్రామంలో శుక్రవారం జరిగిన 'స్వచ్ఛ సంక్రాంతి- స్వచ్ఛ గ్రామ పంచాయతీ' సభలో ఆయన ప్రసంగించారు. సంక్రాంతి సందర్భంగా మన ఇళ్లను శుభ్రపరిచి, నూతన వస్త్రాలు ఎలా ధరిస్తామో, అలాగే గ్రామాలను కూడా శుభ్రపరిచి స్వచ్ఛంగా రూపొందించాలనే ఆలోచనతోనే 'స్వచ్ఛ సంక్రాంతి- స్వచ్ఛ గ్రామ పంచాయతీ' కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. 2025, జనవరి 25న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వచ్ఛ ఆంధ్ర ఉద్యమానికి నాంది పలికిన తర్వాత అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. మహానగరాలు, నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో చేపట్టవలసిన కార్యక్రమాలకు సంబంధించి ఒక ప్రణాళిక సిద్ధం చేసుకుని ముందుకు వెళుతున్నామన్నారు. పట్టణాలలో బయోమైనింగ్ ద్వారా కొంతవరకు లెగసీ వేస్ట్ ని క్లియర్ చేస్తున్నామని, ప్రాసెసింగ్ సెంటర్లను కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇప్పుడు ప్రత్యేకంగా గ్రామాలపైన కూడా దృష్టిపెట్టినట్లు పట్టాభిరామ్ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా తమకు అన్ని విధాల సహకరిస్తున్నట్లు చెప్పారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ తరఫున పారిశుధ్యానికి సంబంధించి అనేక రకాల యంత్రాలను కొనుగోలు చేసి, వాటి ద్వారా చెత్త సేకరిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 311 పుష్ కార్ట్స్ (చేతితో నెట్టే బండ్లు), 982 ట్రైసైకిల్స్, 13 ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్ మెంట్ యూనిట్స్, 8 ఎలక్ట్రిక్ వెహికల్స్ కేటాయించినట్లు వివరించారు. ఒక్క రావినూతల గ్రామ పంచాయతీకే రూ.20 లక్షల విలువైన యంత్రాలను అందించనున్నట్లు తెలిపారు. ఈ యంత్రాల ద్వారా డోర్ టూ డోర్ వేస్ట్ సేకరణ మెరుగుపడాలన్నారు. తడిచెత్త, పొడి చెత్త వేరు చేయాలని చెప్పారు. పొడి చెత్తలోని ప్లాస్టిక్ కోసం ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్ మెంట్ యూనిట్ ఒకదానిని రావినూతల గ్రామంలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. రావినూతల గ్రామానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని, అలాగే, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలకు కూడా గ్రామస్తులు సహకరించాలని కోరారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా ఇప్పటి వరకు చేసినది ఒక ఎత్తైతే, ఇక ముందు చేయబోయేది చాలా ముఖ్యమైనదని, గ్రామాలలో మార్పు రావాలని అధికారులను ఉద్దేశించి చెప్పారు. గ్రామాలలో చిరకాలంగా పేరుకుపోయిన లెగసీ వేస్ట్ ని, అలా వదిలేయకుండా తొలగించాలన్నారు. పట్టణాలలోని దాదాపు 90 లక్షల టన్నుల చెత్తని తొలగించామని చెప్పారు. గత పాలకులు చెత్తపై పన్ను వేయడమే కాకుండా, డంపింగ్ యార్డులలో టన్నుల కొద్దీ చెత్త పేరుకుపోయే విధంగా చేశారన్నారు. ఆ చెత్తనంతా తొలగిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో డంపింగ్ యార్డు కనిపించకుండా చేయడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని, అందు కోసం ఆయన తమతో పని చేయిస్తున్నారన్నారు. డంప్ యార్డ్ ఫ్రీ స్టేట్ గా త్వరలో రాష్ట్రం అవతరించబోతుందని చెప్పారు. గ్రామాలలో పేరుకుపోయిన చెత్తని కూడా దగ్గరలో ఉన్న బయో మైనింగ్ సెంటర్లకు తరలించే ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా గ్రామాల ప్రజలు, అధికారులు కూడా పూర్తిగా సహకరించాలని కోరారు. అధికారులు ప్రభుత్వానికి సమర్పించే నివేదికల్లో మనల్ని మనం మోసం చేసుకోకుండా, ఉన్నవి ఉన్నట్లు వివరించమని కోరారు. ఏవైనా లోపాలు ఉన్నా తెలియజేయమని స్పష్టంగా చెప్పారు. సీఎం చంద్రబాబు త్వరలోనే గ్రామాలతో సహా ఆకస్మిక తనిఖీలు ప్రారంభించనున్నట్లు పట్టాభిరామ్ చెప్పారు. వేస్ట్ మేనేజమెంట్ ప్రాసెస్ ద్వారా మీరు ప్రాసెస్ చేసిన దానిని రీసైకిలర్స్ వచ్చి కొనుక్కొని తీసుకువెళతారన్నారు. తాము ఇచ్చిన యంత్ర సామాగ్రిని పూర్తిగా వినియోగించుకోమని పారిశుధ్య సిబ్బందికి, ఇతర సిబ్బందికి చెప్పారు. తాము ఇచ్చినవి చాలకపోతే, మరికొన్ని అడగండని, సమకూరుస్తామని చెప్పారు. వాటిని వినియోగించకుండా కొత్తవాటిని అడగొద్దన్నారు. చైర్మన్ పట్టాభిరామ్ తొలుత గ్రామంలోని ఎస్ డబ్ల్యూపీసీ(చెత్తను శుద్ధి చేసి సంపదగా మార్చే కేంద్రం)ను సందర్శించి, అక్కడ పనితీరును పరిశీలించారు. వర్కర్స్, సిబ్బంది, అధికారులను అడిగి అన్ని వివరాలు తెలుసుకున్నారు. అక్కడ సిబ్బంది సమస్యలను అర్థం చేసుకుని, పరిష్కార మార్గాలు చెప్పారు. అలాగే, గ్రామానికి రెండు ట్రై సైకిల్స్ ఇస్తామని, ప్రతి రోజూ ప్రతి ఇంటికి వెళ్లి వేస్ట్ ని సేకరించి, తడిచెత్త, పొడిచెత్త వేరుచేయాలని వివరంగా చెప్పారు. ఏపీ మారిటోరియమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యతో కలిసి పట్టాభిరామ్ ఇ-ఆటోని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఒంగోలు డీడీఓ సీహెచ్ సువార్త, కొనిశపాడు ఎంపీడీఓ ఎంఆర్ రాజ్యలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీఓ టీవై చంద్రసేన్, రావినూతల ఆర్ఎస్ సీఏ అధ్యక్షుడు కారుశాల నాగేశ్వరరావు (బాబు), సర్పంచ్, వార్డు మెంబర్లు, గ్రామపెద్దలు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

# యూరో కిడ్స్‌లో సంక్రాంతి సందడి







విజయవాడ

నగరంలోని చుట్టుగుంట యూరో కిడ్స్ పాఠశాలలో శుక్రవారం ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు తొలుత సంక్రాంతి సందర్భంగా ముగ్గులు వేశారు. పాఠశాల ఆవరణ అంతా పండుగ ఉట్టి పడే విధంగా గాలిపటాలు, చెరుకు గళ్ళు, ముగ్గులతో అందంగా అలంకరించారు. చిన్నారులు సాంప్రదాయ వస్త్రాలు ధరించి సందడి చేశారు. ఆట పాటలతో నృత్యాలు చేశారు. సంక్రాంతి పాటలు, గాలి పటాలు, హరిదాసుల కీర్తనలతో పాఠశాలలో సంక్రాంతి శోభ ఉట్టిపడింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు ప్రసన్న చిన్నారులకు భోగిపళ్లు పోశారు. సంక్రాంతి పండుగ విశిష్టతను తెలిపే బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రజాధనంతో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తే సహించేది లేదు

**బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్**

అమరావతి

రాజధానిలో ఎన్టీఆర్ విగ్రహం, స్మృతి వనం పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందనీ, ఉద్యోగులకు నెలనెలా జీతాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు ఇవ్వడానికే ప్రభుత్వం అప్పుల కోసం వెంపర్లాడుతోందని ఆయన విమర్శించారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో, ప్రజల కష్టార్జితాన్ని కంచు విగ్రహాల రూపంలో కరిగించివేయాలని చూడటం, ప్రభుత్వ ప్రాధాన్యతలు ఎంత దిగజారిపోయాయో తెలియజేస్తోందని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. "ఒకవైపు సంక్షేమ పథకాలకు కోతలు పెడుతున్నారు. మరోవైపు అభివృద్ధికి నిధులు లేవని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో, 3,500 టన్నుల కంచుతో, వేల కోట్ల రూపాయల వ్యయంతో భారీ విగ్రహాలు నిర్మించడం ప్రభుత్వ మూర్ఖత్వానికి పరాకాష్ట" అని బోడె రామచంద్రయాదవ్ విమర్శించారు. "ప్రజలు కట్టే పన్నులు, ప్రభుత్వం తెచ్చే అప్పులు... ప్రజల సంక్షేమం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం ఖర్చు చేయాలి కానీ, మీ రాజకీయ ప్రయోజనాల కోసం, మీ నాయకుల విగ్రహాల కోసం కాదు. ఎన్టీఆర్‌పై మీకు నిజంగా ప్రేమ, గౌరవం ఉంటే, మీ సొంత నిధులు, మీ పార్టీకి వచ్చే విరాళాలతో విగ్రహాలు కట్టుకోండి, ఎవరూ అడ్డుకోరు. కానీ, ఒక్క రూపాయి ప్రజాధనాన్ని కూడా ఈ విగ్రహాల కోసం ఖర్చు చేయడానికి వీల్లేదు" అని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. "తెలుగు వైభవం, తెలుగు తేజం అంటూ సాంస్కృతిక ముసుగులో ప్రభుత్వం చేస్తున్నది పచ్చి మోసం. నిజమైన తెలుగు వైభవం, పేదవాడి కడుపు నింపడంలో ఉంటుంది. నిజమైన తెలుగు తేజం, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడంలో ఉంటుంది. అంతేగానీ, కంచు విగ్రహాలలో కాదు. లైబ్రరీలు, నాలెడ్జ్ హబ్‌లు ఏర్పాటు చేయాలనే ఆలోచన మంచిదే అయినప్పటికీ, దానిని విగ్రహ రాజకీయాలతో ముడిపెట్టడం దురదృష్టకరం. ఆ నిధులను రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, యూనివర్సిటీలలో లైబ్రరీల అభివృద్ధికి, పరిశోధనలకు కేటాయిస్తే లక్షలాది మంది విద్యార్థులకు మేలు జరుగుతుంది" అని రామచంద్రయాదవ్ హితవు పలికారు. "ప్రజల అభిప్రాయం తీసుకుంటామని మంత్రులు చెప్పడం హాస్యాస్పదం. ఏ పేదవాడు, ఏ మధ్యతరగతి ఉద్యోగి తన పన్నుల డబ్బుతో విగ్రహాలు కట్టమని చెప్పడు. ఇది కేవలం కొందరి రాజకీయ అజెండాలో భాగం మాత్రమే. ఈ విషయంలో ప్రభుత్వం మొండిగా ఒక్క అడుగు ముందుకు వేసినా... బిసివై పార్టీ ఆధ్వర్యంలో ప్రజాధనంతో నిర్మించే విగ్రహ ఏర్పాటును అడ్డుకుని తీరుతాం. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదు. ముందు ప్రజల కనీస అవసరాలు తీర్చండి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచండి, అంతేగానీ విగ్రహ రాజకీయాలతో నిధులు దుర్వినియోగం చేస్తే చూస్తూ సహించేది లేదు" అని బోడె రామచంద్రయాదవ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## నారాయణ పాఠశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

గన్నవరం,



స్థానిక విద్యానగర్ నారాయణ పాఠశాలలో శుక్రవారం ఘనంగా సంక్రాంతి సంబరాలు జరిగాయి విద్యార్థులకు తెలుగు సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు పాఠశాల యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. పాఠశాల ఆవరణమంతా విద్యార్థులు వేసిన రంగురంగుల ముగ్గులతో గొబ్బెమ్మలతో కళకళలాడింది విద్యార్థులు అందరూ తెలుగువారి సంప్రదాయ దుస్తులతో మెరిసిపోతూ పండుగ వాతావరణం సృష్టించారు పండుగ వేడుకలో భాగంగా హరిదాసు కీర్తనలు, భోగిమంటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు ప్రదర్శించిన జానపద నృత్యాలు, సంక్రాంతి పాటలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యా యులు షేక్ మస్తాన్ భాషా మాట్లాడుతూ నేటి తరానికి మన పండుగలు ఆచార సంప్రదాయాలు వాటి గొప్పతనాన్ని తెలియజేయడమే ముఖ్య ఉద్దేశమ అని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మస్తాన్ భాషా, ఏజీఎం సత్తిరెడ్డి,ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపల్ అనూష, ఈ చాంప్స్ వైస్ ప్రిన్సిపల్ శిరీష, ఎకడమిక్ డీన్ నవీన, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## డిజిటల్ గ్రీన్, సిస్కో ఇండియా సహకారంతో రైతులకు ఏఐ ఆధారిత సలహా సేవలు ప్రారంభం

గుంటూరు




టెక్నాలజీ, డేటా ద్వారా భారతదేశంలోని చిన్న, సన్నకారు రైతులను శక్తివంతం చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యానవన శాఖ సహకారంతో, సామాజిక ప్రభావ సంస్థ డిజిటల్ గ్రీన్, సిస్కో ఇండియా మద్దతుతో రైతుల ఆదాయాలను మెరుగుపరిచేలా ఏఐ ఆధారిత, సమయోచితమైన మరియు ప్రాసంగికమైన వాతావరణానికి అనుకూలమైన (క్లైమేట్-స్మార్ట్) సలహాలను అందించే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఏఐ ఆధారిత సలహాల ద్వారా చిన్న, సన్నకారు రైతుల ఆదాయాల పెంపు అనే పేరుతో ప్రారంభించిన ఈ కార్యక్రమం.. చిన్న, సన్నకారు రైతులకు ఏఐ సహాయంతో స్థానికీకరించిన వ్యవసాయ సలహా సేవలను విస్తృతంగా అందుబాటు లోకి తీసుకురావడంలో ఒక కీలకమైన ముందడుగుగా నిలుస్తుంది. ఈ కార్యక్రమాన్ని చుట్టగుంటలోని కమిషనరేట్ కార్యాలయంలో ఉద్యానవన, పట్టు పరిశ్రమల డైరెక్టర్ డా. కె. శ్రీనివాసులు అధికారికంగా ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్‌లో ప్రధానంగా ఫార్మర్‌చాట్ అనే ఏఐ ఆధారిత, బహుమాధ్యమ (మల్టీమోడల్) మొబైల్ అప్లికేషన్ ఉంటుంది. ఇది డిజిటల్ గ్రీన్ ద్వారా అభివృద్ధి చేయబడినది. రైతులకు వాతావరణానికి అనుగుణమైన, అత్యంత స్థానిక (హైపర్‌లోకల్), బహుభాషా వ్యవసాయ సలహాలను అందిస్తుంది. ప్రాజెక్ట్ ప్రారంభ సందర్భంగా డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ, రాష్ట్ర ఉద్యానవన వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు నిరంతర మద్దతు మరియు క్రమమైన సమీక్షలకు తాము పూర్తిగా కట్టుబడి ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మొత్తం 50,000 మంది రైతులను చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు (25,000 మందిని ప్రత్యక్షంగా నమోదు చేయడం ద్వారా, మరో 25,000 మందిని డిజిటల్ మార్గాల ద్వారా), ఇందులో కనీసం 60 శాతం మహిళా రైతుల భాగస్వామ్యం ఉండేలా చూడనున్నారు. ప్రస్తుతం ఈ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్‌లోని ఎనిమిది జిల్లాలు, గుంటూరు, పల్నాడు, కర్నూలు, అనంతపురం, కృష్ణా, ఎన్టీఆర్, ప్రకాశం, సత్యసాయిలో అమలవుతుంది.

# కొంగర కలాన్ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో మాక్ పార్లమెంట్







**ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నం మండలం కొంగర కలాన్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాక్ పార్లమెంటు పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ ఆధ్వర్యంలో విద్యార్థులతో పార్లమెంటు సభ్యులు ఎంతమంది, అధికార ప్రతిపక్ష పాత్ర ఏమిటి, ప్రతిశాఖకు మంత్రులు చేసే పనులు ఏవి, వారికి ప్రశ్నలు, సమాధానాల గురించి కార్యక్రమం నిర్వహించడమే కాకుండా స్పీకర్ విధులను వివరించారు.ఈ కార్యక్రమంలో లోక్ సభ స్పీకర్ 10వ తరగలు విద్యార్థిని కె. అభినయ, ప్రధానమంత్రిగా గ. దక్షిత హోంశాఖ మంత్రిగా సిహెచ్. రాంచరణ్ మరియు ప్రతిపక్ష నేతగా కోల ఆకాష్, మరో 30 మంది విద్యార్థులు క్యాబినెట్ మినిస్టర్స్ గా, ఎంపీలుగా పాల్గొని చక్కని వాగ్దాటితో చర్చలో పాల్గొని ఆపరేషన్ సిందూర్" విజయాన్ని అందించిన సైనికులకు వందనాలు అర్పించారు. వీబి -జీ -ర్యామ్ -6 బిల్లుపై చర్చించి మూజు వాణి ఓటుతో బిల్లును ఆమోదించారు. అనంతరం క్వచన్ అవర్, బిరో అవర్ లో ప్రతిపక్ష సభ్యుల ప్రశ్నలకు సంబందిత శాఖల మంత్రులు సమాదానాలిచ్చారు. సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీచే నిర్వహించి బహుమతులు ప్రధానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రదాన ఉపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్పర్సన్ టి.సునిత, పాఠశాల ఉపాధ్యాయులు పాండు మరియు ఉపాధ్యాయబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన తహసీల్దార్ కార్యాలయంను ప్రారంభించిన ఏమ్మెల్యే మల్ రెడ్డి

## ప్రజలకు మరింత సులభంగా, వేగంగా ప్రభుత్వ సేవలు అందించడమే మా లక్ష్యం





**ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నంలో నూతన తహసిల్దార్ కార్యాలయాన్ని ఏమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి,ఆర్డీఓ అనంత రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లడుతూ...ప్రజలకు అన్నీ సేవలు అందుబా టులో ఉండాలని దాదాపు 2.25 కోట్ల రూపాయలతో (డిఎంఎస్ ఫండ్స్) తో నిర్మించిన నూతన తహసీల్దార్, జా యింట్ సబ్ రిజిస్టర్, ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కార్యాలయంను నిర్మించి,ప్రారంభోత్సవం చేసామాన్నారు.ప్రజలకు మరింత సులభంగా, వేగంగా ప్రభుత్వ సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని భూ సంబంధిత సేవలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, కుల ధ్రువీకరణ వంటి సేవలు ఇక మరింత సౌకర్యవంతంగా ఆధునిక వసతులతో, ప్రజల అవసరాలకు అనుగుణంగా నూతన తహసీల్దార్ కార్యాలయం పరిపాలనలో పారదర్శకతని, ప్రజా సేవల్లో వేగం కోసం మరో ముందడుగు వేసామన్నారు. ముఖ్యంగా ప్రజల సంక్షేమమే తమ ధ్యేయమని, నియోజకవర్గ అభివృద్ధి తమ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, ఎమ్మార్వో సునీత,నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్, ఆర్ఐలు సువర్ణ, నరసింహ,ఏఎంసి చైర్మన్ గురునాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ కారుణకర్ తదితరులు పాల్గొన్నారు.


## ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికిన ఆర్డీఓ అనంత రెడ్డి.

ఇబ్రహీంపట్నంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభించడానికి వచ్చిన ఎమ్మెల్యే మాల్ రెడ్డి రంగారెడ్డి.



**ఇబ్రహీంపట్నం :** ००००० ఇబ్రహీంపట్నంలో నూతనంగా 2.25కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయంను ప్రారంభోత్సవానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి పూల గూప్పం ఇచ్చి ఇబ్రహీంపట్నం తూర్పు డివిజన్ ఆర్డీఓ అనంత రెడ్డి, తహసీల్దార్ సునీత స్వాగతం పలికారు.ఈ సందర్భంగా అనంతరెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వం కొత్త ఏర్పాటు చేసిన భూ భారతి సేవలతో పాట, భూ సంబంధిత సేవలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, కుల ధ్రువీకరణ వంటి సేవలు ఇక మరింత వేగంగా ఉండాలని ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం రెవన్యు అధికారులు,నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్,ఆర్ఐలు సువర్ణ,నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న గోడుకొండ్ల సర్పంచ్ కాశగోని వెంకటయ్య




చింతపల్లి : చింతపల్లి మండలంలోని గోడకొండ్ల గ్రామం మాల్ పట్టణంలో ఉన్న రెయిన్బో పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ కాశగోని వెంకటయ్య హాజరై మాట్లాడారు. సంక్రాంతి పండుగ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. పండుగలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, సంస్కృతి సంప్రదాయాలను తరతరాలకు అందించడంలో పండుగల పాత్ర కీలకమన్నారు. విద్యార్థులు పండుగను ఆనందం, ఉత్సాహాలతో జరుపుకోవాలని సూచించారు.అనంతరం పాఠశాల యాజమాన్యం సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తుమ్మడ గోని శంకర్, అంకం శ్రీనివాస్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓసీ సింహ గర్జన పోస్టర్ ఆవిష్కరణ

**ఎల్బీనగర్ :** చలో వరంగల్ ఓసీల సింహ గర్జన భారీ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణలో తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వ తేదీ ఆదివారం వరంగల్ లోజరిగే ఓసిల సింహగర్జన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలనే నేపథ్యంలో తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య పిలుపుమేరకు ఓసి జెఏసి వర్కింగ్ ప్రెసిడెంట్ టి పశుపతి నేతృత్వంలో తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య అధ్యక్షులు పోచంపల్లి రమణారావు నేతృత్వంలో పోస్టర్ ను ఆవిష్కరించారు. శుక్రవారం నాడు నాగోల్ మోహన్ నగర్ లో ఓసీల సింహగర్జన బహిరంగ సభను జయప్రదం చెయ్యాలనే సందర్భంగా తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య అధ్యక్షులు పోచంపల్లి రమణారావు మాట్లాడుతూ మనం ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలని ఇప్పుడు పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని అన్నారు. ప్రభుత్వాలను అడిగేందుకు ఓసీల సింహగర్జన సభ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓసి



జెఏసి అధ్యక్షులు తాడిశెట్టి పశుపతి మాట్లాడుతూ మన ఓటు బ్యాంకు శాతం తక్కువేమీ కాదని పార్టీలకు అతీతంగా మనం పోరాటం చేస్తే ప్రభుత్వం మన పోరాటానికి దిగి వస్తుందని అన్నారు. వరంగల్ లోజరిగే సభను విజయవంతం చేయాలని, వారు కోరారు ఈ కార్యక్రమంలో, తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవులపల్లి రంగారావు, బ్రాహ్మణ సంఘ సమాఖ్య కోశాధికారి ఊరే ప్రసాదరావు దేవులపల్లి అశోక్ కుమార్, తడకమళ్ళ రంగ సాయి, జయరాం గూడా, గూడా రాజేష్, అక్కినేపల్లి వెంకటేశ్వరరావు ఓసి జెఏసి సభ్యులు, ప్రసాద్ బొమ్మ గంటి ప్రసాద్, మాచర్ల వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల రీకౌంటింగ్ వ్యవహారంలో కోర్టు సీరియస్




**యాచారం :** యాచారం మండలం చింతుళ్ల సర్పం చ్ ఎన్నికల రీకౌంటింగ్ వ్యవహారంలో ఇబ్రహీంపట్నం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కేవలం ఒక్క ఓటు తేడాతో అభ్యర్థి ఓడిపోవడం, పదేపదే కోరినా ా ఆనంద్ జోసెఫ్ రీకౌం టింగ్ చేయకపోవడాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో స్పష్టంగా కనిపించడంతో ఆర్ఓ తో పాటు సంబంధిత అధికారులకు కోర్టు నోటీసులు జారీ చేసింది.

## 11న ఉప్పల్‌లో వడ్డెర ఓబన్న 129వ జయంతి వేడుకలు



**దేవరకొండ :** రేనాటి యోధుడు, స్వాతంత్ర సమరయోధుడు వడ్డెర ఓబన్న 129వ జయంతి కార్యక్రమం ఈనెల 11వ తేదీన హైదరాబాద్ ఉప్పల్‌లోని భగత్ వడ్డెర భవన్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం వడ్డెర సంఘం అధ్యక్షులు ఇరగదిండ్ల కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి వడ్డెర కుల బంధువులు భారీ ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్ని పనులు ఉన్నా వాటిని పక్కనపెట్టి, అందరూ కలిసికట్టుగా జయంతి వేడుకల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ జయంతి వేడుకలను తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివరాత్రి ఆయిల్ మల్లు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పీట్ల మల్లేష్, అలాగే రాష్ట్ర కమిటీలో వివిధ హోదాల్లో ఉన్న నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

## పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరి అరెస్ట్ రిమాండ్‌కు




చింతపల్లి : చింతపల్లి మండలం పోలీస్ స్టేషన్ కి ఈనెల 3వ తేదీన డయల్100కు విధులు నిర్వహిస్తున్న చింతపల్లి పోలీసు సిబ్బందితో మద్యం మత్తులో దురుసుగా ప్రవర్తించి, పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఘటనకు సంబంధించి దేవరకొండ మండలం రత్యా తండాకు చెందిన రమావత్ కోటయ్య, వద్యా గణేష్‌లను శుక్రవారం అరెస్టు చేసి న్యాయ రిమాండ్‌కు తరలించారు.ఈ సందర్భంగా చింతపల్లి ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి మాట్లాడుతూ, పోలీసు విధులకు ఆటంకం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల భద్రత కోసమే పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని,అందరూ సహకరించాలని సూచించారు.

## ప్రాథమిక పాఠశాలలో నూతన పాలకవర్గానికి సన్మానం




**చింతపల్లి :** చింతపల్లి మండలం కురుమేడు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కంబాలపల్లి చెన్నమ్మ లాలయ్య, ఉపసర్పంచ్ అనంతుల పవన్ కుమార్‌లతో పాటు వార్డు సభ్యులు కురుమేటి శిరీష వెంకటేష్, గౌని విజయ శ్రీకాంత్ సీత పవన్ కళ్యాణ్, కురుమేటి తరుణ్, నాదిరి పురుషోత్తం, గోరటి కవిత శేఖర్‌లను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అలాగే మాజీ ఎంపీటీసీ కుంభం శ్వేత శ్రీశైలంను కూడా ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా గౌరవించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, గ్రామాభివృద్ధితో పాటు విద్యా ప్రగతికి పాలకవర్గ సభ్యుల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రాహుల్, సీఎం రేవంత్‌పై కేటీఆర్ వ్యాఖ్యలు సరికాదు

యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చింతకుంట్ల రాకేష్



**దేవరకొండ :** లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను దేవరకొండ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చింతకుంట్ల రాకేష్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నత హోదాల్లో ఉన్న నాయకులపై బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు.గత రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని రాకేష్ తెలిపారు. రైతులు, యువత, మహిళలు, పేదల సంక్షేమం కోసం అనేక కీలక నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే కేటీఆర్ ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు.రాజకీయ విమర్శలు హద్దులు దాటకూడదని, వ్యక్తిగత దూషణలకు తావులేకుండా ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని సూచించారు. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని ప్రజలకు క్షమాపణ చెప్పాలని చింతకుంట్ల రాకేష్ డిమాండ్ చేశారు.